thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 215 | కరీంనగర్ ఆదివారం, 12 అక్టోబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

### ఆస్ట్రేలియా విద్యార్థి వీసా నిబంధనలు కఠినతరం

న్యూఢిల్లీ : వివిధ దేశాల్లో విదేశీ విద్యార్థులకు నిర్దేశించిన నిబంధనల్లో పలు మార్పులు చోటుచేసుకున్నాయి. ఆయా దేశాల్లో వివిధ విశ్వవిద్యాలయాల క్యాంప్‌సల ఎంపికను ఈ మార్పులు ప్రభావితం చేస్తాయి. ఈ మధ్య కాలంలో ఆస్ట్రేలియాను ఎంపిక చేసుకొనే భారతీయ విద్యార్థుల సంఖ్య భారీగా పెరిగింది. 2004లో 1,18,109 మంది విద్యార్థులు ఆస్ట్రేలియాలోని పలు విశ్వవిద్యాలయాలను ఎంపిక చేసుకొన్నారు. తమ విద్యార్థి వీసా నిబంధనల్లో పేర్కొనదగ్గ మార్పులను చేయనున్నట్లు గత ఏడాది ఆస్ట్రేలియా ప్రకటించింది. ఇప్పటి వరకూ ఆ దేశానికి వెళ్లే విదేశీ విద్యార్థుల సంఖ్యపై పరిమితి లేదు. తాజాగా పరిమితి విధించాలని నిర్ణయించినట్లు సమాచారం.

# వికసిత్ భారత్‌లో రైతులదే కీలక పాత్ర!

## రైతుల శ్రేయస్సు కోసం లెక్కలేనన్ని సంస్కరణలు తెచ్చాం..

## దిగుమతులపై ఆధారపడొద్దు.. ఆ పంట సాగును పెంచండి: మోదీ




దేశం వికసిత్ భారత్ వైపు అడుగులు వేయడంలో రైతులు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడకుండా ఉండాలంటే.. కేవలం వరి, గోధుమ పంటల పైనే కాకుండా ప్రొటీన్ అధికంగా లభించే పప్పులకు సంబంధించిన సాగును మరింత పెంచాలని రైతులకు సూచించారు. ప్రపంచ మార్కెట్‌లకు ఎగుమతి చేసేలా వాణిజ్య పంటలను పండించాలన్నారు. దేశంలో పంటల ఉత్పత్తికి అయ్యే ఖర్చులు తగ్గించి.. రైతుల ఆదాయం పెంచే దిశగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో పదేళ్లలో వ్యవసాయ రంగంలో కేవలం రూ.5 లక్షల కోట్ల సబ్సిడీలు ఇస్తే.. తమ ప్రభుత్వం పదేళ్లలో రైతులకు రూ.13 లక్షల కోట్లకు పైగా సబ్సిడీలు ఇచ్చిందని పేర్కొన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే అన్ని రంగాల్లో నిరంతరం కొత్త మార్పులు చోటుచేసుకోవాలని ప్రధాని పేర్కొన్నారు. ఈ ఆలోచనలో భాగంగానే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన పథకాన్ని తీసుకువచ్చినట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు దేశంలోని 100కు పైగా జిల్లాలను వెనకబడిన జిల్లాలుగా ప్రకటించి.. ఆపై వాటిని పూర్తిగా మరిచిపోయాయని ప్రధాని మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ వెనకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించి, వాటిని ఆశావహ జిల్లాలుగా ప్రకటించినట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం ప్రత్యేక ప్రాజెక్టులను అమలుచేస్తోందన్నారు. వీటన్నింటినీ ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కిందకు తీసుకువస్తున్నట్లు తెలిపారు.

**ప్రధానిపై రైతు అభిమానం.. వరి పంటతో మోదీ చిత్రం...**
వెనకబడిన జిల్లాలలోని అనేక ప్రాంతాల్లో గత పాలకులు రోడ్లు కూడా వేయించలేదని.. అటువంటి వాటిని తమ ప్రభుత్వం డిజిటల్ ఇండియా దిశగా నడిపిస్తోందన్నారు. గ్రామీణప్రాంత ప్రజలకు విద్య, వైద్యం, నివాసం, విద్యుత్, రోడ్డు వంటి అన్నిరకాల సదుపాయాలు కల్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత పదకొండేళ్లలో రైతులు పలు విజయాలు సాధించారని.. పదివేలకు పైగా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పడ్డాయన్నారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 11 ఏళ్లుగా రైతుల అభివృద్ధి, స్వయం సమృద్ధికి ఎన్నో చర్యలు తీసుకుందని వివరించారు. న్యూఢిల్లీలోని అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో శనివారం నాడు జరిగిన ప్రత్యేక కృషి ప్రోగ్రాంలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా గత నెలలో అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ సంస్కరణతో రైతులు, దేశంలోని గ్రామీణ రంగానికి మరింత ప్రయోజనం చేకూరిందని మోదీ చెప్పారు. రైతుల ఆదాయం పెంచేందుకు, పంటల సాగు వ్యయం తగ్గించేందుకు గత పదేళ్లుగా ఎన్డీయే ప్రభుత్వం ఎరువులపై రూ.13 లక్షల కోట్ల సబ్సిడీ ఇచ్చిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. యూపీఏ పదేళ్లలో రూ.5 లక్షల కోట్లు మాత్రమే సబ్సిడీగా ఇచ్చిందన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు వ్యవసాయరంగానికి ప్రభుత్వం బాసటగా నిలుస్తోందని వివరించారు. గత ప్రభుత్వాలకు వ్యవసాయంపై ఎలాంటి విజన్ లేదని విమర్శించారు. వ్యవసాయరంగానికి సంబంధించిన వివిధ శాఖలు ఇష్టారీతిలో వ్యవహరించడం వల్ల దేశంలోని వ్యవస్థాయ వ్యవస్థ బలహీనమవుతూ వచ్చిందన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిలో మార్పులు చేస్తూ విత్తనాల దగ్గర నుంచి మార్కెట్ వరకూ రైతులకు ప్రయోజనాలు చేకూరే లెక్కలేనని సంస్కరణలు తెచ్చామని చెప్పారు.

**వ్యవసాయ ఎగుమతులు రెట్టింపు...** దేశ వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు దాదాపు రెట్టింపయ్యాయని, ఆహారధాన్యాలు, పళ్లు, కాయగూరల ఉత్పత్తి సుమారు 90 మిలియన్ మెట్రిక్ టన్నులకు పెరిగిందని, గతంలో ఇది 64 మిలియన్ మెట్రిక్ టన్నులుగా ఉండేదని చెప్పారు. 2014 నుంచి తేనె ఉత్పత్తి రెట్టింపు అయిందని అన్నారు. అభివృద్ధి భారతాన్ని కోరుకుంటే ప్రతి రంగంలోనూ ఇండియా బలపడాల్సి ఉంటుందన్నారు. ఏవో కొన్ని సాధించినంత మాత్రాన తృప్తి పడిపోరాదని సూచించారు. వెనుకబడిన ప్రాంతాలపై దృష్టి పెట్టినప్పుడే గణనీయమైన ఫలితాలు ఉంటాయన్నారు. ఇవాళ యాస్పిరేషనల్ జిల్లాల్లో ప్రసూతి మరణాలు తగ్గాయని, చైల్డ్ హెల్త్ మెరుగైందని, విద్యాప్రమాణాలు పెరిగాయని చెప్పారు. దీంతో ఈ జిల్లాలు ఇతర జిల్లాల కంటే మెరుగైన రీతిలో దూసుకెళ్తున్నాయని, ఈ మోడల్ ఆధారంగా వ్యవసాయంలో వెనుకబడిన 100 జిల్లాలను అభివృద్ధి చేసేందుకు దృష్టి సారించామని, ఇందువల్ల అవి మరింత మెరుగైన జిల్లాలుగా మారనున్నాయని చెప్పారు.




# స్థానిక పోరు

## సుప్రీం వైపే... సర్కార్ మొగ్గు!

### 42శాతం రిజర్వేషన్లు అమలు జరిగేలా బిగ్ ప్లాన్..

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన విషయం తెలిసిందే. అయితే, బీసీల రిజర్వేషన్లకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటీషన్లు దాఖలయ్యాయి. వాటిపై విచారణ జరిపిన హైకోర్టు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ల జీవోను, ఎన్నికల నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. తాజాగా.. హైకోర్టు తీర్పుపై తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. హైకోర్టు తీర్పును స్టడీ చేసిన తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించింది. సీనియర్ కౌన్సిల్ తో సుప్రీంకోర్టులో వాదనలు వినిపించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమవుతోంది. హైకోర్టు ఇచ్చిన స్టేను ఎత్తివేసి ఎన్నికల నిర్వహణకు అనుమతి కోరాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఎన్నికల ప్రక్రియ, నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైనందున ఇందులో హైకోర్టు జోక్యం సరికాదని రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ప్రధానంగా వాదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీసీ రిజర్వేషన్ బిల్‌పై హైకోర్టు తీర్పు కాపీలో కీలక అంశాలను పేర్కొంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు గురువారం స్టే విధించగా ఆ ఉత్తర్వుల పూర్తి వివరాలు అర్ధరాత్రి అందుబాటులో వచ్చాయి. రిజర్వేషన్లు 50శాతం దాటకుండా ఎన్నికలు నిర్వహించుకోవచ్చునని హైకోర్టు స్పష్టం చేసింది. గడువు తీరిన స్థానిక సంస్థలకు పాత విధానం ప్రకారం రిజర్వేషన్లు 50శాతం దాటకుండా ఎన్నికలు నిర్వహించుకోవచ్చని కోర్టు తెలిపింది. పెంచిన 17% సీట్లను ఓపెన్ కేటగిరీగా నోటిఫై చేసి ఎన్నికలు జరపాలని పేర్కొంది. అయితే, హైకోర్టు తీర్పును స్టడీ చేసిన ప్రభుత్వం.. సుప్రీంకోర్టుకు వెళ్లాలని నిర్ణయించింది.




### ఏఐ హబ్, టీస్క్వేర్‌పై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

హైదరాబాద్ : ఐకానిక్ బిల్డింగ్‌గా వి-హబ్ ఉండేలా నిర్మాణం చేయాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం ఏఐ హబ్, టీస్క్వేర్ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, స్పెషల్ చీఫ్ సెక్రటరీలు జయేష్ రంజన్, సంజయ్ కుమార్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, టీజీఐఐసీ ఎండీ శశాంక, టీ ఫైబర్ ఎండీ వేణుప్రసాద్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేశ్ మిశ్రా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నవంబర్ నెల చివరి కల్లా వి హబ్ పనులు ప్రారంభం కావాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. వి హబ్ నిర్మాణం కోసం జైకా ఫండ్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. వి హబ్ నిర్మాణంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని.. పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని చెప్పారు. వి హబ్‌లో ఆపిల్ లాంటి ఇంటర్నేషనల్ బ్రాండ్స్ తమ ఔట్లెట్స్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచనలు చేశారు. యుటిలిటీ జోన్ ఏర్పాటు చేయడంతోపాటుగా వి హబ్ 24 గంటలపాటు పని చేయాలన్నారు. ఏఐ హబ్ తాత్కాలిక ఏర్పాటు కోసం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీల్లో భవనాలను పరిశీలించాలని ఆదేశించారు. ఏఐ హబ్ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన ఏఐ సంస్థల ప్రతినిధులతో బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు.




### ఢిల్లీకి చేరిన భాజపా అభ్యర్థి ఎంపిక ప్రక్రియ

హైదరాబాద్: భాజపా జూబ్లీహిల్స్ ఉపఎన్నిక అభ్యర్థి ఎంపిక ప్రక్రియ ఢిల్లీకి చేరింది. అభ్యర్థిని ఖరారు చేసేందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఢిల్లీకి చేరుకున్నారు. పార్టీ జాతీయ ముఖ్య నేతలు సునీల్ బన్సల్, బీఎల్ సంతోష్‌తో ఆయన భేటీ కానున్నారు. రాష్ట్ర ఎన్నికల కమిటీ ఖరారు చేసిన ముగ్గురు అభ్యర్థుల జాబితాను రామచందర్‌రావు జాతీయ నాయకత్వానికి అందించనున్నారు. పార్లమెంటరీ పార్టీ బోర్డులో చర్చ అనంతరం భాజపా అభ్యర్థిని ప్రకటించనుంది.

# గోదావరి పుష్కరాలు ఈ సారి ప్రత్యేకం

## కుంభమేళా తరహాలో వసతి, సౌకర్యాలు..!!



గోదావరి పుష్కరాల కోసం కసరత్తు మొదలైంది. పెద్ద సంఖ్యలో వచ్చే యాత్రికులకు అనుగుణంగా ఏర్పాట్ల పైన ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. గత అనుభవాలను పరిగణలోకి తీసుకొని కార్యాచరణ ఖరారు చేస్తున్నారు. ఇప్పటికే ప్రాథమిక నివేదికలు రెడీ అయ్యాయి. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళాలో మాదిరిగానే ఇక్కడ కూడా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. ఇందు కోసం అంతర్జాతీయ కన్సెల్టెన్సీ సంస్థకు బాధ్యతలు అప్పగించనున్నారు. 2027 లో గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది. పుష్కరాలకు వచ్చే లక్షలాది యాత్రికులను దృష్టిలో పెట్టుకొని కల్పించాల్సిన సౌకర్యాలపై కసరత్తు చేస్తున్నారు. భక్తులు వచ్చే రహదారి మార్గాలు, విడిది సౌకర్యాలు, సేద తీరేందుకు ప్రత్యేక శిబిరాలు, రవాణా సౌకర్యం, పార్కింగ్ వ్యవస్థ, స్నానఘట్టాల వద్ద ప్రమాదాలు జరగకుండా ఏర్పాట్లు, రద్దీ నియంత్రణపై దృష్టి సారిస్తున్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన కుంభమేళాలో మాదిరిగానే ఇక్కడ కూడా ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నారు. కుంభమేళా ఏర్పాట్ల బాధ్యత అంతర్జాతీయ సంస్థ అయిన ఈవై(ఎర్నెస్ట్ అండ్ యంగ్) సంస్థ కుంభమేళాలో భక్తుల రద్దీ నియంత్రణపై ప్రణాళికలు రూపొందించింది. ఈ సంస్థ ప్రభుత్వ శాఖల సమన్వయంతో నిర్వహణ బాధ్యతలు పర్యవేక్షిస్తారు.

సంస్థ ప్రతినిధులు పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రణాళిక రూపొందించారు. గోదావరి పుష్కరాల కోసం యాత్రికులు నగరానికి వచ్చే మార్గాలు, అక్కడ నుంచి ఘాట్‌ల వద్దకు రావడం, స్నానాలు, తిరిగి వెళ్లే వరకు అడుగడుగునా పూర్తి భద్రతతో తీసుకొనే చర్యలపై ప్రతిపాదనలు సమర్పించనుంది. అందులో భాగంగా పోలీసులు, రెవెన్యూ, ర.భ, వైద్య, ఆరోగ్య, జలవనరుల శాఖలు, మున్సిపల్ పరిధిలో చేపట్టాల్సిన విధులపై ముందుగానే సిబ్బందికి శిక్షణ ఇస్తారు. ఇప్పటికే ప్రభుత్వం 2027లో గోదావరి పుష్కరాల కు రూ.904 కోట్లతో ఘాట్‌ల విస్తరణ చేపట్టనున్నారు. పుష్కరాలు జరిగే ఐదు జిల్లాల్లో ఆలయాల మరమ్మతుల కోసం నిధులు కేటాయించారు. పుష్కరాలు ఏపీలో అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలో ప్రవహిస్తుంది.

గత పుష్కరాల్లో 202 ఘాట్లు ఏర్పాట్లు చేశారు. ఇందులో కుడివైపు 127, ఎడమవైపు 75 ఘాట్లు ఉన్నాయి. ఈసారి మరిన్ని ఘాట్లు పెంచేందుకు కసరత్తు జరుగుతోంది.




## బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు అంశం..

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ హైకోర్టు ఇటీవల స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేదని ఉత్తర్వుల్లో ఉన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. జీవో 9, 41పై మాత్రమే మధ్యంతర స్టే ఇచ్చినట్లు పేర్కొంది. పాత రిజర్వేషన్లతో ఎన్నికలు నిర్వహించుకోవచ్చని తెలిపింది. ఈ క్రమంలో న్యాయ నిపుణులతో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) చర్చలు చేపట్టింది. వారి సూచన మేరకు తదుపరి నిర్ణయం తీసుకోనుంది.




## ఈ నెల 14న తెలంగాణ బంద్ నిర్వహిస్తాం: ఎంపీ ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్, అక్టోబర్ 11: తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ హైకోర్టు స్టే ఇచ్చింది. ఇందుకు నిరసనగా బీసీ నేత, ఎంపీ ఆర్.కృష్ణయ్య ఈనెల 14న రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. అందులో భాగంగా తెలంగాణ బంద్‌కు బీజేపీ మద్దతు కోరారు ఎంపీ. ఇదే విషయంపై ఈరోజు (శనివారం) కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో ఆర్.కృష్ణయ్య భేటీ అయ్యారు. అనంతరం ఎంపీ మీడియాతో మాట్లాడుతూ.. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ జీవోపై హైకోర్టు స్టే ఇవ్వడం, ప్రభుత్వ నిర్లక్ష్యంపై నిరసన వ్యక్తం చేస్తూ.. ఈనెల 14న రాష్ట్రవ్యాప్తంగా బంద్ నిర్వహిస్తామని తెలిపారు. అన్ని బీసీ సంఘాల మద్దతుతో బంద్ నిర్వహించనున్నట్లు చెప్పారు. అందరూ కలిసి బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు, కుల సంఘాలు మద్దతు ఇవ్వాలని కోరడం జరిగిందన్నారు. బంద్‌కు బీజేపీ మద్దతు ఇవ్వాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కోరడం జరిగిందని తెలిపారు. దీనిపై పార్టీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కిషన్ రెడ్డి చెప్పారని అన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక కోర్టులు జోక్యం చేసుకోవడం ఏంటని ప్రశ్నించారు. బీసీ సంఘాలు ఇప్పటికే పెద్దఎత్తున రౌండ్ టేబుల్ సమావేశం, నిరసనలు, ధర్నాలు చేస్తున్నారని ఎంపీ ఆర్.కృష్ణయ్య వెల్లడించారు.

## 16న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

హైదరాబాద్: ఈ నెల 16న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, బీసీ రిజర్వేషన్ల అంశంపై ఇందులో చర్చించే అవకాశముంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సందిగ్ధం ఏర్పడిన నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

## కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారినా.. వరి సాగులో రికార్డు సాధించాం: మంత్రి ఉత్తమ్



హనుమకొండ: దేశంలోనే అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డులకెక్కిందని తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. త్వరలో ధాన్యం కొనుగోళ్లు కూడా ప్రారంభమవుతాయన్నారు. మంత్రి సీతక్కతో కలిసి హనుమకొండలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “కాళేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా ఉంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నుంచి చుక్కనీరు లిఫ్ట్ చేయకుండా మేం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ మూడో పంటలో కూడా భారతదేశంలో అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ రికార్డు సృష్టించింది. ఈ సీజన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 108.5లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పడుతోంది. దాంట్లో 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేయబోతోంది. భారత దేశంలో ఇంత ధాన్యం ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కొనుగోలు చేయలేదు. గోదావరి, కృష్ణా జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందంటే అది భారత రాష్ట్ర సమితి పాలనలోనే. కృష్ణా జలాల్లో 511 టీఎంసీలు ఏపీ ప్రభుత్వం తీసుకోవచ్చని, తెలంగాణకు కేవలం 299 టీఎంసీలు చాలని సంతకాలు చేసింది కేసీఆర్ ప్రభుత్వమే. మన నీటి హక్కులు కాపాడే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకెళ్తున్నాం. నీటి వాటాల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలే. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకిస్తోంది. ఇదే విషయాన్ని గతంలో అనేక సార్లు చెప్పాం. కర్ణాటకలో అల్మట్టి డ్యాం ఎత్తు పెంపును కూడా వ్యతిరేకిస్తున్నాం. కృష్ణా జలాల్లో 70 శాతం తెలంగాణకే కేటాయించాలని మేం వాదనలు వినిపిస్తున్నాం. పదేళ్లలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు మాత్రమే నిర్మించింది. అది కూడా మూడేళ్లకే కూలింది” మంత్రి ఉత్తమ్ అన్నారు.




హైదరాబాద్: వరంగల్‌లోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉత్పత్తిపై భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు ఆయన ‘ఎక్స్’ వేదికగా పోస్టు చేశారు. మొదటి యూనిట్ ఉత్పత్తి ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ మార్కెట్లకు టీషర్టులు ఎగుమతి చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 2023లో కాకతీయ టెక్స్‌టైల్ పార్కులో ఫ్యాక్టరీలకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. 11 యంగ్ వన్ కార్పొరేషన్ ఫ్యాక్టరీలకు భూమిపూజ చేశామన్నారు.
అన్ని యూనిట్లు ప్రారంభమైతే.. వరంగల్ ప్రధాన వస్త్ర కేంద్రంగా మారుతుందని వివరించారు. ‘వ్యవసాయం నుంచి ఫ్యాషన్’ నినాదంతో టెక్స్‌టైల్ పార్కును స్థాపించినట్లు కేటీఆర్ చెప్పారు.

## నీళ్లు తరలించుకుపోతున్నా సీఎం ఎందుకు స్పందించట్లేదు?: హరీశ్‌రావు



హైదరాబాద్: 423 టీఎంసీల గోదావరి జలాలను ఏపీ మళ్లిస్తోందని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. నీళ్లు తరలించుకుపోతున్నా సీఎం రేవంత్‌రెడ్డిస్పందించట్లేదని విమర్శించారు. ఆయన ఎందుకు స్పందించట్లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎంగా ప్రజా ప్రయోజనాలు కాపాడతారా.. స్వార్థ ప్రయోజనాలు చూసుకుంటారా? అని ప్రశ్నించారు.
తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. “బనకచర్ల ప్రాజెక్టును పరిశీలిస్తున్నామని కేంద్రం లేఖ రాసింది. కేంద్రం లేఖపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించట్లేదో చెప్పాలి. గోదావరి జలాలను ఏపీ, మహారాష్ట్ర తరలిస్తామని చెబుతున్నాయి. కృష్ణా జలాలను తరలిస్తామని కర్ణాటక, మహారాష్ట్ర చెబుతున్నాయి” అని హరీశ్‌రావు తెలిపారు.

## వరంగల్ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటి?: కొండా మురళి



వరంగల్: వరంగల్ జిల్లా రాజకీయాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి జోక్యం చేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ నేత కొండా మురళి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ జిల్లాలో పొంగులేటి పెత్తనం ఏంటని ఆయన ప్రశ్నించారు. దీనిపై ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. దేవాదాయ శాఖలో పొంగులేటి జోక్యంపై పార్టీ జాతీయ అధ్యక్షుడు ఖర్గేకు ఫిర్యాదు చేశారు. మేడారం టెండర్ల వ్యవహారంపై ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పొంగులేటి సొంత కంపెనీకి పనులు ఇప్పించుకున్నారని అందులో ఆరోపించారు.
ఈ వ్యవహారంలో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలతోపాటు మీనాక్షి నటరాజన్‌కు సైతం కొండా మురళి ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో హైకమాండ్ నుంచి సానుకూల స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు.

## గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బనకచర్ల జీవోలు: మహేశ్‌కుమార్ గౌడ్



నిజామాబాద్: బనకచర్ల విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు చేతులు దులుపుకొనే ప్రయత్నం చేస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే బనకచర్ల జీవోలు వెలువడ్డాయన్నారు. రాయలసీమను రత్నాల సీమ చేస్తానన్నది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. నిజామాబాద్‌లో మీడియాతో మహేశ్ కుమార్‌గౌడ్ మాట్లాడారు. “జగన్‌తో కేసీఆర్ చెట్టాపట్టాలు వేసుకుని విందులు, వినోదాలు చేసుకున్నారు. ప్రజల హక్కుల విషయంలో మాత్రం మౌనం వహించారు. బనకచర్ల విషయంలో ఒక చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదు. బనకచర్లపై మంత్రులు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లతో వివరించే ప్రయత్నం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కట్టుబడి అమలు చేస్తాం. హైకోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో సుప్రీంకోర్టులో అప్పీల్ చేసే యోచనలో ఉన్నాం. బీసీ రిజర్వేషన్ల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చాకే ఎన్నికలకు వెళ్తాం ” అని ఆయన స్పష్టం చేశారు.




హరియాణాలోని సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి అధికారులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్ణియాపై అధికారులు వేటు వేశారు. పూరన్ ఆత్మహత్యకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో హరియాణా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శత్రుజీత్ సింగ్ కపూర్‌తో పాటు రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్ణియాల పేర్లను చేర్చాలంటూ ఆయన భార్య సీనియర్ ఐఏఎస్ అధికారిణి అమ్నీత్ కుమార్ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలోనే ఎస్పీని పదవి నుంచి తొలగిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇదిలాఉండగా.. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ అమ్నీత్ కుమార్‌కు లేఖ రాశారు. ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మ హత్య చేసుకోవడం తనను షాక్‌కు గురిచేసిందని.. ఎంతో బాధ కలిగించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా న్యాయం కోసం మీరు చేస్తున్న పోరాటానికి కోట్లాది మంది భారతీయులు అండగా ఉన్నారంటూ ఆమె రాసుకొచ్చారు. 52 ఏళ్ల పూరన్ కుమార్ స్వరాష్ట్రం ఆంధ్రప్రదేశ్. మంగళవారం చండీగఢ్‌లోని తన నివాసంలో ఆయన రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు, ఇతర అధికారులు ఈ కేసులో నిందితులుగా ఉండటంతో తాను ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అమ్నీత్ కుమార్ ఆరోపించారు. దీనిపై పోలీసులు ఎఫ్ఐఆర్ ఫైల్ చేయగా.. అది అసంతృప్తిగా ఉందని, నిందితులందరి పేర్లు చేర్చాలని ఆమె డిమాండ్ చేశారు.

**వందేళ్ల నాటి పట్టు చీరకు మెరుగులద్ది పూర్వ రూపు తీసుకొచ్చారు సిరిసిల్లకు చెందిన నేతన్న. హరిప్రసాద్ అనే చేనేత కార్మికుడు సుమారు 60 రోజులు కష్టపడి చీరను అందంగా తీర్చిదిద్దారు. ఆనాటి డిజైన్లనే వెండి జరీతో నేసి మెరుగులద్దారు. అమ్మమ్మ చీరపై ఇష్టంతో మెదక్ జిల్లాకు చెందిన స్వప్న ఈ చీర నేయించుకున్నారు. వందేళ్ల నాటి చీర నేయడం ఆనందంగా ఉందని హరిప్రసాద్ తెలిపారు.**






## ప్రధాని మోదీ ఏపీ పర్యటన షెడ్యూల్ ఖరారు.. వివరాలివే..

కర్నూలు, అక్టోబరు 11 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈనెల 16వ తేదీన కర్నూలు జిల్లా పర్యటనకు ప్రధాని మోదీ రానున్నారు. ఉదయం 7:50 గంటలకు ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరనున్నారు ప్రధాని మోదీ. 16వ తేదీన ఉదయం 10:20 గంటలకు కర్నూలు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుని.. అనంతరం హెలికాప్టర్‌లో సున్నిపెంటకు బయలు దేరుతారు. అక్కడ నుంచి ఉదయం 11:10 గంటలకు రోడ్డు మార్గంలో శ్రీశైలం భ్రమరాంబ గెస్ట్ హౌస్‌కి చేరుకోనున్నారు ప్రధాని. 16వ తేదీన ఉదయం 11:45 గంటలకు భ్రమరాంబ మల్లికార్జున స్వామిని దర్శించుకోనున్నారు. మధ్యాహ్నం 1:40 గంటలకు సున్నిపెంటలో హెలిప్యాడ్ నుంచి నన్నూరు హెలిప్యాడ్‌కు బయలుదేరనున్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు రాగ మయూరి గ్రీన్ హిల్స్ వెంచర్‌కు చేరుకుని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం రాగమయూరి గ్రీన్ హిల్స్‌లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ బహిరంగ సభలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటల వరకు బహిరంగ సభలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. అనంతరం కర్నూలు ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్తారు. ఈ మేరకు ప్రధాని కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది.



## మానసిక పరిపక్వత రావాలంటే పుస్తకాలు చదవాలి: పవన్ కళ్యాణ్

విజయవాడ: పుస్తకాలు తనపై చాలా ప్రభావం చూపాయని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఐరాస పూర్వ సహాయ సెక్రటరీ జనరల్ లక్ష్మీ ముర్డేశ్వర్ పురి రచించిన 'ఆమె సూర్యుడిని కబళించింది' పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవాడలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పవన్.. పుస్తకాన్ని ఆవిష్కరించారు. "మానసిక పరిపక్వత రావాలంటే పుస్తకాలు చదవాలి.
ఏ విషయంలోనైనా సమతుల్యత పాటించాలి. నా ఆలోచనలను ఇతరులతో పంచుకుంటా. ఒక్కో పుస్తకం చదువుతుంటే ఎన్నో అంశాలు నేర్చుకుంటాం" అని పవన్ కల్యాణ్ అన్నారు.

## ములకల చెరువు మద్యం కేసు.. నిందితులందర్నీ అరెస్టు చేస్తాం: మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం: అన్నమయ్య జిల్లా ములకలచెరువు కల్తీ మద్యం కేసులో ఇప్పటి వరకు 23 మంది నిందితులను గుర్తించినట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. వారిలో 14 మందిని అరెస్టు చేశామని, ఏ1గా ఉన్న జనార్దన్‌రావును కస్టడీలోకి తీసుకున్నామని చెప్పారు. నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపడుతున్నామని, హైదరాబాద్, బెంగళూరుతోపాటు ఏపీలోనూ ఈ దర్యాప్తు బృందాలు విచారణ చేస్తున్నాయన్నారు. మిగిలిన వారందర్నీ త్వరలోనే అరెస్టు చేస్తామని చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ప్రతి మద్యం బాటిల్‌పైనా ప్రత్యేకమైన కోడ్ ఉండేది. దాని ద్వారా అది ఎక్కడ తయారైంది? ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లింది. ధర ఎంత? తదితర వివరాలు తెలిసేవి. త్వరలో %ూూూూూ% యాప్ ద్వారా ఆ వివరాలు తెలుసుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. "రూ.99కే నాణ్యమైన మద్యాన్ని అందిస్తున్నాం. నవోదయ కార్యక్రమం ద్వారా నాటుసారా లేకుండా చేశాం. మిగతా జిల్లాల్లోనూ త్వరలో ఈ పని పూర్తి చేస్తాం. మద్యం కేసుల్లో అరెస్టయినవారు ఇప్పుడు బయటకొచ్చి మద్యంపై మాట్లాడటం సిగ్గుచేటు. ఈ కేసులో మా పార్టీనేత ఉన్నాడని తెలిసి, అతడిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేశాం. గతంలో ఇటువంటి ఆరోపణలు ఎదుర్కొన్న వైకాపా నేతలపై ఆ పార్టీ అధిష్ఠానం చర్యలేమైనా తీసుకుందా? అనారోగ్యంతో నలుగురు చనిపోతే కల్తీ మద్యంతో చనిపోయారని వైకాపా నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ప్రజలు 11 సీట్లు ఇచ్చినా వారికి ఇంకా సిగ్గు రాలేదు. సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం. తప్పు చేసిన అధికారులపైనా చర్యలు తప్పవు. మద్యం కేసులో ఎంతటి స్థాయి వారున్నా చర్యలు తప్పవు" అని కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## దుర్గగుడి అభివృద్ధికి కట్టుబడి ఉంటా..



విజయవాడ, అక్టోబర్ 11: దుర్గగుడి పాలక మండలి చైర్మన్, సభ్యుల ప్రమాణ స్వీకారం ఈరోజు జరిగింది. రాజగోపురం ముందు ఈవో సినానాయక్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. మొత్తం 17 మంది సభ్యులతో పాలకమండలి ఏర్పాటు అయ్యింది. ప్రమాణ స్వీకారం అనంతరం దుర్గగుడి ఛైర్మన్ బుర్ర రాధాకృష్ణ (గాంధీ) మాట్లాడుతూ.. ఈ రోజు గొప్పగా ప్రమాణ స్వీకారం జరగటం సంతోషంగా ఉందన్నారు. అమ్మ సేవ చేసుకునే అవకాశం రావటం మా పూర్వీకుల సుకృతమని పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం రావటానికి కారణమైన చంద్రబాబు, పవన్ కళ్యాణ్, కూటమి నేతలకు రాధాకృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు. ఆలయానికి వచ్చే సామాన్య భక్తులకు సేవ చేయడమే ప్రధానమని స్పష్టం చేశారు. దుర్గగుడి అభివృద్ధికి కట్టుబడి ఉంటానన్నారు. ఆలయ అభివృద్ధికి దాతల ద్వారా విరాళాలు సేకరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. దసరా వేడుకలు ఎప్పుడూ లేని విధంగా ఈసారి జరిగాయన్నారు. సుమారు 20 లక్షల మంది వచ్చినా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాలు నిర్వహించటం సంతోషంగా ఉందని తెలిపారు. కూటమి నేతలతో ఏర్పాటైన పాలక మండలి అందరం ఏక మాట మీద ఉండి ముందుకు వెళ్తామని చెప్పుకొచ్చారు. ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉన్న తనుకు తెలియజేయాలని.. పరిష్కారం చేస్తానని దుర్గగుడి ఛైర్మన్ రాధాకృష్ణ పేర్కొన్నారు.

**అందరం కలిసి పనిచేస్తాం: ఈవో...** అమ్మవారి ఆశీస్సులతో ప్రమాణ స్వీకారం జరిగిందని దుర్గగుడి ఈవో శీనా నాయక్ తెలిపారు. ఉద్యోగులతో కలిసి పాలక మండలి అందరం కలిసి పని చేస్తామన్నారు. ఇంద్రకీలాద్రిపై చిన్న స్థలం కావటంతో కిందనే కొన్ని కార్యాలయాలు మార్చే ఆలోచనలో ఉన్నామని చెప్పారు. వృద్ధులకు పెద్ద పీట వేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వే స్టేషన్, బస్ స్టాండ్ వద్ద నుంచి ఆలయానికి తీసుకు వచ్చే విధంగా రవాణా సౌకర్యం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

## త్వరలోనే డేటా హబ్‌గా విశాఖపట్నం: పల్లా శ్రీనివాస్

**మంగళగిరి: విశాఖ త్వరలోనే డేటా హబ్‌గా మారబోతోందని ఏపీ తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ అన్నారు. విశాఖలో సిఫీ ఏఐ ఎడ్జ్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేస్తున్నామన్నారు. మంగళగిరిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై నమ్మకంతో అనేక కంపెనీలు వస్తున్నాయని, దీంతో రాష్ట్ర యువతకు ఉద్యోగాలు వస్తాయని చెప్పారు. విశాఖకు కంపెనీలు తీసుకొస్తున్న సీఎం చంద్రబాబు, లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.**






## సీఐకి బెదిరింపులు.. పేర్ని నానితో పాటు మరో 29 మందిపై కేసు

చిలకలపూడి: వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నానితో పాటు మరో 29 మందిపై కేసు నమోదు చేశారు. ఆర్.పేట సీఐ ఏసుబాబుపై దౌర్జన్యం చేశారని చిలకలపూడి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. వైకాపా నేత సుబ్బన్నను శుక్రవారం విచారణ కోసం మచిలీపట్నం టౌన్ పీఎస్‌కు పిలిచారు. ఈక్రమంలో అక్కడికి వెళ్లిన పేర్ని నాని సీఐ విధులకు ఆటంకం కలిగించడంతో పాటు హల్‌చల్ చేశారు. ఈ ఘటనను ఎస్పీ తీవ్రంగా పరిగణించారు.

పేర్ని నాని ఆధ్వర్యంలో వైకాపా నేతలు మెడికల్ కళాశాల వద్ద ఇటీవల నిరసన చేపట్టారు. కళాశాలలో పరీక్షలు జరుగుతున్నాయని, నిరసన తెలిపేందుకు అనుమతి లేదని పోలీసులు చెప్పినా వినలేదు. వాగ్వాదానికి దిగి లాఠీలు లాక్కున్నారు. ఈ ఘటనలో 400 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి 41ఏ నోటీసులు ఇచ్చారు. ఠాణాకు విచారణకు రావాలని పోలీసులు వారికి నోటీసులు జారీ చేశారు. తాము చెప్పేవరకూ పోలీసుల వద్దకు ఎవరూ వెళ్లొద్దంటూ వైకాపా నగర అధ్యక్షుడు మేకల సుబ్బన్న సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. దీంతో సుబ్బన్నను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలిసి పేర్ని నాని పెద్ద సంఖ్యలో వైకాపా కార్యకర్తలతో కలిసి మచిలీపట్నం టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. నేరుగా సీఐ గదిలోకి వెళ్లి బెదిరింపులకు దిగారు. పలువురు వైకాపా నేతలు కూడా పోలీసులను అవహేళన చేస్తూ మాట్లాడారు. అలా మాట్లాడం సరికాదంటూ సీఐ ఏసుబాబు అనడంతో పేర్నినాని రెచ్చిపోయారు. ఆయనకు వేలు చూపిస్తూ.. మావాళ్లనే తీసుకొస్తావా.. అంటూ రెచ్చిపోయి బెదిరింపులకు దిగారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.




రాజమహేంద్రవరం: 'సూపర్‌సిక్స్‌లో చెప్పినవి.. చెప్పనివి కూడా అమలు చేశామని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. రాష్ట్రానికి పారిశ్రామికవేత్తలు క్యూకడుతున్నారన్నారు. ఇప్పటికే 10 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైకాపా నేతలు అడ్డుకున్నా రాష్ట్రాభివృద్ధి ఆగదని స్పష్టం చేశారు.




శ్రీకాకుళం: నేరస్థుల అడ్డా వైకాపా అని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపించారు. నకిలీ మద్యానికి మూలకేంద్రం జగనేనని విమర్శించారు. శ్రీకాకుళంలో ఆయన మీడియాతో మాట్లాడారు."నకిలీ మద్యాన్ని ప్రోత్సహించిందే జగన్. నకిలీ మద్యంపై దాడులు నిర్వహించాలని చెప్పింది చంద్రబాబు కాదా?జగన్ అబద్ధపు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. నకిలీ మద్యం అమ్మే ఎవరినైనా వదిలిపెట్టేది లేదని కూటమి ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఇకనైనా తీరు మార్చుకొని సరైన మార్గంలో నడవాలని వైకాపా నేతలకు చెబుతున్నాం" అని అన్నారు.

## కల్తీ మద్యం.. జగన్‌పై వర్ల రామయ్య ప్రశ్నల వర్షం



అమరావతి, అక్టోబర్ 11: గత 6 సంవత్సరాలుగా రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారటానికి కర్త, కర్మ, క్రియ జగనే అని పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య వ్యాఖ్యలు చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. కల్తీ మద్యం కుట్రదారులను ప్రోత్సహిస్తూ, కల్తీ మద్యానికి మూల విరాట్ కూడా జగనే అని అన్నారు. జగన్ దాయాదులైన వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి సౌత్ ఆఫ్రికాలో మద్యం వ్యాపారం చేస్తున్నారనేది నిజం కాదా అని ప్రశ్నించారు. వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి.. జగన్ వ్యాపార బినామీలు అవునా, కాదా? అని నిలదీశారు. దాయాదుల మద్యం వ్యాపారంలో కల్తీ జరుగుతోందని సౌత్ ఆఫ్రికా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారనేది నిజం కాదా అని అన్నారు. వైసీపీ కోవర్ట్ జయచంద్రా రెడ్డి.. వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి క్యాంప్‌లో తలదాచుకున్నారనేది నిజం కాదా అని మరో ప్రశ్న సంధించారు. 'మీరు ముఖ్యమంత్రిగా ఉండగా జంగారెడ్డిగూడెంలో కల్తీ మద్యం తాగి 27 మంది చనిపోతే, ఆ కేసును తప్పుదారి పట్టించింది మీరు కాదా? మీ పార్టీ నాయకుడు మల్లాది విష్ణు బార్‌లో కల్తీ మద్యం తాగి 6 గురు చనిపోతే, అతన్ని ఎందుకు సస్పెండ్ చేయలేదు? గతంలో సర్వేపల్లి, కావలి నియోజకవర్గాల్లో మీ నాయకులు కాకాణి గోవర్ధన్, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కల్తీ మద్యంలో భాగస్వాములైనది నిజం కాదా? వారిపై కేసులు ఉన్నది నిజం కాదా? వారిపై మీ పార్టీ తరఫున క్రమశిక్షణ చర్యలు ఎందుకు తీసుకోలేదు? మీ పార్టీ కోవర్ట్ అయిన జయచంద్రా రెడ్డిపై ప్రభుత్వం లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి, పార్టీ నుంచి సస్పెండ్ చేసింది.

జయచంద్రా రెడ్డి ఇప్పుడు ఎక్కడ తలదాచుకున్నాడో మీకు తెలియదా, జగన్ గారు? మీరు ముఖ్య మంత్రిగా ఉండగా మీరు సరఫరా చేసిన మద్యంలో విషపూరిత పదార్థాలు ఉన్నట్లు చెన్నై, బెంగళూరు ల్యాబ్‌లు నిర్ధారించింది నిజం కాదా? బాధ్యులపై వెంటనే చర్యలు ఎందుకు తీసుకోలేదు? నిన్న ఏలూరులో మద్యం తాగి ఒక వ్యక్తి చనిపోతే, అది కల్తీ మద్యంగా ప్రచారం చేశారు. అది కల్తీ మద్యం కాదని ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ నిర్ధారించింది. దీనిపై మీ సమాధానం ఏమిటి జగన్? కల్తీ మద్యం సరఫరాకు మూలవిరాట్ మీరే అని మేము చెబుతున్నాం. దీనిపై బహిరంగ చర్చకు మీరు సిద్ధమా?' అంటూ జగన్‌పై వర్ల రామయ్య ప్రశ్నల వర్షం కురిపించారు.

## ఢిల్లీలో 10 టన్నుల ఎర్రచందనం దుంగలు స్వాధీనం

తిరుపతి: ఎర్రచందనం అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను తిరుపతి పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు ఛేదించాయి. మొత్తం 10 టన్నుల ఎర్రచందనం దుంగల్ని స్వాధీనం చేసుకున్నాయి. ఎర్రచందనం అక్రమ రవాణా వివరాలను తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వెల్లడించారు. ఢిల్లీలోని ఓ గోదాములో ఎర్రచందనం నిల్వ ఉంచినట్లు గుర్తించామన్నారు. అక్కడ పట్టుబడిన ఎర్రచందనం విలువ రూ.8 కోట్లు ఉంటుందన్నారు. " ఈ ఘటనలో ఇప్పటికే కొందరు నిందితులను అరెస్టు చేశాం. గుజరాత్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి రవాణా అవుతున్నట్లు గుర్తించాం. అటవీ, పోలీసు, ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ సమన్వయంతో స్మగ్లింగ్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తున్నాం" అని ఎస్పీ తెలిపారు.



చురకలు

## సంపాదకీయం

### నోబెల్ శాంతి బహుమతికి విజేతను ఎలా ఎంపిక చేస్తారు?

ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మక పురస్కారం అయిన నోబెల్ శాంతి బహుమతి విజేతను ఎంపిక చేసే ప్రక్రియ అత్యంత పటిష్ట మైనది, రహస్యమైనది. ప్రపంచ శాంతి, సౌభ్రాతృత్వం కోసం విశేష కృషి చేసిన వ్యక్తులు లేదా సంస్థలను గుర్తించి సన్మానించే ఈ ప్రక్రియ, నెలల తరబడి కొనసాగే నిశిత పరిశీలన పై ఆధారపడి ఉంటుంది. ఈ బహుమతిని నార్వే రాజధాని ఓస్లోలో నార్వేజియన్ నోబెల్ కమిటీ ద్వారా అందిస్తారు.

**కఠినమైన ఎంపిక ప్రక్రియ...** నోబెల్ శాంతి బహుమతి విజేత ఎంపిక దాదాపు ఎనిమిది నెలల పాటు కొనసాగుతుంది. ఈ సుదీర్ఘ ప్రక్రియ ముఖ్యంగా కింది దశల్లో జరుగుతుంది.

**1. నామినేషన్ల స్వీకరణ...** ప్రతీ సంవత్సరం మిడ్–అక్టోబర్ నుండి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమై, వచ్చే ఏడాది జనవరి 31తో ముగుస్తుంది.

**ఎవరు నామినేట్ చేయవచ్చు:** సాధారణ వ్యక్తులు లేదా స్వయంగా నామినేట్ చేసుకోవడం అనుమతించబడదు. నామినేషన్ దాఖలు చేసేందుకు కొన్ని ప్రత్యేక అర్హతలు అవసరం.
నేషనల్ అసెంబ్లీ (పార్లమెంట్) సభ్యులు
రాష్ట్రాధికారులు (ప్రభుత్వ సభ్యులు)
గతంలో నోబెల్ శాంతి బహుమతి గెలిచిన వారు అంతర్జాతీయ న్యాయస్థానాల శాశ్వత సభ్యులు విశ్వవిద్యాలయాల్లో సామాజిక శాస్త్రం, చరిత్ర, తత్వశాస్త్రం, న్యాయశాస్త్రం, మతశాస్త్రాలు బోధించే ప్రొఫెసర్లు


**2. షార్ట్ లిస్టింగ్, నిపుణుల సమీక్ష...** ఫిబ్రవరి–మార్చి: జనవరి 31 నాటికి అందిన అన్ని నామినేషన్లను నార్వేజియన్ నోబెల్ కమిటీ (నార్వే పార్లమెంట్ నియమించిన ఐదుగురు సభ్యులు) తొలి దశలో పరిశీలించి, ముఖ్యమైన అభ్యర్థుల జాబితా (షార్ట్ లిస్ట్) ను తయారు చేస్తుంది. మార్చి–ఆగస్టు: షార్ట్ లిస్ట్ చేయబడిన అభ్యర్థులపై సమగ్ర పరిశోధన జరుగుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న చరిత్ర కారులు, అంతర్జాతీయ న్యాయ నిపుణులు.. ఇతర సలహాదారులు అభ్యర్థుల సేవలు, కృషిపై లోతైన నివేదికలు తయారుచేసి కమిటీకి అందజేస్తారు. ఈ దశలో అభ్యర్థి చేసిన పని ప్రపంచ శాంతి, మానవ జాతి మేలుకు ఎలా దోహదపడిందో నిశితంగా పరిశీలిస్తారు.

**3. తుది నిర్ణయం, ప్రకటన..** అక్టోబర్ ఆరంభంలో: నోబెల్ కమిటీ అన్ని నివేదికలను, వివరాలను పరిశీలించిన తర్వాత, మెజారిటీ ఓటు ద్వారా విజేతను ఎంపిక చేస్తుంది. కమిటీ ప్రయత్నిస్తుంది ఏకగ్రీవ నిర్ణయం తీసుకోవడానికి పక్షపాతం చూపదు.. అంతిమ నిర్ణయం: కమిటీ తీసుకునే నిర్ణయం తిరుగులేనిది. దీనిపై అప్పీల్‌కు అవకాశం ఉండదు.

**విజేత ప్రకటన:** ప్రతీ సంవత్సరం అక్టోబర్ మొదటి వారంలో విజేతల పేరును అధికారికంగా ఓస్లోలో ప్రకటిస్తారు.
డిసెంబర్: ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి రోజున (డిసెంబర్ 10) విజేతకు బహుమతిని ప్రదానం చేస్తారు. నోబెల్ ఫౌండేషన్ నియమాల ప్రకారం, నామినేట్ చేసిన వ్యక్తులు, సంస్థల పేర్లు 50 సంవత్సరాల వరకు రహస్యంగా ఉంచబడతాయి. ఈ కచ్చితమైన, నిష్పక్షపాత ప్రక్రియ కారణంగానే నోబెల్ శాంతి బహుమతి ప్రపంచంలో అత్యంత విశ్వసనీయత.. గౌరవం కలిగిన పురస్కారంగా నిలుస్తోంది.

# ప్రతి కదలికకు కీళ్లే కీలకం - అక్టోబర్ 12... ప్రపంచ ఆర్థరైటిస్ దినోత్సవం

మన ప్రతి కదలికకూ కీళ్ళే.. కీలకం! జాయింట్లు మృదువుగా, సజావుగా, సున్నితంగా కదులు తుంటేనే.... మన జీవితం హాయిగా, సుఖంగా సాగుతుంటుంది. అది వేళ్ల, మణికట్టు, భుజం, చివరికి పాదాల, వేళ్ల ఏ జాయింట్లు అయినా కావచ్చు.. మోకాలి కీళ్లు కావచ్చు. ఏ కదలికకైనా ఈ కీళ్లే కీలకం. మరి మన శరీరంలో ఈ కీళ్లు ఉగ్రరూపం దాల్చితే కాలు, చేయి మెదపాలంటే కష్టం. మారు తున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు అనేక రకాల అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంటాయి. అందులో ఆర్థరైటిస్ కూడా ఒకటి. ఇది గ్రీకు పదాలైన "ఆర్థో" నుండి ఉద్భవించింది, అంటే "ఉమ్మడి", మరియు "ఐటిస్", అంటే "మంట". మానవ ఆర్థరైటిస్ యొక్క మొట్ట మొదటి జాడలు క్రీ.పూ 4500 నాటివి. ప్రారంభ వేదిక కలలో, ఆర్థరైటిస్‌ను చరిత్రపూర్వ ప్రజల అత్యంత సాధారణ వ్యాధిగా సూచిస్తారు. కీళ్ల అరుగుదలనే ఆర్థరైటిస్ అంటారు. కీళ్ల నొప్పులు అధికంగా ఉంటే, మోకాలులో వస్తుంటాయి. చేతి, మోచేతిలోనూ కీళ్ల నొప్పులు రావచ్చు. శరీరంలో మోకాలే పెద్ద కీలు. శరీర బరువును సగానికిపైగా మోకాలే మోస్తుంటుంది. వయసు పెరుగుతున్న కొద్దీ కీళ్లలో ఉండే కీలకమైన మృదులాస్థి అనే పదార్థం కరిగిపోతుంది. అది నిరంతరం కరుగుతూ మళ్లీ ఏర్పడు తుండటం దాని ప్రత్యేకత. అయితే 40%–%45 ఏళ్ల మధ్య మృదులాస్థి పున రుత్పత్తి తగ్గడం మొదలవుతుంది. దీంతో కీళ్లవాపు, నొప్పి, నడవలేక పోవడం వంటివి వస్తాయి. ఈ విధంగా జరగడాన్నే కీళ్ల నొప్పి లేదా ఆర్థరైటిస్ అంటారు. కీళ్లనొప్పికి అన్ని వయసుల వారిలో రకరకాల కారణాలు ఉంటాయి. ప్రధానంగా వయసు, జన్యు పరమైన కారణాలతోనే ఆర్థరైటిస్ వస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్, ఎంకైలోసింగ్ స్పాండిలైటిస్ అనే 2 రకాలున్నాయి. సాధారణ ఆర్థరైటిస్‌కు ఈ రెండూ భిన్నం. ఈ రెండింటిలో ఉపరకాలుగా మరో 15 ఆర్థరైటిస్‌లు ఉన్నాయి. ఒకసారి తగులుకుంటే వదిలి పెట్టవు. పూర్తిగా నిర్మూలించలేం. స్టెరాయిడ్స్ తదితర మందులు వాడటం వల్ల వీటిని నియంత్రించ వచ్చు. ఇక సోరియాసిస్ కూడా ఆర్థరైటిస్‌కు దారితీస్తుంది. రీయస్ డిసీజ్ అంటే కంటి చూపు మంద గించడం ద్వారా కీళ్ల నొప్పులు వచ్చే అవకాశ ముంది. ఇలాంటి జబ్బులు వస్తే 20%–%30 ఏళ్లకే ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది. గతంలో 50%–%60 ఏళ్లలో కనిపించే ఆర్థరైటిస్‌ను ఇప్పుడు 35%–%40 ఏళ్లలోనే చూస్తున్నాం. దీన్ని ముందుగా గుర్తించి నియంత్రణ చర్యలు తీసుకోక పోతే ముందుందు నడవలేని, కదల్లేని పరిస్థితులు రావొచ్చని వైద్యులు హెచ్చరి స్తున్నారు. కింద కూర్చోవడం వల్ల, సాధారణ మరుగుదొడ్డు వాడినా మోకాలి నొప్పులు వస్తాయి. ఈ కీళ్లకు వచ్చే అతి పెద్ద సమస్య ఆర్థరైటిస్! అంటే కీలు లోపలంతా వాచి పోయి కదపా లంటేనే తీవ్రమైన నొప్పి, బాధతో జాయింటులో అరిగి పోవడం వల్ల రావచ్చు. దాన్ని "ఆస్టియో ఆర్థరైటిస్" అంటారు. ఇప్పుడు ఎక్కువ మంది అనుభవిస్తున్న మోకాళ్ల నొప్పులు బాధ ఇదే. ఇక ఒంట్లో ఎక్కడైనా ఇన్ఫెక్షన్ తలెత్తి అది కీలుకు చేరటం వల్ల కీళ్లనొప్పి రావచ్చు. దీన్ని "ఇన్ఫెక్టివ్ ఆర్థరైటిస్' అంటారు. సోరియాసిస్ వంటి చర్మ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపు, నొప్పి పలకరించవచ్చు.





దాన్ని "సోరియాటిక్ ఆర్థరైటిస్" అంటారు. అలాగే మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, నీళ్ల విరేచనాల వంటి ఇన్ఫెక్షన్ల తర్వాత కూడా కీళ్ల వాపు రావచ్చు. దాన్ని "రియాక్టివ్ ఆర్థరైటిస్" అంటారు. చికున్‌గున్యా వంటి వైరల్ వ్యాధుల్లో కూడా కీళ్ల వాపులు రావచ్చు, వీటిని "వైరల్ రియాక్టివ్ ఆర్థరైటిస్" అంటారు. ఇలా కీళ్ల వాపుల్లో ఎన్నో రకాలు న్నాయి. అయితే ఇవన్నీ కూడా ఏదో ఒక ప్రత్యేకమైన, స్పష్టమైన కారణంతో వచ్చే కీళ్ల నొప్పులు! వీటికి భిన్నంగా... స్పష్టమైన కారణమేదీ తెలియ కుండానే ఆరంభమయ్యే అతి పెద్ద సమస్య... రుమటాయిడ్ ఆర్థరైటిస్! కీళ్లవాతం!! వేళ్ల, మణికట్టు వంటి చిన్న జాయింట్లను ఎక్కువగా పట్టి పీడించే ఈ కీళ్లవాతం... దీర్ఘకాలం కొనసాగే ఒడిదొడుకుల సమస్య! ఇది కేవలం శరీరంలో గుండె, ఊపిరితిత్తులు, కళ్ల వంటి ఇతరత్రా అవయవాలూ ప్రభావితమై పరిస్థితి మరింత విషమిస్తుంది. అదృష్టవశాత్తూ– దీన్ని పూర్తి నియంత్రణలోకి తీసుకు వచ్చే విధానాలు అందుబాటులో ఉన్నాయి. అందుకే 'ప్రపంచ ఆర్థరైటిస్ దినం' సందర్భంగా ఈ కీళ్లవాతం గురించి అవగాహన కలిగి ఉండాలి. మన శరీరంలో ఒక అద్భుతమైన రక్షణ వ్యవస్థ ఉంది. అదే 'రోగ నిరోధక వ్యవస్థ'. మనం వ్యాధుల బారినపడకుండా.. ఎటువంటి సూక్ష్మక్రిములు మనపై దాడి చెయ్యకుండా నిరంతరం పహారా కాస్తుంది వ్యవస్థ. రెండు బలాల ఈ బాధ్యతలను ఇది అద్భుతంగా నిర్వర్తిస్తుంటుంది. కానీ.. ఒక్కోసారి ఇది ఏకంగా మన శరీర భాగాల మీదే దాడి చేస్తుంటుంది. ఫలితమే రకరకాల 'ఆటో ఇమ్యూన్' సమస్యలు. కీళ్లవాతం... రుమటాయిడ్ ఆర్థరైటిస్ కూడా ఇలా తలెత్తే సమస్యే! ఇది మన కీళ్లలో ఎముకల మధ్య ఉండే మృదువైన 'సైనోవియం' పొరను చూసి, దాన్నిపై దాడి చేసి దీని విధ్వంసం ఆరంభిస్తుంది. దీంతో కీళ్లు ఎర్రగా వాచిపోవటం, నొప్పుల వంటి బాధలన్నీ ఆరంభ మవుతాయి. సాధారణంగా ఇతరత్రా కీళ్ల నొప్పులైతే శరీరంలో ఏదో ఒకవైపు కీలుకు మాత్రమే వస్తాయి. కానీ రుమటాయిడ్ ఆర్థరైటిస్‌లో – ఒకేసారి రెండు వైపులా వాపు కనిపిస్తుంది. అంటే ఉదాహరణకు కుడి చేతి వేలి కీళ్లు వాస్తే, ఎడమ చేతి వేలి కీళ్లు కూడా వాస్తుంటాయి. కుడి మణికట్టు కీలు వాస్తే, ఎడమ మణికట్టు కీలూ వాస్తుంది.

అలాగే ఈ వాపు ఏకకాలంలో శరీరంలోని చాలా కీళ్లకూ రావచ్చు. కీళ్లవాతం ఏ వయసు వారికైనా రావచ్చుగానీ సాధారణంగా పెద్దవారి లోనే.. అదీ 30–60 ఏళ్ల మధ్య వయసు వారిలో ఎక్కువగా కనిపిస్తుంటుంది. ముఖ్యంగా– ఇది మహిళల్లో ఎక్కువ. కీళ్లవాతం సాధారణంగా శరీరంలోని చిన్న కీళ్లతో మొదలవు తుంది. అంటే చేతివేళ్లు, మణికట్టు, కాలివేళ్ల వంటి వాటితో ఆరంభమై క్రమేపీ మోకాలు, తుంటి వంటి పెద్ద జాయింట్లకూ రావచ్చు. వాపు, నొప్పి వంటివన్నీ చిన్న జాయింట్లతో ఆరంభం కావటం దీని ప్రత్యేక లక్షణం. రుమటాయిడ్ ఆర్థరైటిస్ బాధితుల్లో చాలా కొద్దిమందికి మాత్రమే కీళ్ల మార్పిడి అవసరం అవుతుంది. కీళ్లవాతం కొంతకాలం పెరుగుతూ తగ్గుతూ ఉండటం దీని మరో ప్రత్యేకత. కీళ్లవాతం వచ్చిన తొలిదశలో కీళ్ల మీది పైపొర మాత్రమే దెబ్బతింటుంది. వ్యాధి ముదురుతున్న కొద్దీ క్రమేపీ అది కీళ్లను, లోపలి ఎముకలను కొరికేస్తుంది. ఇంకా తీవ్రమైతే కీళ్ల మధ్య ఖాళీ తగ్గిపోతుంది. దీంతో ఎముకల రాపిడి కారణంగా నొప్పి వస్తుంది. కొన్నాళ్లకు కీళ్లు మొత్తం దెబ్బతింటాయి. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌ను నియంత్రించు కోకపోతే – గుండె జబ్బులు, పక్షవాతం వంటివి పదేళ్ల ముందుగానే వచ్చే ప్రమాదం ఉంది. కళ్లు పొడిబారటం, లాలాజలం తగ్గిపోవటంతో పాటు గుండె చుట్టూ, వూపిరితిత్తుల చుట్టూ నీరు చేరటం వంటి ఇబ్బందులూ ఎదురవ్వచ్చు. వ్యాధిని సత్వరమే గుర్తించి చికిత్స ఆరంభిస్తే ఈ కీళ్ల మార్పిడి అవసరం అంతగా రాదు. చిన్న కీళ్లకు ఈ మార్పిడి అవకాశమూ ఉండదు. అందుకే మందులతో చికిత్సకే ప్రాధాన్యం ఇస్తారు. కీళ్లవాతం బాధితుల్లో చాలామంది పూర్తి విశ్రాంతిగా పడుకుంటూ వ్యాయామం మానేస్తుంటారు. ఇది సరికాదు. వ్యాయామం చేయకపోతే కీళ్లు గట్టిగా బిగుసుకు పోతాయి. కొన్నిసార్లు ఆపరేషన్ చేసినా ఫలితం ఉండక పోవచ్చు. మందులతో నొప్పి తగ్గాక వ్యాయామం మొదలెట్టాలి. నొప్పి తగ్గుతున్న కొద్దీ వ్యాయామం చేసే సమయాన్ని కూడా పెంచుకోవాలి. ఏరోబిక్, యోగా, నడక వంటి వ్యాయామాలు ఏవైనా చేయొచ్చు. పొగ తాగకూడదు. బరువు పెరగ కుండా, శరీరానికి తగ్గట్లుగా ఉండాలి. ఆర్థరైటిస్‌ను ముందుగా గుర్తించకపోతే పనిచేసే సామర్థ్యం తగ్గిపోతుంది. దీనివల్ల శరీరంలో కొవ్వు పెరిగిపోతుంది. ఫలితంగా గుండెకు చేటు తెస్తుంది. అలాగే మెటబాలిజం తగ్గుతుంది. దీంతో ఒత్తిడి పెరుగుతుంది. మన జనాభా లో సుమారు ఒక శాతం మంది దీంతో బాధపడు తున్నారు. కీళ్ల 20 శాతం అరుగుదల ఉంటే, దాన్ని పెరగకుండా చూసుకోవాలి. మృదులాస్థి పెరగడానికి మందులు ఇస్తారు. అవి వాడాలి. సైక్లింగ్, ఈత వంటివి చేయాలి. దీని వల్ల కీళ్లపై ప్రభావం చూపదు. నిర్ణీత మోతా దులో డాక్టర్ల సూచన మేరకు నడవవచ్చు. ఏదైనా సమతుల్య మైన శారీరక శ్రమ, వ్యాయామం అవసరం. రుమటాయిడ్ ఆర్థరైటిస్ దీర్ఘకా లిక సమస్య. కాబట్టి చికిత్స కూడా దీర్ఘకాలం, జీవితాంతం తీసుకోవాల్సి ఉంటుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల... 9440595494**

# ప్రజాస్వామ్యానికి ఒక కఠిన పాఠం: జె.ఎం.ఎం. లంచాల వివాదం - జె.ఎం.ఎం. లంచాల కేసు: భారత రాజకీయ చరిత్రను కుదిపిన ఘట్టం

## 2000 అక్టోబర్ 12...జే ఎం ఎం ముడుపుల కేసులో పూర్వపు ప్రధానమంత్రి పి వి నరసింహారావుకు, బూటాసింగుకు కోర్టు మూడు సంవత్సరాల కఠిన కారాగారం, 2 లక్షల జరిమానా విధించిన దినం.తరువాత వీరిద్దరూ నిర్దోషులుగా బయట పడ్డారు.

భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1990వ దశకం రాజకీయ కల్లోలంతో నిండిన కాలం. ఆర్థిక సంస్కరణలు, కూటమి రాజకీయాలు, అవినీతి ఆరోపణలు అన్నీ కలిసి దేశ రాజకీయ నైతికతను ప్రశ్నార్థకంగా మార్చిన సమయమది. అటువంటి సందర్భంలోనే దేశ రాజకీయ చరిత్రలో అత్యంత చర్చనీయాంశంగా నిలిచినది జార?ండ్ ముక్తి మోర్చా (జె.ఎం.ఎం.) లంచాల కేసు. అప్పటి ప్రధానమంత్రి పీ. వి. నరసింహారావు మరియు కేంద్ర మంత్రి బూటా సింగ్ ఈ కేసులో నిందితులుగా నిలవడం, తీర్పు వెలువడడం, తరువాత నిర్దోషులుగా బయటపడడయిఇవన్నీ భారత ప్రజాస్వామ్య వ్యవస్థను లోతుగా పరిశీలించాల్సిన అవసరాన్ని గుర్తు చేశాయి. 1993 జూలైలో నరసింహారావు నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టబడింది. ఆ సమయంలో లోక్‌సభలో మొత్తం 528 సభ్యులు ఉండగా, ప్రభుత్వం నిలబడేందుకు 265 ఓట్లు అవసరమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ వద్ద స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో విశ్వాస తీర్మానం ఓటింగ్ ప్రభుత్వ భవిష్యత్తును నిర్ణయించేదిగా మారింది. కీలకంగా నిలిచిన వారు జార?ండ్ ముక్తి మోర్చా (జె.ఎం.ఎం.) పార్టీకి చెందిన శిబు సోరెన్, సురజ్ మండల్, సైమన్ మారాండి, షైలేంద్ర మహతో అనే నలుగురు ఎంపీలు. వీరు ఓటు వేయడానికి పెద్ద మొత్తం డబ్బు తీసుకున్నారనే ఆరోపణలు చోటు చేసుకున్నాయి. ఆ కాలంలో మీడియా నివేదికల ప్రకారం జె.ఎం.ఎం. ఎంపీలకు రూ. 3.5 కోట్ల వరకు నగదు అందించ బడిందని, కాంగ్రెస్ నాయకత్వం ప్రభుత్వం రక్షించు కోవడానికే ఈ లావాదేవీలు జరిగాయని ఆరోపణలు వెలువడ్డాయి. ఈ అవినీతి ఆరోపణలు 1996లో వెలుగులోకి వచ్చాయి. ప్రజా ఒత్తిడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తుకు ఆదేశించింది. దర్యాప్తు అనంతరం 1997లో సీబీఐ పీ.వి. నరసింహారావు, బూటా సింగ్, అలాగే జె.ఎం.ఎం. ఎంపీలను నిందితులుగా చేర్చింది. విచారణ అనంతరం 2000 అక్టోబర్ 12న దిల్లీ ప్రత్యేక సీబీఐ కోర్టు తీర్పు వెలువరించింది. నరసింహారావు, బూటా సింగ్ ఇద్దరికి మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, తలా రూ. 2 లక్షల జరిమానా విధించింది. ఈ తీర్పు భారత చరిత్రలో ఒక మాజీ ప్రధానమంత్రికి శిక్ష విధించిన అరుదైన సంఘటనగా నిలిచింది. అయితే ఈ తీర్పుతో దేశ రాజకీయ వర్గాలు, న్యాయ వర్గాలు కదలి పోయాయి. నరసింహారావు ఆర్థిక సంస్కరణల రూపకర్తగా ఉన్న ప్రతిష్ఠకు ఇది పెద్ద దెబ్బగా భావించ బడింది. ఇద్దరూ ఆ తీర్పుపై దిల్లీ హైకోర్టులో అప్పీల్ చేశారు. దీర్ఘకాలిక విచారణ అనంతరం 2002లో హైకోర్టు సీబీఐ సమర్పించిన సాక్ష్యాలు తగినవిగా లేవని, లంచం చెల్లింపుకు నిర్ధారణగా చూపిన పత్రాధారాలు, సాక్ష్యాలు విశ్వసనీయంగా లేవని పేర్కొంటూ నిందితులను నిర్దోషులుగా ప్రకటించింది. తద్వారా నరసింహారావు, బూటా సింగ్ లు చట్టపరంగా విముక్తులయ్యారు. ఈ ఘటన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్న లోపాలను బహిర్గతం చేసింది. పార్లమెంటు సభ్యులు ప్రభుత్వాన్ని నిలబెట్టేందుకు తమ ఓటును అమ్ముకోవచ్చన్న ఆలోచన ప్రజలలో రాజకీయాలపై నమ్మకాన్ని దెబ్బతీసింది. జె.ఎం.ఎం. నాయకులు ఆ డబ్బు తమ పార్టీకి విరాళమని పేర్కొన్నా, దేశ ప్రజల దృష్టిలో అది లంచంగానే నిలిచింది. ఈ సంఘటన తరువాత "పార్లమెంటరీ లంచం" అనే పదం రాజకీయ నిఘంటువులో చోటు చేసుకుంది. జె.ఎం.ఎం. లంచాల కేసు కేవలం ఒక అవినీతి ఆరోపణ మాత్రమే కాదు, ప్రజాస్వామ్య విలువల



పునాదులను కదిలించిన చారిత్రక సంఘటన. ఆ సమయంలో రాజకీయం, న్యాయం, నైతికత మధ్య ఉన్న సున్నిత సంబంధాలను ఈ ఘటన ప్రతిబింబించింది. పీ.వి. నరసింహారావు నిర్దోషిగా బయటపడ్డా, ఈ కేసు ఆయన రాజకీయ వారసత్వంలో ఒక మచ్చగా నిలిచి పోయింది. ఈ ఘటన దేశ ప్రజాస్వామ్యానికి ఒక పాఠం నేర్పిందిఅధికారపు అహంకారం, కూటమి రాజకీయాల తతంగం, అవినీతి ప్రలోభాలు తాత్కాలికంగా విజయాన్ని తెచ్చినా, చరిత్రలో అవి నైతిక పరాజయంగా నిలుస్తాయని. జె.ఎం.ఎం. లంచాల కేసు భారత రాజకీయ చరిత్రలో అధికార పీఠాల వెనుక నడిచే డబ్బు ప్రభావాన్ని బహిర్గతం చేసిన గంభీరమైన మలుపుగా గుర్తుండి పోతుంది. **రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**


# సమాచార హక్కు చట్టం - అవినీతికి అడ్డుకట్ట వేసిన విప్లవం - అక్టోబర్ 12...సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిన రోజు




భారత ప్రజాస్వామ్య చరిత్రలో పారదర్శకత, జవాబుదారీ తనాన్ని బలపరుస్తూ ప్రజలకు పాలనపై ప్రశ్నించే అధికారం కల్పించిన చట్టం సమాచార హక్కు చట్టం. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ యంత్రాంగం ప్రజలకు జవాబుదారిగా ఉండాలన్న మౌలిక సూత్రానికి న్యాయం చేస్తూ, ఈ చట్టం దేశ ప్రజలకు ఒక విప్లవాత్మక సాధనంగా మారింది. భారత పార్లమెంటు ఆమోదంతో రూపొందిన ఈ చట్టం 2005 జూన్ 15న రాష్ట్రపతి ఆమోదం పొందగా, 120వ రోజు అయిన అక్టోబర్ 12, 2005న దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. ఆ రోజు భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఓ నూతన అధ్యాయంగా నిలిచి పోయింది. సమాచార హక్కు చట్టం పుట్టుక వెనుక ప్రజా ఉద్యమాల సుదీర్ఘ పోరాటం ఉంది. రాజస్థాన్ రాష్ట్రంలో మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ వంటి సామాజిక సంస్థలు ప్రభుత్వ ఖాతాల పారదర్శకత కోసం చేసిన పోరాటం ఈ చట్టానికి పునాది వేసింది. "ప్రభుత్వం ప్రజల సొమ్ముతో నడుస్తుంది, కాబట్టి ప్రజలకు లెక్క చెప్పాల్సిందే" అనే నినాదంతో ప్రారంభమైన ఆ ఉద్యమం దేశవ్యాప్త చైతన్యానికి దారితీసింది. చివరికి యూపీఏ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సమాచార హక్కు బిల్లును రూపొందించి పార్లమెంటులో ఆమోదింప జేసింది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం... ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకతను, బాధ్యతను పెంచడం. ప్రభుత్వ నిర్ణయాలు, ఫైళ్లు, కాంట్రాక్టులు, టెండర్లు, ఖర్చులు వంటి వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచడం ద్వారా అవినీతి తగ్గించడం, ప్రజా నిధుల వినియోగాన్ని సక్రమంగా పర్యవేక్షించడానికి ప్రజలకు అవకాశం కల్పించడం దీని లక్ష్యం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ) కింద పౌరులకు ఇచ్చిన మాటల స్వేచ్ఛలో భాగంగానే సుప్రీంకోర్టు సమాచార హక్కును మౌలిక హక్కుగా పరిగణించింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రతి పౌరుడికి ప్రభుత్వం నుండి సమాచారాన్ని అడిగే చట్టబద్ధ హక్కు ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, స్థానిక సంస్థలు, ప్రభుత్వ నియంత్రణలో ఉన్న అన్ని సంస్థలు ప్రజలకు సమాచారం ఇవ్వాల్సిన బాధ్యత వహించాలి. దరఖాస్తు లిఖిత పూర్వకంగా లేదా ఆన్‌లైన్ ద్వారా సమర్పించవచ్చు. సాధారణంగా సమాచారం ఇవ్వడానికి 30 రోజులు గడువు ఉంటే, జీవితం లేదా స్వేచ్ఛకు సంబంధించిన అంశాల్లో 48 గంటల్లోపే సమాధానం ఇవ్వాలి. సమాచారం ఇవ్వడంలో జాప్యం జరిగితే లేదా నిరాకరించినట్లయితే సంబంధిత అధికారిపై రోజుకు రూ.250 చొప్పున జరిమానా విధించే అవకాశం చట్టంలో ఉంది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత ప్రజలు దీన్ని శక్తివంతమైన ఆయుధంగా ఉపయోగించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, రోడ్లు, భూముల రికార్డులు, విద్యా నియామకాలు, స్థానిక సంస్థల ఖర్చులు వంటి అనేక అంశాల్లో పౌరులు సమాచారాన్ని కోరారు. అనేక అవినీతి ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మహారాష్ట్రలో భూసంబంధిత అవినీతి కేసులు, ఢిల్లీలో పాఠశాల భవనాల నిర్మాణంలో జరిగిన మోసాలు, బడ్జెట్ వినియోగాల్లో గోప్యతల ఉల్లంఘనలు ఈ చట్టం ద్వారానే బహిర్గతమయ్యాయి. ప్రజల చేతుల్లో ఈ చట్టం నిజమైన ప్రజాస్వామ్య పరికరంగా మారింది. చట్టం అమలుకు సంబంధించి కేంద్ర సమాచార కమిషన్ (%జ×జ%), రాష్ట్ర సమాచార కమిషన్లు ఏర్పాటు చేయబడ్డాయి. సమాచారం ఇవ్వని అధికారులను ప్రశ్నించడం, ప్రజల పిటిషన్లను విచారించడం వీటి బాధ్యత. తొలి కేంద్ర సమాచార కమిషనర్ వాజహత్ హబీబుల్లా కాగా, అనేక రాష్ట్రాల్లోనూ ఇలాంటి కమిషన్లు ఏర్పాటయ్యాయి. ఈ కమిషన్లు పౌరుల హక్కులను కాపాడడంలో, ప్రభుత్వ వ్యవస్థలో పారదర్శకతను తీసుకు రావడంలో విశేష పాత్ర పోషించాయి. 2019లో చట్టంలో జరిగిన సవరణలతో కమిషనర్ల పదవీకాలం, వేతనాల నిర్ణయాధికారం కేంద్ర ప్రభుత్వానికి ఇవ్వబడింది. ఈ మార్పులు పారదర్శకతను బలహీన పరిచే అవకాశం ఉందన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. అయినప్పటికీ సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఇంకా ప్రభావవంతమైన సాధనంగానే ఉంది. అయితే దాని వినియోగం తగ్గిపోవడం, సమాచారం ఇవ్వడంలో ఆలస్యం, కొన్నిసార్లు సమాచారం కోరిన వ్యక్తులపై దాడులు జరగడం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. సమాచార హక్కు చట్టం కేవలం ఒక చట్టం మాత్రమే కాదు, అది ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు. ప్రభుత్వ కార్యకలాపాలపై ప్రజల కంటిచూపును నిలబెట్టే వ్యవస్థ ఇది. ప్రజాస్వామ్యం సజీవంగా ఉండాలంటే ప్రతి పౌరుడు ఈ చట్టాన్ని తెలుసుకొని వినియోగించాలి. అక్టోబర్ 12, 2005న భారత ప్రజాస్వామ్యం మరింత బలపడిందిబీ ప్రజల చేతిలో ఒక పెన్నుతో సత్యాన్ని వెలికితీసే శక్తి అప్పగించబడిన రోజు అది.
**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# భారత రాజకీయ న్యాయ వేదికపై ఓ మానవతా విప్లవం... డాక్టర్ లోహియా జీవితం

## భారత రాజకీయ చైతన్యానికి విప్లవాత్మక నాయకుడు... డాక్టర్ రామ్ మనోహర్ లోహియా - అక్టోబర్ 12... డాక్టర్ రామ్ మనోహర్ లోహియా వర్ధంతి




డాక్టర్ రామ్ మనోహర్ లోహియా 1910 మార్చి 23న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని ఫైజాబాద్ జిల్లా, అక్బర్‌పూర్ గ్రామంలో జన్మించారు. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిన ఆయన చిన్ననాటి నుంచే సమాజంలో ఉన్న అసమానతలు, పేద ప్రజల కష్టాలు, అన్యాయ పరిస్థితులు ఆయన మనసును కదిలించాయి. సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేయాలన్న సంకల్పం చిన్నతనంలోనే ఆయనలో బలపడింది. విద్యాభ్యాసంలో అసాధారణ ప్రతిభ కనబరచిన లోహియా, భారత రాజకీయ, ఆర్థిక వ్యవస్థలపై లోతైన అవగాహన పెంపొందించుకున్నారు. జర్మనీలో ఆర్థిక శాస్త్రంలో డాక్టరేట్ పూర్తి చేసి, యూరోపియన్ సామాజిక సిద్ధాంతాలపై విశేష పట్టు సాధించారు. అక్కడి సామాజిక, ఆర్థిక చైతన్య ఉద్యమాల నుంచి ఆయనకు స్ఫూర్తి లభించి, దేశానికి ఒక ప్రగతిశీల నాయకుడిగా అవతరించడానికి దారితీసింది. లోహియా గారి రాజకీయ ప్రవేశం భారత స్వాతంత్ర్య ఉద్యమం ద్వారానే ఆరంభమైంది. 1930%–%40ల మధ్య గాంధీ సత్యాగ్రహాలు, నిరసనలు, జైలు పోరాటాల్లో ఆయన చురుకుగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఉద్యమకారుడిగా ఆయన చూపిన ధైర్యం, త్యాగం విశేషమైనవి. భారత యువతలో రాజకీయ చైతన్యాన్ని రగిలించడం, స్వాతంత్ర్యం కోసం వారిని ప్రేరేపించడం ఆయన ప్రధాన ధ్యేయంగా మారింది. విదేశాల్లో నేర్చుకున్న సామాజిక ఆర్థిక సిద్ధాంతాలను భారతీయ పరిస్థితులకు అనుగుణంగా మార్పులు చేసి, పేదలు, రైతులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అంకితభావంతో కృషి చేశారు. స్వాతంత్ర్యం అనంతరం లోహియా గారు భారత రాజకీయ రంగంలో సామాజిక సమానత్వం, ఆర్థిక న్యాయం, పేదల సంక్షేమం వంటి అంశాలను ముందుకు తెచ్చారు. నెహ్రూ ప్రభుత్వ విధానాలపై ఆయన గట్టి విమర్శలు చేశారు. ప్రజల సంక్షేమాన్ని కంటే ప్రభుత్వ వ్యవస్థల కేంద్రీకృత ఆలోచనలను ఆయన వ్యతిరేకించారు. సోషల్ ప్రోగ్రెసివ్ పార్టీ, తరువాత సోషలిస్ట్ పార్టీ స్థాపన ద్వారా రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాలు, యువత హక్కుల పరిరక్షణకు గట్టి కదలికలు చేపట్టారు. లోహియా గారి నాయకత్వం సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలకు కొత్త దిశను చూపింది. లోహియా గారి రాజకీయ తత్వాలు ప్రజాస్వామ్యం, సామాజిక సమానత్వం, యువత చైతన్యం, ఆర్థిక న్యాయం అనే నాలుగు మూలస్తంభాలపై నిలిచాయి. కుల, లింగ, ఆర్థిక భేదాలను నిర్మూలించి, సమాజంలోని ప్రతి వర్గానికి సమాన అవకాశాలు కల్పించాలన్నది ఆయన ప్రధాన ధ్యేయం. ప్రజాస్వామ్యం కేవలం ఓటు హక్కులో కాకుండా, ప్రజల పాలనా హక్కులో ప్రతిబింబించాలన్నది ఆయన విశ్వాసం. ఆయన రైతు, కార్మికుల జీవితాలను లోతుగా అర్థం చేసుకుని, వారి సమస్యలకు తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ప్రజల్లో రాజకీయ అవగాహన, సామాజిక బాధ్యత కలగాలన్న ఆలోచనతో జీవించారు. లోహియా గారి రాజకీయ జీవనంలో అనేక విశిష్ట ఘట్టాలు చోటుచేసుకున్నాయి. 1942%–%44 మధ్య స్వాతంత్ర్య పోరాటంలో బాంబే, లక్నో, అహ్మదాబాద్ ప్రాంతాల్లో యువత, రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. 1948%–%49లో సోషల్ యూత్ ఆర్గనైజేషన్‌ను స్థాపించి, యువతలో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించారు. 1952%–%67 మధ్య లక్నో, బీహార్ ప్రాంతాల ప్రజాప్రతినిధిగా పార్లమెంట్‌లో పనిచేసి, పేదల, రైతుల, కార్మికుల హక్కుల రక్షణకు సంబంధించిన చట్టబిల్లులు ప్రవేశపెట్టారు. నెహ్రూ పాలనలోని ఆర్థిక విధానాలపై ఆయన చేసిన విప్లవాత్మక విమర్శలు, ప్రత్యామ్నాయ ఆర్థిక సూత్రాల ప్రతిపాదనలు భారత రాజకీయ చరిత్రలో ప్రగతిశీల మైలురాళ్లుగా నిలిచాయి. లోహియా గారి ప్రసంగాలు, వ్యాసాలు, రచనలు భారతీయ రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలపై లోతైన విశ్లేషణను అందించాయి. 1950%–%67 మధ్య ఆయన రూపొందించిన సామాజిక న్యాయ బిల్లులు, రైతు సంక్షేమ చట్టాలు, కార్మిక హక్కుల పరిరక్షణ చట్టాలు భారత రాజకీయ చరిత్రలో స్థిరమైన పునాది వేశాయి. ఆయన ప్రజలలో చైతన్యాన్ని రగిలించి, సామాజిక సమానత్వం వైపు దారి చూపిన గొప్ప మార్గదర్శకుడు. 1967 అక్టోబర్ 12న 57 ఏళ్ల వయసులో లోహియా గారు పరమపదించారు. ఆయన మరణం భారత రాజకీయ రంగానికి అపూర్వ నష్టం. అయినా ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు, జీవన విలువలు భారత ప్రజాస్వామ్య చైతన్యంలో నేటికీ సజీవంగా ఉన్నాయి. సామాజిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువలు, యువతలో చైతన్యం పెంపొందించడానికి ఆయన చేసిన కృషి భారత చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచింది. డాక్టర్ రామ్ మనోహర్ లోహియా జీవితం మనకు ఒక గొప్ప పాఠం. సమాజంలో అసమానతలను తొలగించి, ప్రజాస్వామ్యాన్ని ప్రజల జీవితాల్లోకి తీసుకురావాలన్న ఆకాంక్ష ఆయన సూత్రాల సారం. ఆర్థిక, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన త్యాగం, పోరాటం భవిష్యత్ తరాలకు ప్రేరణగా నిలుస్తాయి. ఆయన ఆలోచనలు నేటి భారత రాజకీయాలకు మార్గదర్శకంగా ఉండి, సమాజాన్ని సమానత్వం, న్యాయం, చైతన్య దిశలో నడిపిస్తాయి. లోహియా గారి జీవితం ఒక ఆదర్శం ు సామాజిక న్యాయానికి ప్రతీక, ప్రజాస్వామ్య చైతన్యానికి శాశ్వత దీప్తి.
**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్...9440595494**

# మానేద్దాం.. మన'సారా'

సిరిసిల్ల :అల్మాస్‌పూర్‌కు చెందిన ఓ యువతి వీర్నపల్లి మండలం సీతారాంనాయక్‌తండాలో 10 లీటర్ల సారా కొనుగోలు చేసింది. పొట్లాలను కళాశాల బ్యాగులో నింపుకొని ఆర్టీసీ బస్సు ఎక్కింది. తోటి ప్రయాణికులకు అనుమానం రావడంతో వీర్నపల్లిలో బస్సును ఆపి తనిఖీ చేసిన పోలీసులకు చిక్కింది. వీర్నపల్లి మండలం గర్జనపల్లి ప్రధాన రహదారికి పక్కనే ఇద్దరు వ్యక్తులు చాలా రోజులుగా గుడుంబా కాస్తున్నారు. ఎవరికి అనుమానం రాకుండా పెరటి తోట మధ్యలో గుడిసెలు వేశారు. బెల్లం పులిశాక బట్టీలు పెడుతూ సారాయి కాస్తున్నారు. వారం రోజుల క్రితం పోలీసులకు చిక్కారు.

జిల్లాలో సారా వ్యాపారం గుట్టుచప్పుడు కాకుండా జరుగుతోంది. వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట, రుద్రంగి, చందుర్తి, కోనరావుపేట, గంభీరావుపేట మండలాల్లో అధికారుల కళ్లుగప్పి గుడుంబా తయారీ చేస్తున్నారు. గతంలో కిరాణ దుకాణాల ద్వారా ముడి సరకులు కొనుగోలు చేసేవారు. వర్తకులపై కేసుల నమోదుతోపాటు బైండోవర్లు, అవగాహనతో చాలావరకు వ్యాపారానికి దూరంగా ఉంటున్నారు. ఈ క్రమంలో కొంతమంది ద్వారా సరిహద్దులోని కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల ద్వారా రాత్రిపూట సారా తయారీకి అవసరమైన



ముడి సరకు సరఫరా చేసుకుంటున్నారు. దీంతో వ్యాపారం ఒక్క సేరు.. నూరు రూపాయలుగా సాగుతోంది. అధికారులు దాడు చేసిన క్రమంలో కొంతమంది మాత్రమే పట్టుబడుతున్నారు.

**నిలిచిన పునరావాసం**

గుడుంబా తయారీదారుల్లో మార్పు తీసుకొచ్చేందుకు సర్కారు పునరావాసం పథకాన్ని అమలు చేసింది. 2015లో జిల్లాలో వివిధ సామాజికవర్గాలకు చెందిన 59 మందిని గుర్తించారు. రూ.2 లక్షల ఆర్థిక సాయాన్ని అందించి ఆసక్తి కలిగిన వ్యాపారాలు పెట్టించగా సత్ఫలితాలు కనిపించాయి. ఆ తర్వాత ఆపేయడంతో మళ్లీ పల్లెల్లో గుడుంబా గుప్పుమంటోందనే అభిప్రాయాలు ఉన్నాయి.

**పట్టణాలకు సరఫరా..**

మద్యం ధరల దృష్ట్యా చాలామంది సారాకు అలవాటు పడుతున్నారు. ఒళ్లు నొప్పులు తగ్గిస్తాయన్న అపోహలతోనూ తాగుతుంటారు.

ఇప్పపువ్వుతో కాసే సారాకు గిరాకీ ఉంటోంది. బట్టీ నుంచి వచ్చే మొదటి సీసాకు లీటర్‌కు రూ.500 నుంచి రూ.1,000 వరకు ధర పలుకుతోంది. నీరు కలిపిన లీటరు సారాయిని డిమాండ్ ప్రకారం.. రూ.150 వరకు అమ్ముతుంటారు. కొందరు బెల్లం, పటిక పులియబెడుతున్నారు. ప్రత్యేకంగా తయారీ చేసుకున్న పాత్రలను బట్టీలపై పెడుతూ సారా కాస్తున్నారు. ఇప్పపువ్వు సారాయి పేరిట వేములవాడ, సిరిసిల్లకు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఈ వ్యాపారం 24 గంటలు అందుబాటులో ఉండడంతో చాలా మంది మత్తుకు బానిసవుతూ అనారోగ్యం పాలవుతున్నారు.

# లేలేత ప్రాయం.. మానని గాయం

నల్గొండ :జిల్లా కేంద్రంలో ఓ బాలిక నయవంచకుడి మాటలు నమ్మి గదికి వెళ్లి అతని చేతిలో అత్యాచారానికి గురై ప్రాణాలు పోగొట్టుకుంది. ఇతనికి మరో నిందితుడు సహకరించడంతో వీరిద్దరిపై నల్గొండ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఆరు నెలల క్రితం నార్కట్‌పల్లి మండలానికి చెందిన (16) బాలికను అదే ప్రాంతానికి చెందిన ఓ యువకుడు ప్రేమపేరుతో మోసం చేసి కిడ్నాప్ చేశాడు. బాధితురాలి తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు బాలికను అదుపులోకి తీసుకొని బాలసదన్‌లో చేర్చి చదువుకు ఏర్పాటు చూస్తున్నారు.

జిల్లాలో కొంతకాలంగా బాలలు, పెద్దలు అనే తేడా లేకుండా నేరాలకు పాల్పడుతున్నారు. మానవత్వం లేకుండా వయసుతో సంబంధం లేకుండా అత్యాచారాలకు పాల్పడుతున్నారు. అభం శుభం తెలియని చిన్నారులు చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారు. ఓ వైపు పోలీసులు నేర నియంత్రణ చర్యలు చేపడుతున్నా.. జరగాల్సిన అనర్థాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రధానంగా అత్యాచారం,



కిడ్నాప్‌లకు గురవుతున్న వారిలో చిన్నారులే అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. నేరానికి గురైన బాల,బాలికల్లో 60 నుంచి 70 శాతం మంది మాత్రమే పోలీస్‌స్టేషన్ల మెట్లు ఎక్కుతున్నారు.

**కఠిన చర్యలు తీసుకుంటున్నాం.: శరత్‌చంద్ర పవార్, ఎస్పీ**

చిన్నారులపై జరుగుతున్న నేరాల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. పోక్సో కేసులు నమోదు చేయడంతో పాటు త్వరితగతిన కోర్టులో సాక్ష్యాలు పొందుపరిచి నిందితులకు శిక్షలు పడేలా చూస్తున్నాం. విద్యాసంస్థలు, ప్రధాన కూడళ్ల వద్ద షీటీం సిబ్బందిని ఏర్పాటు చేసి రక్షణ కల్పించడంతో పాటు ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేశాం. బాధితులు ఫిర్యాదులు చేస్తే రక్షణ కల్పించి.. షీటీం, భరోసా, సఖి, కేంద్రాల ద్వారా న్యాయం జరిగేలా చూస్తాం.

**సామాజిక మాధ్యమాల ద్వారా పక్కదారి : డా.శివకుమార్, మానసిక వైద్యుడు** యువత పెడదారి పట్టడానికి ప్రధాన కారణం సామాజిక మాధ్యమాలే. వీటి ద్వారా ఏర్పడిన పరిచయాలతో చిన్న వయసులోనే ప్రేమ, పెళ్లి అంటూ ముందుకు వెళ్తున్నారు. మంచికి ఉపయోగించాల్సిన చరవాణిని నీలి చిత్రాలు చూస్తూ కొందరు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారు. నేర ప్రవృత్తిని పెంచే వీడియోలను పిల్లలు ఎక్కువగా చూస్తున్నారు. చరవాణి, ల్యాప్‌ట్యాబ్‌లు తరచూ పరిశీలించాలి. ప్రతి విషయాన్ని వారితో మాట్లాడడం ద్వారా కొన్ని తప్పులు జరిగే అవకాశం ఉండదు.

# చతికిల'బడి'న పనులు



కోరుట్ల : కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో 2022లో 'మన ఊరు-మన బడి', ఉపాధిహామీ పథకం కింద రూ.73.60 లక్షలతో నూతన భవన నిర్మాణం చేపట్టారు. రెండు స్లాబులు వేశాక బిల్లులు రావడం లేదని గుత్తేదారు పనులు నిలిపివేశారు. మిగతా పనులు చేయకుండా వదిలేశారు. మరోవైపు విద్యార్థులకు గదులు సరిపోక 70 మందిని స్లాబ్ కిందనే కూర్చోబెట్టి పాఠాలు బోధిస్తున్నారు. కోరుట్ల పట్టణంలోని ఉన్నత పాఠశాలకు మూడేళ్ల కిందట 'మన బస్తీ-మన బడి' కింద రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. 8 తరగతి గదులు, డైనింగ్‌హాల్, కిచెన్‌షెడ్, మూత్రశాలలతో జీం1తో కూడిన భవనం నిర్మించాలని నిర్ణయించారు. పనులు ప్రారంభించినా పిల్లర్ల దశలో వదిలేశారు. అంతలోనే శాసనసభ ఎన్నికలు రావడంతో బిల్లులు రావని గుత్తేదారు చేతులెత్తేశారు. దీంతో మొత్తం 285 మంది విద్యార్థులను 1959లో నిర్మించిన రేకుల గదుల్లో, వరండాల్లో కూర్చోబెట్టి పాఠాలు చెబుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించి ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దేందుకు 2022లో గ్రామీణ ప్రాంతాల్లో 'మన ఊరు-మన బడి', పట్టణ ప్రాంతాల్లో 'మన బస్తీ-మన బడి' పథకానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మొదటి విడతలో మండలంలోని మూడో వంతు పాఠశాలల్లో పనులను గుర్తించి నిధులు మంజూరు చేశారు. పట్టణానికి, మండలానికి ఒకటి చొప్పున బడిని ప్రయోగాత్మకంగా ఎంపిక చేయగా పనులు పూర్తయ్యాక ఎమ్మెల్యేలు, కలెక్టర్ చేతుల మీదుగా ఆర్భాటంగా ప్రారంభించారు. అనంతరం మిగతా పాఠశాలల్లోనూ పనులు చేపట్టాలని ఆదేశించడంతో గుత్తేదారులు, స్థానిక ప్రజాప్రతినిధులు మొదలుపెట్టారు.

**శిథిలమవుతున్న కట్టడాలు**పాఠశాలల్లో ఒక అంతస్తు(జిం1)తో కూడిన అధునాతన భవనాల నిర్మాణం చేపట్టారు. పలు చోట్ల రూ.లక్షల విలువైన స్లాబులు వేశారు. సగం కూడా చెల్లించకపోవడంతో పనులను అర్ధంతరంగా వదిలేశారు. డైనింగ్‌హాల్, కిచెన్ షెడ్ల నిర్మాణాలు పూర్తి చేసినా అరకొరగా బిల్లులు వచ్చాయి. అన్ని చోట్లా పనులు ప్రారంభించినా 2023 చివరలో శాసనసభ ఎన్నికలు రాగా భారాస స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైంది. పాత పనులకు సంబంధించిన బకాయిల చెల్లింపులను ప్రభుత్వం పూర్తిగా నిలిపివేసింది. దీంతో రెండేళ్లుగా పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. నిర్మాణ దశలోనే భవనాలు దెబ్బతింటున్నాయి.

# రాజన్న గోశాల.. ఎన్నటికో ఆధునికీకరణ?



వేములవాడ: వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునే భక్తుల్లో చాలామంది కోడె మొక్కులు చెల్లించుకుంటారు. కొందరు భక్తులు నిజకోడెను సమర్పిస్తుంటారు. ఆలయానికి ఏటా భక్తుల ద్వారా సమకూరే ఆదాయంలో సింహభాగం కోడె మొక్కుల ద్వారా వస్తోంది. ఈ కోడెలను ఆలయ సమీపంలోని కట్టకింద గోశాల షెడ్లలో ఆలయ అధికారులు సంరక్షిస్తుంటారు. భక్తులు సమర్పించే నిజ కోడెలను తిప్పాపూర్ గోశాలలో సంరక్షిస్తుంటారు. తిప్పాపూర్ గోశాలలో కోడెలకు అవసరమైన షెడ్లు, వసతులు చాలావరకు సమకూరినప్పటికీ కట్టకింద గోశాలలో వసతులు మెరుగు పడాల్సి ఉంది. దీన్ని ఆధునికీకరించాలని ఏళ్ల క్రితమే ప్రతిపాదించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు.

**ఇదీ పరిస్థితి**కట్టకింద గోశాలలో ఏళ్ల క్రితం నిర్మించిన షెడ్డు ఉంది. మరోరెండు రేకుల షెడ్లున్నాయి. అనేకసార్లు తాత్కాలిక మరమ్మతులు చేయించినప్పటికీ షెడ్డు పూర్తిగా శిథిలమవ్వడంతో అందులోని ఆవులను తిప్పాపూర్ గోశాలకు తరలించారు. ప్రస్తుతం ఆ షెడ్డులో స్వామివారికి నిత్యం చేసే గోపూజ ఆవును మాత్రమే ఉంచుతున్నారు. స్వామివారికి భక్తులు మొక్కులు చెల్లించుకునే దాదాపు 150 వరకు కోడెలను ఈ రేకుల షెడ్లలో ఉంచుతున్నారు. ఎండాకాలంలో రేకుల షెడ్లలో కోడెలు ఇబ్బందులు పడుతున్నాయి.

**వర్షం కురిస్తే అస్తవ్యస్తం**

ప్రస్తుతం కట్టకింద గోశాల రోడ్డుకు చాలావరకు దిగువన ఉంటుంది. రోడ్డు మీదుగా వెళ్లే వర్షంనీరు పక్కన మురుగు కాలువలోకి చేరుతున్నప్పటికీ గోశాల ప్రధాన గేటు వద్ద కాలువ నిర్మాణం అసంపూర్తిగా ఉండి మట్టి కూరుకుపోవడంతో వర్షం నీరంతా గోశాలలోకి చేరుతోంది. గోశాల ఆవరణ బురదగా మారుతుండగా కోడెలు బురదతోనే ఆలయానికి రావాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో కోడెలు జారి పడిన సందర్భాలున్నాయని సిబ్బంది పేర్కొంటున్నారు.

**షెడ్లకు ప్రతిపాదన**

ప్రస్తుతం ఉన్న గోశాలను ఆధునికీకరించాలని అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఇందులో భాగంగా గోశాలను పూర్తిగా తొలగించి మట్టిని నింపి రోడ్డుకు సమాంతరంగా తయారు చేసిన తరువాత ఆధునిక పద్ధతులతో కోడెలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా షెడ్లను నిర్మాణం చేయాలని నిర్ణయించారు.

కోడెలకు గాలి, వెలుతురుతోపాటు మేత, నీటి వసతి ఉండేలా నిర్మాణం చేయాలని సంకల్పించినప్పటికీ ఆ ప్రతిపాదనలేవీ ముందుకు సాగలేదు. దీంతో గోశాల ఆధునికీకరణకు మోక్షం లభించడం లేదు. ప్రస్తుతం కట్టకింద గోశాల రోడ్డు కంటే చాలా లోతులో ఉందని.. షెడ్లన్నీ శిథిలమై ఉన్నాయని.. గోశాలను రోడ్డుకు సమాంతరంగా చేసి ఆధునిక షెడ్ల నిర్మాణం చేయడం కోసం ప్రణాళిక తయారు చేశామని రాజన్న ఆలయ డీఈ రఘునందన్ పేర్కొన్నారు.

# చెక్'డ్యాం'లు.. నీరుగారిన లక్ష్యం



ఓదెల: వరద నీరు వృథా కాకుండా ఉండేందుకు ఓదెలలోని మానేరు వాగులో చెక్‌డ్యామ్‌ల నిర్మాణం చేపట్టారు. దీంతో నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెరిగేందుకు అవి ఎంతగానో దోహదం చేశాయి. సమృద్ధిగా జలాల లభ్యత ఉండి ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. నిర్మించిన కొన్నాళ్లకే అవి పేకమేడల్లా కూలడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారినట్లైంది. దీంతో కూలినవాటి స్థానంలో పునర్నిర్మాణం జరిగితే సాగు, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రజలకు మేలు చేకూరనుంది.

**రెండేళ్లకే కూలిపోయి..**ఓదెలలోని మడక-కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని కోర్కల్ గ్రామాల మధ్యన మానేరులో 2017లో అప్పటి పాలకులు మానేరు సమీప గ్రామాల ప్రజలకు, రైతులకు.. సాగు, తాగునీటి కొరత తీర్చేందుకు రూ.22 కోట్ల వ్యయంతో దాదాపు 900 మీటర్ల పొడవునా చెక్‌డ్యామ్ నిర్మించారు. 2019లో వచ్చిన వరద నీటి ప్రవాహానికి అది నిట్ట నిలువునా కూలిపోయింది. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలు పాటించకపోవడంతోనే చెక్‌డ్యామ్ కూలిందనే ఆరోపణలున్నాయి.

**నిర్మాణ సమయంలోనూ లీకేజీలు**

ఓదెలలోని రూపునారాయణపేట-కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం విలాసాగర్ గ్రామాల మధ్య 2017లో రూ.12.8 కోట్లతో మరో చెక్‌డ్యామ్ నిర్మించారు. కాగా నిర్మాణ సమయంలో సిమెంట్ దిమ్మెల కింద నుంచి నీరు లీకేజీలైన సందర్భాలున్నాయి. దీంతో ఐదేళ్లకే వరదనీటి ప్రవాహానికి చెక్‌డ్యామ్ పలుచోట్ల కూలిపోయింది. అప్పటినుంచి తిరిగి పునర్నిర్మాణానికి నోచుకోలేదు.

**ప్రతిపాదనలు తెప్పిస్తాం- విజయరమణారావు, ఎమ్మెల్యే పెద్దపల్లి**

ఓదెలలోని మడక, రూపునారాయణపేట మానేరు వాగుల్లో అప్పటి ప్రభుత్వం నాసిరకంగా నిర్మాణాలు చేపట్టడంతోనే రెండు చెక్‌డ్యామ్‌లు కూలిపోయాయి. రైతాంగానికి, మానేరు సమీప గ్రామాల ప్రజలకు తాగు, సాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఉండేందుకు అధికారులతో చర్చించి పునర్నిర్మాణానికి నూతనంగా ప్రతిపాదనలు తెప్పిస్తాం. తప్పకుండా చెక్‌డ్యామ్‌ల పునర్నిర్మాణానికి కృషి చేస్తాం.

# ఇంట్లోకి.. ఒంట్లోకి.. దుమ్ము..!

నల్గొండ: చిట్యాల పెద్దకాపర్తి, కట్టంగూరు జంక్షన్(నల్గొండ రోడ్డు), ఇనుపాముల, టేకుమట్ల, సూర్యాపేట ఎస్వీ కళాశాల-జనగామ జిల్లా కూడలి, జమ్మిగడ్డ కూడలి, దురాజ్‌పల్లి, ముకుందాపురం యూటర్న్ మునగాల, కోమరబండ, కోదాడ, మేళ్లచెరువు పై వంతెన, శ్రీరంగా పురం వద్ద అండర్ పాస్ వంతెన, సర్వీస్ రోడ్డు పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. ఏడాదిన్నర కాలంలో పనులను పూర్తి చేయాలని ఎన్‌హెచ్‌ఏఐ గుత్తేదారు సంస్థను ఆదేశించినా..పనులు నెమ్మదిగా సాగుతున్నాయి.

చౌటుప్పల్‌లో మురికి కాలువలు, సర్వీస్ రహదారుల పనులు ఆగుతూ సాగుతూ నడుస్తున్నాయి. తంగడపల్లి రహదారి నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు, మీసేవ నుంచి ఆర్డీవో కార్యాలయం వెళ్లే దారి వరకు కంకర వేసి తారు వేయలేదు. బస్టాండ్ నుంచి చిన్న కొండూరు రహదారి వరకు 150 మీటర్ల మేర పైవంతెన వస్తుంది. మిగిలిన ప్రాంతంలో మట్టికట్టను నిర్మిస్తున్నారు.

హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై అత్యంత ప్రమాదకరమైన ప్రాంతాల్లో (బ్లాక్‌స్పాట్స్) పనులు మూడడుగులు ముందుకు.. ఆరు అడుగులు వెనక్కి అన్నచందంగా కొన..సాగుతున్నాయి. గతేడాది జూన్‌లో తరచూ ప్రమాదాలు జరిగే 17 బ్లాక్‌స్పాట్లలో పనులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.300 కోట్లతో ప్రారంభించారు. ఒక పైవంతెన, 13 అండర్‌పాస్ వంతెనలు, 10 చోట్ల సర్వీస్ రహదారుల నిర్మాణాలను ప్రారంభించారు. కాగా అధికారులు 16 బ్లాక్‌స్పాట్లు ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో, మిగిలిన ఒక ప్రాంతం ఏపీలోని నవాబుపేట వద్ద గుర్తించి ప్రమాదాల నివారణకు పనులు చేపడుతున్నారు.

**అధికారులు పట్టించుకోవడం లేదు : పోకల రాములు, పాన్**



**దుకాణయజమాని, ఇందిరానగర్, చిట్యాల**

ఆరు నెలల నుంచి రహదారి పనులు ఆగుతూ సాగుతున్నాయి. మట్టి, ఇసుక, కంకర రవాణా లారీలతో పాటు ట్రాఫిక్ రాకపోకల మూలంగా గుంతలు ఏర్పడ్డాయి. ఆ గుంతల్లో ఫ్లైయాష్‌ను నింపుతున్న ప్రతిసారి గాలికి చెలరేగి మా దుకాణంపై, నాపై పడుతుంది. కనీసం నీళ్లు తెచ్చి గుమ్మరిస్తే దుమ్ము రేగదు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదు.

**పూలు కొనడం లేదు : ఎండీ.మన్నన్, పూలదుకాణం, ఉరుమడ్ల రోడ్, చిట్యాల**

ఈ దుమ్ము, ధూళితో ఇప్పటికే మా కుటుంబం మొత్తం అనారోగ్యం పాలైంది. దుమ్ము పేరుకుపోయి పూలు ఎవరూ కొనకపోవడంతో బంద్ పెట్టుకోవాల్సి వస్తుంది. ఇంకెప్పుడూ పనులు పూర్తిచేస్తారో అధికారులకే తెలియాలి.


**వర్షాలతో పనులు నిలిచాయి : నాగేశ్వరరావు, ఎన్‌హెచ్-65 ప్రాజెక్టు డైరెక్టర్** చిట్యాల, ఇందిరానగర్, పెద్దకాపర్తి, చౌటుప్పల్ ప్రాంతాల్లో పనులు వర్షాలతో నిలిచిపోయాయి. అండర్‌పాస్ పనులకు గోతులు తవ్వి ఫిల్లర్లు నిర్మించిన అనంతరం గడ్డర్స్, ప్రికాస్ట్ వాల్స్ అమర్చి మట్టిని నింపితే వర్షానికి తడిచి పనులకు అడ్డంకిగా మారింది. భారీ వాహనాలు మట్టి, ఇతర వస్తు సామగ్రి రవాణా చేస్తుండటం మూలంగా అక్కడక్కడ గోతులు పడుతుండగా సిబ్బంది ఫ్లైయాష్‌ను నింపుతున్నారు. తాత్కాలికంగా నీటిని చల్లించి సమస్యను నివారిస్తాం. డిసెంబరులోగా మిగిలిన పనులను పూర్తి చేస్తాం.

# వడ్డీ పేరుతో వల.. జీవితం భళా

నల్గొండ : భారీ విల్లాలు.. భవనాలు.. ఖరీదైన కార్లు.. విలాసవంతమైన జీవితం అనుభవిస్తున్న వడ్డీ వ్యాపారి బాలాజీ నాయక్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వడ్డీవ్యాపారం నిర్వహించడం, బాధితులను మభ్యపెట్టి మనీలాండరింగ్‌కు పాల్పడటం కారణాలతో అతనిపై ఎస్పీ శరత్‌చంద్రపవార్ కేసు నమోదు చేసి ఆచూకీ కోసం పోలీసు బృందాలతో గాలిస్తున్నారు. పీఏపల్లి, మిర్యాలగూడ, దేవరకొండ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో అమాయకులైన గిరిజనులే లక్ష్యంగా అధిక వడ్డీ ఆశచూపి రూ.కోట్లు కొల్లగొట్టాడు. 30 ఏళ్ల లోపు వయస్సు..హల్‌చల్ చేసే అతని దినచర్య.. ప్రముఖ రాజకీయ, పోలీసులతో ఉండే సన్నిహిత సంబంధాలు సెలబ్రిటీలను మించి ఉండటంతో గిరిజనులు మోసపోయారు.

**నల్గొండ జడ్పీపీఠంపై కన్నేసే 'రేంజ్'!**

స్థానిక సంస్థల్లో ఈసారి నల్గొండ జిల్లా జడ్పీ పీఠం ఎస్టీ మహిళకి కేటాయించడంతో.. బాలాజీనాయక్ దృష్టి దీనిపై పడిందని అతని సన్నిహితులు చెబుతున్నారు. అధికారం చేజిక్కితే 'అన్నీ వ్యవహారాలు' సర్దుకుంటాయని భావించి స్థానిక సంస్థలే ఎన్నికలే తనకు చక్కని అవకాశమని భావించాడు. మిర్యాలగూడకు చెందిన ఓ ప్రముఖ



అధికార పార్టీలోని సామాజికవర్గ నేతను కలిసి తన రాజకీయ ప్రస్థానాన్ని, భార్యకు జడ్పీ టికెట్ విషయమై చర్చించారు. ఈ క్రమంలో ఆ నేత తనకు 'రేంజ్‌రోవర్' కారు కానుకగా ఇస్తేనే జడ్పీఛైర్మన్‌పై హామీ ఇస్తానని చెప్పడంతో అతను అక్రమ సంపాదనంతా దీనికి వెచ్చించేందుకు సిద్ధమవుతుండగా.. బాలాజీనాయక్ బాధితుడు రమావత్ సరియా చనిపోవడం కలకలం సృష్టించింది.

**ఉద్రిక్త పరిస్థితి**

పీఏపల్లి మండలం పలుగుతండాకు చెందిన బాలాజీనాయక్‌కు ఇదే గ్రామానికి చెందిన యువకుడు సరియా పెద్దమొత్తంలో డబ్బులిచ్చి తిరిగి చెల్లించకపోవడంతో మనస్తాపానికి గురై మిర్యాలగూడలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో బాధితులు బాలాజీ ఇంటిపై దాడి చేసి ఇంట్లోని సామగ్రి దగ్ధం చేశారు. సరియా మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువస్తున్నారన్న సమాచారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు గ్రామంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బాలాజీనాయక్‌కి అప్పులు ఇచ్చిన బాధితులు మిర్యాలగూడలోని విద్యానగర్‌లో ఉంటున్న అతడి సోదరుడి నివాసం వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఒకటో పట్టణ నాగభూషణరావు, ఎస్సైలు సైదిరెడ్డి, భిక్షమయ్య, వేములపల్లి ఎస్సై వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్లాస్టిక్ నిషేధమేదీ..?

హైదరాబాద్: నగరంలోని కాటేదాన్, నాచారం, మల్లాపూర్, బాలానగర్ ప్రాంతాల్లో 200కు పైగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ (ఎస్‌యూపీ) ఉత్పత్తుల యూనిట్లు ఉన్నాయి. టన్నుల కొద్దీ ఉత్పత్తులు నగరంలోని మార్కెట్లతో పాటు ఇతర జిల్లాలు, పక్క రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నా కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు పట్టడం లేదు. కొందరు ఉత్పత్తిదారులకు కొమ్ము కాస్తూ నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారు. నగరంలో రోజూ 8,500 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతుండగా..అందులో 1,275 టన్నులు పోగుపడి హానికరంగా పరిణమిస్తోంది.

**ఇదీ పరిస్థితి..** 120 మైక్రాన్ల మందం కంటే తక్కువ ఉన్న ఉత్పత్తులు వాడకూడదంటూ నిషేధం ఉంది. బాలానగర్, చర్లపల్లి, నాచారం,



కాటేదాన్ ప్రాంతాల్లో ఈ యూనిట్లు యథేచ్ఛగా నడుస్తున్నాయి. మొజంజాహీ మార్కెట్, బేగంబజార్, అమీర్‌పేట్, రద్దీ ప్రాంతాల్లో వాటి వినియోగం కనిపిస్తోంది. మాంసం, మద్యం దుకాణాలు, రైతు బజార్లలో 15–20 మైక్రాన్ల మందం ఉన్న క్యారీబ్యాగ్‌లు దర్శనమిస్తున్నాయి. ఒక్కో పరిశ్రమ నుంచి యంత్రానికి రూ.30 వేల చొప్పున ప్రతినెలా మధ్యవర్తుల ద్వారా అధికారులకు మామూళ్లు అందుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి.

**పౌర భాగస్వామ్యం అవసరం**

సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులైన స్ట్రాలు, చేతి సంచి, పాత్రలను తిరస్కరించాలి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గాజు, వెదురు, ఇత్తడి, స్టీల్ పాత్రల వినియోగం పెంచాలి. ప్లాస్టిక్ బహిష్కరణ కార్యక్రమాలను పాఠశాలలు, కళాశాలల స్థాయిలో నిర్వహించాలి.

# పదిలమేనా.. పదిశాతం

సూర్యాపేట : జిల్లాలోని పురపాలికలకు వెంచర్ నిర్వాహకులు అప్పగించిన పదిశాతం స్థలాలు పలుచోట్ల ఆక్రమణకు గురవుతున్నాయి. వెంచర్లలో నివాసముంటున్నవారి ఆహ్లాదం కోసం మొక్కలు, పార్కులు వంటి ఏర్పాటు చేయాలి. కానీ ఎక్కడా ఇలాంటి వసతులు కల్పించడం లేదు. ఆ స్థలాల్లో దట్టంగా మొక్కలు పెరిగి విషసర్పాలకు నిలయంగా మారాయి. సూర్యాపేట పురపాలికలో మొక్కలు నాటినా పలుచోట్ల ఏపుగా పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. కోదాడలో ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మిగతా పురపాలికల్లో కూడా ఇదే పరిస్థితి.

సూర్యాపేట పురపాలికలో 13 గ్రామాలు విలీనమయ్యాయి. వీటి పరిధిలో 56 వెంచర్లున్నాయి. సంబంధిత నిర్వాహకులు పురపాలికకు 10 శాతం స్థలం అప్పగించారు. వాటిలో గతేడాది మొక్కలు నాటగా.. ఏపుగా పెరిగాయి. వాటి స్థలాలు ఎక్కడా ఆక్రమణకు గురికాలేదు. మొక్కలు లేనిచోట్ల ఈ ఏడాది వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటారు. వాటిని పుర సిబ్బంది ఎప్పటికప్పుడు సంరక్షణ చర్యలు చేపడుతున్నారు. వెంచర్ నిర్వాహకులు సంబంధిత స్థలాలను పుర కార్యాలయం పేరిట రిజిస్ట్రేషన్ చేయించారు. మొత్తం స్థలం సుమారు 60 ఎకరాలు ఉన్నట్లు పుర అధికారులు తెలిపారు. ఈ స్థలాలు ఆక్రమణకు గురయ్యే అవకాశం లేదని పుర కమిషనర్ హన్మంతరెడ్డికు తెలిపారు.

**జియో ట్యాగింగ్**

నేరేడుచర్ల పురపాలికగా మారక ముందు ఎక్కువ వెంచర్లు వెలిశాయి. కానీ అప్పుడు 10శాతం భూమి సేకరించలేదు. పురపాలికగా మారిన తర్వాత ఏర్పాటైన 10 వెంచర్లలో మాత్రమే 10 శాతం భూమి వసతుల కల్పన కోసం పురపాలికకు లభించింది. ఈ భూమి మొత్తం 5 ఎకరాల




12 గుంటలు. ఆ స్థలాలకు జియో ట్యాగింగ్ చేశామని, భూమిని వెంచర్లు పెట్టిన వారు తిరిగి తీసుకునే అవకాశం లేదని పుర కమిషనర్ ఎ.అశోక్‌రెడ్డి తెలిపారు. ఆ స్థలాలలో నర్సరీ, ప్రకృతి వనాలు, క్రీడాప్రాంగణం, తాగునీటి ట్యాంకులు నిర్మాణం వంటి అవసరాలకు వినియోగిస్తామన్నారు.

**చెట్లు తొలగించి.. చదును చేసి**

కోదాడ పట్టణంలోని నలుమూలలల పదుల సంఖ్యలో వెంచర్లు వెలిశాయి. నిబంధనల ప్రకారం పురపాలికకు అప్పజెప్పాల్సిన 10 శాతం భూమి ఆక్రమణకు గురవుతోంది. కొన్ని ప్రాంతాల్లో వెంచర్ నిర్వాహకులే కబ్జా చేస్తుండగా, మరికొన్ని ప్రాంతాల్లో పదిశాతం భూమి చుట్టూ ఉన్న ఇంటి యజమానులు తమ ఇంటి స్థలంలో కలిపేసుకుంటున్నారు.

ఈ చిత్రంలో చెట్లు తొలగించి, పొక్లెయిన్‌తో చదును చేసి కనిపిస్తున్న వెంచర్ పట్టణంలోని విజయవాడకు వెళ్లే రహదారి మార్గంలో ఉంది. పుర అధికారులు ఆ భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి మొక్కలు నాటారు. ఆ స్థలానికి ఆనుకొని ఖాళీ స్థలం యజమాని మొక్కలు తొలగించి ప్రభుత్వ భూమిని చదును చేసినా అధికారులు పట్టించుకోవట్లేదు.

# అక్రమాల తంతు.. ఎఫ్‌టీఎల్ వంతు

హైదరాబాద్: రావిర్యాల పెద్దచెరువు ఒకప్పుడు 1200 ఎకరాలుంటే ప్రస్తుతం 800 ఎకరాలకు కుంచించుకుపోయింది. ఇక్కడ భూముల విలువ భారీ స్థాయిలో ఉండటంతో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో వెంచర్లు వెలుస్తున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ శాఖల ఎన్‌వోసీతోనే తాము అనుమతులు ఇస్తున్నామని హెచ్ఎండీఏ పేర్కొంటోంది.

మూసీ పరిధిలో ఓ స్థిరాస్తి సంస్థ ఏకంగా బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తోంది. తాజాగా వరదలతో మూసీ వరదతో ఆక్రమణలు తేటతెల్లమయ్యాయి. ఈ భవన నిర్మాణానికి సైతం ఇరిగేషన్ ఎన్వోసీ ఇవ్వడంతోనే హెచ్ఎండీఏ అనుమతులిచ్చింది.

గండిపేట, మొయినాబాద్ ప్రాంతాల్లో ఏకంగా పదుల వెంచర్లు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. చాలావాటికి ఇరిగేషన్ శాఖ అనుమతులతోనే గతంలో హెచ్ఎండీఏ అనుమతులు జారీ చేసింది. శంషాబాద్, మేడ్చల్ ఇలా చాలా ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. హెచ్ఎండీఏ, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారుల మధ్య సమన్వయలేమి జలవనరులకు ముప్పుగా మారుతోంది. దరఖాస్తుల పరిశీలన నుంచి అనుమతుల వరకు అక్రమాల తంతు నడుస్తోంది. ముఖ్యంగా లెవల్–1 స్థాయిలో పరిశీలన సాగడం లేదు. ఏదైనా భవనం లేదా స్థిరాస్తి వెంచర్‌కు అనుమతులు ఇచ్చే ముందు చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఏవైనా జలవనరులుంటే రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల నుంచి ఎన్‌వోసీ జమ చేయాలి. ఆ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించాలి. వాళ్ల నివేదికను హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి లేదా ప్లానింగ్ అధికారి పరిశీలించి ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిలో లేకుంటే అనుమతులిస్తారు. క్షేత్రస్థాయిలో అలా లేదు. సర్వే నంబర్లు తప్పుగా చూపించడం లేదా బై నంబర్లు వేసి తిమ్మిని బమ్మి చేస్తున్నారనే విమర్శలున్నాయి.

**సవ్యంగా లేని లెవల్–1, 2**

భవన, లేఅవుట్ల అనుమతులకు బిల్డ్‌నౌలో దరఖాస్తు చేసుకున్న తర్వాత లెవల్–1లో హెచ్ఎండీఏ, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించి అంతా సవ్యంగా ఉంటే దరఖాస్తును లెవల్–2 పరిశీలనకు పంపిస్తారు. అనంతరం హెచ్ఎండీఏ ప్లానింగ్ అధికారి, డైరెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించి కమిషనర్ పరిశీలనకు పంపిస్తారు. అసలు చేయి తడిపితే తప్ప దరఖాస్తులు కదలడం లేదనే ఆరోపణలున్నాయి.

# పత్తిని ముంచిన ముసురు



సిరిసిల్ల : ఈ ఏడాది పత్తిపంట చేతికందే దశలో ముసురు వర్షాలు నిండా ముంచాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1.57 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. ఎకరాకు సగటున రూ.35 వేల నుంచి రూ.40 వేల పెట్టుబడి ఖర్చయింది.

**దిగుబడులపై ప్రభావం**

ఉమ్మడి జిల్లాలో ఎకరాకు సగటున 6 క్వింటాళ్ల దిగుబడి అంచనా. ప్రస్తుతం సగంకూడా వచ్చే పరిస్థితులు కనిపించడంలేదు. వాతావరణ అనుకూలిస్తే రెండు, మూడు విడతల్లో పత్తి తీసే అవకాశం ఉండేది. కాగా ఈ సారి పూర్తిగా దెబ్బతినడంతో ఒకటి, రెండు దఫాలకు మించి ఏరుకునే పరిస్థితులు కనిపించడంలేదని రైతులు చెబుతున్నారు. మరోవైపు గ్రామాల్లో ఇప్పటికే పత్తిని తీస్తున్నారు.

సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) పత్తి పింజపొడవును బట్టి గరిష్ఠంగా క్వింటాకు రూ.8,110 ధర నిర్ణయించింది. తేమ 8 శాతం మించి పెరిగితే మద్దతు ధరలో కోత విధిస్తారు. అదే 12 శాతానికిపైన ఉంటే తిరస్కరిస్తారు. మరోవైపు ఈ నెల 23 నుంచి కొనుగోళ్లకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో నష్టపోయిన వారిని ఆదుకునేలా ప్రభుత్వం కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

**పత్తి నల్లబారింది – కనవేణి లక్ష్మి, మహిళా రైతు, పెద్దూరు**

ఈ ఏడాది మూడు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. పెట్టుబడి ఖర్చు మొత్తం రూ.లక్ష అయింది. చేనులో ఏరిన పత్తిలో సగం నల్లబడింది. కాయలు సరిగా విచ్చుకోలేదు. పత్తిని ఆటోలో తీసుకుని వేములవాడ మిల్లులోని మిల్లుకు వెళ్లాలి. అక్కడ పత్తిని చూసి ఎంతచెబితే అంతకు విక్రయించాలి.

**తెగులుతో కాయలు రాలిపోయాయి – సలేంద్ర పెద్ద ఎల్లయ్య, రైతు**

రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. అధిక వర్షాలకు పత్తి పిందెలు రాలిపోయాయి. పంట మధ్యలో తెగులు సోకి కాయలు రాలిపోయాయి. సగం కూడా చేతికందే పరిస్థితులు కనిపించడం

# గొంతునొప్పి.. జలుబు.. జ్వరం



కరీంనగర్ : కరీంనగర్‌లోని గౌతమినగర్‌కు చెందిన రామచంద్రం మూడు రోజులుగా గొంతునొప్పి, జలుబు, జ్వరంతో బాధపడుతున్నారు. ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా నాలుగు రోజులు విశ్రాంతి తీసుకోవాలని, మందులు వాడాలని వైద్యులు సూచించారు.

మానకొండూర్ ప్రభుత్వ ఆసుపత్రికి బుధవారం 70 మందికిపైగా ఔట్‌పేషంట్లు వివిధ వ్యాధులతో చికిత్స పొందేందుకు వచ్చారు. వారిలో ఎక్కువగా జ్వర పీడితులే ఉన్నారు. వీరి రక్త నమూనాలు సేకరించి వ్యాధి నిర్ధారణ కోసం పంపించి నివేదికలు వచ్చిన తర్వాత వైరల్ జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి యాంటీబయాటిక్స్‌తోపాటు జ్వరం మాత్రలు ఇచ్చి పంపిస్తున్నారు.

ఒకేసారి దంచి కొడుతున్న ఎండ.. అంతలోనే మబ్బులుపట్టి వర్షాలు కురవడం.. రాత్రివేళ చల్లగా, మధ్యాహ్నం ఉక్కపోత ఇలా.. వాతావరణంలో ఒక్కసారిగా వస్తున్న మార్పులతో కాలానుగుణ వ్యాధులు ముసురుకుంటున్నాయి. గత నెలాఖరు నుంచి ఇప్పటి వరకు చాలా మంది గొంతునొప్పి, జ్వరం, దగ్గుతో బాధపడుతున్నారు. సాధారణ, వైరల్ జ్వరాలు విపరీతంగా పెరిగాయి. ఒక్కసారిగా వ్యాధులు పెరగడంతో ప్రైవేటు ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి.

**ఓపీ పెరుగుతుండగా..**

జిల్లా కేంద్ర ఆసుపత్రిలో ప్రతి రోజు 800 మందికిపైగా అవుట్ పేషంట్లు వచ్చి చికిత్స పొందుతున్నారు. వీరిలో జ్వరం, గొంతు, జలుబు, ఒళ్లు నొప్పులు, దగ్గుతో బాధపడుతున్న వారి క్రమంగా పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాల్లోనూ అవుట్ పేషంట్ల సంఖ్య పెరిగింది. కొందరు ప్రభుత్వాసుపత్రులకు వెళ్లకుండా ప్రైవేటు ఫిజీషియన్ల దగ్గరికి వెళ్లి చికిత్స చేయించుకుంటున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరిని ఈ వ్యాధులు చుట్టుముడుతున్నాయి.

**వారం రోజులుగా..– బాకారపు సంపత్, శంషాబాద్**

జలుబు, దగ్గు, గొంతు నొప్పి, జ్వరంతో బాధపడుతున్నా. మందులు వాడుతున్నప్పటికీ వారం రోజులుగా జ్వరం తగ్గలేదు. తిరిగి మానకొండూర్ ఆసుపత్రికి వచ్చా. వైద్యులు మళ్లీ మందులు రాసి ఇచ్చారు.

**వాతావరణ మార్పులతో..– వెంకటరమణ, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి**

జలుబు, గొంతు నొప్పి, జ్వరం, దగ్గుతో బాధపడుతున్న వారి సంఖ్య పెరిగిన మాట వాస్తవమే. వాతావరణ మార్పులతో జలుబు, జ్వరాలు వస్తున్నాయి. గొంతునొప్పి వైరల్‌కు ఫీవర్‌కు కారణం. సమీప ఆసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకోవాలి. విశ్రాంతి అవసరముంటుంది. ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరత లేదు. వెల్‌నెస్ సెంటర్‌లో జ్వర మాత్రలు, యాంటీబయాటిక్స్ లేవనే విషయం మా దృష్టికి వచ్చింది. సంబంధిత వైద్యాధికారితో మాట్లాడి మందుల కొరత లేకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

# తొలి విడతకు వేళాయె!

నల్గొండ : స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై ఉత్కంఠ ఇంక వీడలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు గురువారానికి వాయిదా వేసింది. తీర్పు అనుకూలంగా వస్తుందనే భావనతో ఎన్నికల సంగ్రామానికి శ్రీకారం చుట్టారు. ప్రాదేశిక ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్ల ప్రక్రియకు ప్రభుత్వ యంత్రాంగం జిల్లాలో నల్గొండ, దేవరకొండ డివిజన్ల పరిధిలో అన్నిరకాల ఏర్పాట్లు చేసింది. నోటిఫికేషన్ గురువారం విడుదల చేయనున్నట్లు ఎన్నికల కమిషన్ ప్రకటించింది.

జిల్లాలో రెండు విడతల్లో ప్రాదేశిక ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడతలో నల్గొండ, దేవరకొండ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 18 జడ్పీటీసీలు, 197 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. జడ్పీటీసీ స్థానాలకు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం, మూడు, నాలుగు ఎంపీటీసీ స్థానాలకు ఒక క్లస్టర్ ఏర్పాటు చేశారు. వాటికి అక్కడే నామినేషన్ల ప్రక్రియ జరగనుంది. నామపత్రాలు స్వీకరణకు ఆర్వో, ఏఆర్వోలను నియమించి శిక్షణ పూర్తి చేశారు. షెడ్యూల్ ప్రకారం గురువారం నామపత్రాలు స్వీకరించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. కలెక్టర్ ఇలా త్రిపాఠి నామినేషన్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. పోలీసు




యంత్రాంగం భద్రతా చర్యలు చేపట్టింది.

నేటి నుంచి నామపత్రాల స్వీకరణ

నల్గొండ కలెక్టరేట్ : నల్గొండ, దేవరకొండ డివిజన్లలో గురువారం నుంచి జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాలకు నామపత్రాలను స్వీకరిస్తారని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఇలా త్రిపాఠి తెలిపారు. మొదటి విడతగా 18 జడ్పీటీసీ, 197 ఎంపీటీసీ స్థానాలకు ఈ నెల 11 వరకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు నామపత్రాలను స్వీకరిస్తారని వివరించారు. ఎన్నికల ఫిర్యాదులు, సూచనల కోసం అన్ని ఎంపీడీవో కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

# ఉచితం ముసుగు.. అక్రమాల కలుగు

భువనగిరి: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మాత్రమే ఇసుక వినియోగించాలన్నది జిల్లా యంత్రాంగం ఆదేశాలు. అయితే ట్రాక్టర్ యజమానులు అక్రమాలకు తెరలేపి ఇందిరమ్మ ఇళ్లపేరు చెప్పి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. నిఘా ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నా ఎక్కడా అమలు కావడం లేదు. జిల్లాలోని పరిస్థితిపై పరిశీలన చేయగా పలు అంశాలు వెలుగులోకి వచ్చాయి.

ఆలేరు, గొలనుకొండ, అమ్మనబోలు, ఇక్కుర్తి వాగుల నుంచి జనగామ, లింగాల ఘణపురం, బచ్చన్నపేట మండలాలకు రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.5 వేల నుంచి రూ.7 వేలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

ఆత్మకూరు(ఎం) మండలంలో ఇందిరమ్మ ఇళ్ల అనుమతులతో దళారులు మండలంలోని కూరెళ్ల శివారులో డంపు చేసి గత నెల 20న అర్ధరాత్రి లారీలో లోడ్ చేసి హైదరాబాద్‌కు తరలిస్తుండగా డంప్ సమీపంలోనే లారీ చెడిపోయి రహదారిపైనే నిలిచిపోయింది. స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. అక్రమంగా తరలిస్తున్న వారికి రూ.25వేల జరిమానా వేశారు.

రాజపేట మండలం దూదివెంకటాపురం, ధర్మారెడ్డిగూడెం, బేగంపేట, రఘునాథపురం, నెమిల గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల పేరుతో విచ్చలవిడిగా ఇసుక రవాణా జరుగుతోంది. అక్రమార్కులు ఇసుకను తరలించే ట్రాక్టర్లకు నెంబర్లు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. రెవెన్యూ, పోలీసు



యంత్రాంగం నిఘా పెట్టినా వారి కళ్లుగప్పి అక్రమ దందా కొనసాగిస్తున్నారు. ఇటీవల ధర్మారెడ్డిగూడెంలో ఎనిమిది ట్రాక్టర్లను పట్టుకుని కేసులు నమోదు చేశారు.

మోత్కూరు మండలంలోని పాలడుగు, పొడిచేడు, కొండగడప, పాటిమట్ల, దాచారం, దత్తప్పగూడెం గ్రామాలలో ఇసుక దందా సాగుతోంది. తహసీల్దారు నుంచి ఇందిరమ్మ ఇళ్లకు అనుమతులు పొంది అధిక ట్రిప్పుల ఇసుకను చేరవేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పాలడుగు గ్రామ ఇందిరమ్మ లబ్ధిదారుడు ఆరోపించారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కొండగడప గ్రామంలో ఇసుకను తరలించేందుకు ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల వారి మధ్యన వివాదాలు తలెత్తి తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి స్వయంగా గ్రామానికి వచ్చి సమస్య పరిష్కరించారు.

**ప్రత్యేక తనిఖీ బృందాలను ఏర్పాటు చేస్తాం : ఎం.హనుమంతరావు, కలెక్టర్** ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వాగుల నుంచి అక్రమంగా తరలించినా క్రిమినల్ కేసులు పెడతాం. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెంచుతాం. సరిహద్దులో చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తాం. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ శాఖ, తదితర శాఖ సిబ్బందితో ప్రత్యేక బృందాలను నియమిస్తాం.

# భాషకు వెలుగు.. ప్రతిభకు నెలవు

రాజపేట: సర్కారు బడుల్లోని విద్యార్థులకు తెలుగు భాషపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు తెలంగాణలోని కవుల జీవిత చరిత్రలపై అవగాహన కల్పించి ప్రోత్సహించేందుకు రాష్ట్ర భాషోపా ధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ) ఏటా వ్యాసరచన పోటీలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం 6–10 చదివే వారు ఈ ప్రతిభా పోటీలకు అర్హులు. ప్రతి పాఠశాల నుంచి ఒక విద్యార్థి, విద్యార్థినిని ఎంపిక చేసి వారు రాసిన వ్యాసాల ప్రతులను జిల్లాస్థాయి పోటీలకు పంపుతారు. జిల్లా స్థాయికి వచ్చిన వ్యాసాల్లో ప్రత్యక్ష పోటీకి 50 మందిని ఎంపిక చేస్తారు. ప్రతి జిల్లా నుంచి ఎంపిక చేసిన ఐదు వ్యాసాలను రాష్ట్ర స్థాయికి పంపిస్తారు. అక్కడ ఉత్తమంగా అనిపించిన వాటిని ఎంపిక చేసి నగదుతో పాటు ప్రత్యేక సమావేశంలో ప్రముఖులతో అభినందన కార్యక్రమం చేపట్టనున్నారు.

**పదకొండు మంది కవులపై..**

రాష్ట్రస్థాయిలో నిర్వహించే వ్యాసరచన పోటీల్లో ముఖ్యంగా బమ్మెర పోతన, దాశరథి కృష్ణమాచార్య, కాళోజీ నారాయణరావు, సి.నారాయణరెడ్డి, సుద్దాల హనుమంతు, వట్టికోట ఆళ్వారుస్వామి, వానమామలై వరదాచార్యులు, సురవరం ప్రతాపరెడ్డి, సామల సదాశివ, బోయ జంగయ్య, పాకాల యశోదరెడ్డి గురించిన అంశాలు ఉండనున్నట్లుగా నిర్వాహకులు పేర్కొంటున్నారు.

**విజేతలకు ప్రోత్సాహకాలు**

రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో గెలుపొందిన విద్యార్థులకు నిబంధనల మేరకు రూ.లక్ష



వరకు పంపిణీ చేయనున్నారు. పాఠశాల స్థాయిలో రాసిన వ్యాసాల్లో ఎంపిక చేసిన రెండు ఉత్తమమైన వాటిని ఈ నెల 15 వరకు జిల్లా కన్వీనర్లకు పంపించాల్సి ఉంటుంది. ఈ విషయమై జిల్లాలోని ఆయా పాఠశాలల్లో ఔత్సాహికులైన విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగింది. నవంబరు మొదటి వారంలో జిల్లా స్థాయిలో ప్రత్యక్ష పోటీ నిర్వహిస్తారు. రాష్ట్రస్థాయి కమిటీ వాటిని పరిశీలించి విజేతలను ఎంపిక చేయనుంది. ఎన్నికల క్రతువు నేపథ్యంలో రాష్ట్ర సంస్థ సూచనల మేరకు వీటి నిర్వహణ తేదీల్లో మార్పులుండే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది.

**విద్యార్థులకు ఉపయుక్తంగా..: కె.భాగ్యలక్ష్మి, సంస్థ జిల్లా కన్వీనర్**

విద్యార్థి దశలో తెలుగు భాష గొప్పతనాన్ని, కవుల ఔన్నత్యాన్ని తెలియజెప్పే ప్రయత్నంలో భాగంగానే రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ గత కొంతకాలంగా ఈ పోటీలు నిర్వహిస్తోంది. విద్యార్థులు సద్వినియోగ పరచుకుంటే ప్రయోజనకరంగా ఉంటుంది.

**జిల్లా సమాచారం..**

ప్రాథమికోన్నత పాఠశాలలు : 68

ఉన్నత పాఠశాలలు : 171

విద్యార్థుల సంఖ్య : 21,263

## విజృంభిస్తున్న దోమలు.. వణికిస్తున్న జ్వరాలు

సిరిసిల్ల: జిల్లాలో డెంగీ జ్వరాలు పెరుగుతున్నాయి. జూన్, జులై, ఆగస్టు, సెప్టెంబరులలో ఇప్పటి వరకు 100 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఇందులో జులై, ఆగస్టు మాసాల్లో ఎక్కువగా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా సరిహద్దు గ్రామాలు, తండాలోని అక్కడి వైద్యులు జీజీహెచ్‌కు రిఫర్ చేయడంతో ఇక్కడ కేసులు ఎక్కువగా రికార్డు అవుతున్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

**ప్రత్యేక శ్రద్ధ అవసరం**

జిల్లా జనరల్ ఆసుపత్రిలో సాధారణ రోజుల్లో సగటున 600 ఉండే ఓపీ రెండు నెలలుగా 1100లకు చేరుతోంది. వాతావరణ పరిస్థితుల్లో మార్పులు.. దోమల పెరుగుదల, పారిశుద్ధ్యలోపం, ఇంటి పరిసరాలను సకాలంలో శుభ్రం చేయకపోవడంతో నీటినిల్వలు, చెత్త పేరుకుపోవడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమల నివారణకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదు. మండల పరిషత్తుల్లో చాలాచోట్ల ఫాగింగ్ యంత్రాలు ఉన్నా వాటి నిర్వహణ భారంగా మారడంతో ఉన్నవాటిని సైతం వినియోగించడం లేదు. ప్రత్యామ్నాయంగా దోమల వృద్ధిని నివారించేందుకు చేపట్టాల్సిన పారిశుద్ధ్య కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు.

**నిర్లక్ష్యం వద్దు**

తొలుత సాధారణ జ్వరంగా కనిపించినా రెండు రోజుల తర్వాత డెంగీ లక్షణాలు కనిపిస్తాయి. జ్వరం, తలనొప్పి ఇతర ఏ లక్షణాలు కనిపించినా వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేయవద్దు, జ్వరం, తలనొప్పి, ఇతర ఏ లక్షణాలున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలి. జీజీహెచ్‌లో డెంగీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయితే సకాలంలో వైద్యం అందుతుంది.



**వైద్యుల కొరత**

జిల్లా జనరల్ ఆసుపత్రిలో వైద్యుల కొరత వేధిస్తోంది. ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, సాధారణ శస్త్రచికిత్సల విభాగంలో నిత్యం రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అన్ని విభాగాల్లో కలిసి 90 మంది వైద్యులు ఉండాల్సింది 63 మంది ఉన్నారు. ఇటు వైద్య కళాశాలలోనూ 118 మంది ప్రొఫెసర్లకు 44 మంది మాత్రమే ఉన్నారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే ఆసుపత్రిలో చికిత్సలు అందిస్తున్నారు. వైద్యుల నియామకాలపై ఉన్నతాధికారుల దృష్టిలో ఉన్నట్లు జిల్లా ఆసుపత్రి, వైద్యకళాశాల అధికారులు తెలిపారు.

**వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం – రజిత, డీఎంహెచ్‌వో**

ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహిస్తున్నాం. నీటి నిల్వలున్న చోట దోమ లార్వాలు నాశనం చేయడానికి ఆయిల్ బాల్స్, ఇంజిన్ ఆయిల్ లాంటివి పోసేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇంటింటి సర్వే నిర్వహించి, జ్వర కేసులు ఎక్కువగా నమోదవుతున్న చోట అక్కడికక్కడే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. జిల్లా ఆసుపత్రిలో జ్వరాల కోసం ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి మెరుగైన చికిత్సలు అందిస్తున్నాం.

## ఎన్నాళ్లో కష్టనష్టాలు

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో 1521 కిలోమీటర్ల మేర పంచాయతీరాజ్ రోడ్లు విస్తరించి ఉండగా అందులో ప్రధాన సీసీ రోడ్లు 138 కి.మీ., బీటీ రోడ్లు 576 కి.మీ., మెటల్ రోడ్లు 57 కి.మీ., మట్టిరోడ్లు 750 కి.మీ. ఉన్నాయి. 21 పెద్ద బ్రిడ్జిలు, 59 కాజ్‌వేలు పీఆర్ రహదారుల్లో భాగమే. జిల్లాలో 600.627 కిలోమీటర్ల రోడ్లు భవనాలశాఖ రోడ్లున్నాయి. అందులో 57 వారధులు, 1300 కల్వర్టులు, 71 కాజ్‌వేలున్నాయి. అయితే ప్రస్తుతం ఉన్న లో- లెవల్ కల్వర్టులు, కాజ్‌వేలతో ప్రజలు, ప్రయాణికులకు ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వర్షాలకు వరదనీరు ఈ కల్వర్టులపై నుంచి పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. మరికొన్ని గ్రామాలకు రవాణా సంబంధాలు పూర్తిగా తెగిపోతున్నాయి. వర్షాకాలమొస్తే వణుకే అన్న చందంగా మారింది పల్లెవాసుల పరిస్థితి.

ఎగువ మానేరు ఉప్పొంగినప్పుడల్లా గంభీరావుపేట – లింగన్నపేట మధ్య లో లెవల్ కల్వర్టు పూర్తిగా నీట మునిగిపోతోంది. బ్రిడ్జి నిర్మాణానికి రూ.17 కోట్లు మంజూరయ్యాయి. లో లెవల్ కల్వర్టును పూర్తిగా తొలగించి, 2023 సెప్టెంబరులో వారధి పనులు ప్రారంభించారు. సిమెంటు పైపులు వేసి, తాత్కాలిక రోడ్డు వేశారు. ఇటీవల ఎగువమానేరు వరద ఉద్ధృతికి తాత్కాలిక రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. 9 పిల్లర్లతో చేపట్టిన బ్రిడ్జి నిర్మాణంలో కేవలం ఏడు పిల్లర్లను మాత్రమే నిర్మించారు. పనులు నత్తనడకన సాగుతుండడం తీవ్ర ఇబ్బందిగా మారుతోంది.

కల్వర్టులను విస్తరించడం, వాటిని బాగుచేయడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కల్వర్టుల విస్తరణకు ఏళ్లుగా ఎదురు చూస్తున్నా పరిష్కారం కావడం లేదు. తక్కువ ఎత్తుతో ఉన్న కల్వర్టులు, రోడ్ డ్యాంలపై వరద నీటి ప్రవాహానికి వాహన రాకపోకలు పూర్తిగా స్తంభించిపోతుండడంతో మారుమూల గ్రామాల ప్రజలు వర్షాకాలంలో వనవాసం చేయాల్సిన దుస్థితి తలెత్తుతోంది.

చందుర్తి నుంచి కమ్మర్‌పేటలో మత్తడి ప్రమాదకరంగా మారింది. విలాసాగర్- కొదురుపాక గ్రామాల నడుమ, బోయినపల్లి- మర్తనపేట గ్రామాల మధ్య వారధుల నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. వేములవాడ- స్తంభంపల్లి నడుమ, వీర్నపల్లి మండలం అడవిపదిర వద్ద బ్రిడ్జిల పనులు నత్తనడకన సాగుతున్నాయి. అవసరమైన ప్రదేశాల్లో వారధులు నిర్మిస్తే ప్రజల సమస్యకు పరిష్కారం లభించనుంది.

కాజ్‌వేలు, లో లెవల్ కల్వర్టుల వద్ద ఇబ్బందులను గుర్తించామని నిధులు మంజూరుకాగానే నిర్మాణాలు ప్రారంభిస్తామని పంచాయతీ రాజ్ ఈఈ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. రోడ్లు భవనాలశాఖ ఈఈ నర్సింహాచారి మాట్లాడుతూ గంభీరావుపేట- లింగన్నపేట మధ్య వంతెన పనులను వర్షాలు తగ్గిన తర్వాత వేగవంతం చేస్తామన్నారు. గంభీరావుపేట మండలం పెద్దమ్మ స్టేజీ నుంచి ఎగువమానేరు వద్ద బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. డిజైన్‌లో భాగంగా స్థలాన్ని సేకరించాల్సి ఉందని ఆర్ అండ్ బి ఈఈ నర్సింహాచారి పేర్కొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, ముస్తాబాద్ మండలం రామలక్ష్మణపల్లె గ్రామాల నడుమ ఉన్న కాజ్‌వే ఇదీ. ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాలను తక్కువ దూరంలో కలిపేందుకు ఈ రోడ్డు ప్రధానంగా ఉండేది. కొద్దిరోజుల క్రితం ఎగువమానేరు వరదనీటి తాకిడికి కాజ్‌వే పూర్తిగా ధ్వంసమైంది. ఇప్పుడు ఎల్లారెడ్డిపేట నుంచి ముస్తాబాద్‌కు వెళ్లాలంటే వెంకటాపూర్, బండలింగంపల్లి మీదుగా వెళ్లాల్సి వస్తోంది. దీంతో ప్రయాణికులపై దూరభారం పడుతోంది. శాశ్వత బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలనే యోచన ప్రతిపాదనలకే పరిమితమవుతోంది.

# అక్రమ 'అంతస్తులు'



కరీంనగర్ : నగరంలోని ఓ ప్రాంతంలో జీ౦2 భవన నిర్మాణానికి అనుమతి తీసుకున్నారు. ఆ తర్వాత అదనంగా మూడు, నాలుగు, అయిదు అంతస్తులను అక్రమంగా నిర్మించారు. దీనిని గుర్తించిన పట్టణ ప్రణాళిక అధికారులు భవనానికి నోటీసు అంటించి సీజ్ చేశారు. మరో డివిజన్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా రెండు అంతస్తులు నిర్మించారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోలేదు. కోర్టు ఆదేశాల మేరకు ఆ నిర్మాణాన్ని కూల్చివేశారు. జిల్లాలోని పుర, నగరపాలికల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. భవన నిర్మాణాల అనుమతులకు ప్రభుత్వం సులువైన మార్గాలు అమలు చేస్తోంది. పట్టణ ప్రణాళిక అధికారులు వీటిపై అవగాహన కల్పించకపోవడంతో అడ్డదారులను ఆశ్రయిస్తున్నారు. దీనికితోడు క్షేత్రస్థాయి ఉద్యోగులు సైతం జత కట్టడంతో అనధికారిక నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది.

**అనుమతులకు విరుద్ధంగా నిర్మాణాలు**

జిల్లా కేంద్రంలోని నగరపాలక సంస్థ పరిధిలో భవన నిర్మాణాలు అనుమతులకు విరుద్ధంగా నిర్మించుకుంటున్నారు. జీ౦2 అనుమతి తీసుకొని జీ౦3, 4, 5 వరకు నిర్మించుకునే వారి సంఖ్య పెరిగింది. ఆ లెక్కన అనుమతి తీసుకుంటే ఫీజు రూపంలో బల్దియాకు రూ.వేలల్లో ఆదాయం వస్తోంది. ఆ మొత్తాన్ని చెల్లించకుండా అనుమతులు ఒకరకంగా, నిర్మాణాలు మరోరకంగా చేపడుతున్నారు. మూడేళ్లుగా పరిశీలిస్తే ఇలాంటి నిర్మాణాలు వందల్లో ఉంటాయని చెబుతున్నారు.

**అటకెక్కిన నిబంధనలు..**

భవన నిర్మాణ సమయంలో స్థల విస్తీర్ణం బట్టి అంతస్తులకు అనుమతి ఇవ్వాలి. కానీ ఇటీవల చిన్న, చిన్న వీధుల్లో కూడా బహుళ అంతస్తులు నిర్మిస్తున్నారు.

భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని లోపలికి జరిగి ఇళ్ల నిర్మాణం చేసుకోవాల్సి ఉండగా సెట్‌బ్యాక్ అనేదే మరిచిపోయారు. ప్లాట్ ఏరియాను బట్టి 200 మీటర్లలోపు అయితే రోడ్డు వైపు అయిదు ఫీట్లు, మిగతా మూడు వైపులా 3.5 ఫీట్లు వెనక్కి జరిగి శ్లాబు వేసుకోవాల్సి ఉండగా ఎవరూ పాటించడం లేదు.

20 అడుగుల రోడ్డు ఉంటే కచ్చితంగా నగరపాలక సంస్థకు 5 ఫీట్లు గిఫ్టు చేయాల్సి వస్తుందనే కారణంతో కొందరు అనుమతులే తీసుకోవడం లేదు.

సెట్‌బ్యాక్ స్థలంలో శ్లాబు, ప్రహరీలు, సెప్టిక్‌ట్యాంకు, బోర్‌వెల్ ఉండకూడదు. ఎక్కడ చూసినా ఇవన్నీ ఆ స్థలంలోనే ఉంటున్నాయి. నగర, పట్టణాల్లో అనధికారిక, సెట్‌బ్యాక్ లేకుండా, చెరువు కట్టలు, ప్రభుత్వ స్థలాలకు అనుకొని నిర్మాణాలు పెరిగిపోతున్నాయి.

**నోటీసులు జారీ చేశాం**

నగరంలో అనుమతులకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలు 53 ఉన్నట్లు గుర్తించాం. వీటన్నింటికి నోటీసులు జారీ చేశాం. రెండు నెలల సమయం ఇచ్చాం. తర్వాత వాటన్నింటిపై చర్యలు తీసుకుంటాం.
– బషీర్, డీసీపీ, కరీంనగర్ నగరపాలిక

## ఆదాయ లక్ష్యం వైపు అడుగులు



హుజూరాబాద్ : ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ మార్కెటింగ్ శాఖ నిర్దేశిత ఆదాయ లక్ష్యం అధిగమించేలా అధికారులు దృష్టి సారించారు. గతేడాది రూ.69.83 కోట్ల ఆదాయ లక్ష్యానికి.. రూ.73.52 కోట్లు సమకూరింది. ఈసారి రూ.90.22 కోట్లుగా అంచనా వేశారు. ఇందుకనుగుణంగా జిల్లాల వారీగా ఆయా మార్కెట్లలో జరిగే పంట ఉత్పత్తుల విక్రయాలతో వచ్చే మార్కెట్ ఫీజు, గిడ్డంగులు, దుకాణ సముదాయాల అద్దె, చెక్‌పోస్టులు తదితర ఆదాయాలపై అవసరమైన కసరత్తు చేస్తున్నారు.

**రూ.90.22 కోట్లుగా నిర్ణయం**

ఉమ్మడి జిల్లాలోని 39 మార్కెట్ల ద్వారా రూ.90.22 కోట్ల ఆదాయమే లక్ష్యంగా పెట్టుకోగా.. గడిచిన ఐదేళ్లలో రూ.14.18 కోట్ల మేర ఆదాయం సమకూరింది. ప్రభుత్వ రంగ సంస్థలు, ఇతర కలిపి మరో రూ.28.31కోట్లు జమకావాలి. మొత్తంగా రూ.42.49 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 47 శాతం ఆదాయం సాధించినట్లు అధికారులు తెలిపారు. వానాకాలం సీజన్ పత్తి, ధాన్యం, ఇతర వ్యవసాయోత్పత్తులు అధికంగా మార్కెట్లకు వచ్చే అవకాశం ఉండటంతో లక్ష్యం అధిగమిస్తామంటున్నారు.

**గతేడాది**

2024-25 ఆర్థిక సంవత్సరంలో కరీంనగర్ జిల్లాలో 8 వ్యవసాయ మార్కెట్ల ఆదాయ లక్ష్యం రూ.24.27 కోట్లు కాగా.. రూ.25.23 కోట్లు సాధించాయి. జగిత్యాలలో 13 మార్కెట్లకు రూ.21.19 కోట్లకు.. రూ.21.22 కోట్లు వచ్చింది. పెద్దపల్లి జిల్లాలో 8 మార్కెట్లకు రూ.14.05 కోట్లు నిర్ణయించగా రూ.12.64 కోట్లకు పరిమితమైంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 10 మార్కెట్ల ఆదాయ లక్ష్యం రూ.10.32 కోట్లు అధిగమించి రూ.14.48 కోట్లు సాధించింది.

**చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం**

యాసంగిలో ఆదాయం తగ్గినా వానాకాలం సీజన్ పత్తి, ధాన్యం, ఇతర పంట ఉత్పత్తులు క్రయవిక్రయానికి వచ్చే అవకాశముండటంతో మార్కెట్ ఆదాయం పెరిగే అవకాశం ఉంది. మార్కెట్ ఫీజు వసూళ్లతో పాటు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించాం. ప్రైవేటు వ్యాపారుల క్రయ, విక్రయాలను దగ్గరుండి పరిశీలించాలని మార్కెట్ అధికారులకు సూచించాం. గిడ్డంగులు, దుకాణ సముదాయాల అద్దె బకాయిలు లేకుండా వసూలు చేయాలని చెప్పాం. – ఉప్పుల శ్రీనివాస్, ఆర్‌జేడీఎం, వరంగల్

## అడుగు ముందుకు..రెండడుగులు వెనక్కి



జగిత్యాల: జగిత్యాల-కరీంనగర్ జాతీయ రహదారి నిర్మాణం తీరు ఒక అడుగు ముందుకు.. రెండడుగులు వెనక్కి అనే రీతిలో సాగుతోంది. భారత్ మాల పరియోజనలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఈ రోడ్డును జాతీయ రహదారి 563గా గుర్తించి.. గతంలో రూ.1503 కోట్లు మంజూరు చేసింది. భూసేకరణలో జాప్యం, రహదారి పరిధి గ్రామాల్లో వివాదం తదితర కారణాలతో ఆరేళ్ల క్రితమే అర్ధాంతరంగా నిలిపివేశారు. తిరిగి అంచనాలు పెంచి సుమారు రూ.2223 కోట్లతో రహదారి విస్తరించాలని నాలుగేళ్ల క్రితమే భావించినప్పటికి భూసేకరణ అంశం కొలిక్కి రావడంలేదు.

**జిల్లాకు రూ.124 కోట్ల పరిహారం**

58.6 కిలోమీటర్ల రహదారి విస్తరణకు 245.94 హెక్టార్ల భూమి సేకరించాలని నిర్ణయించారు. ఇందులో 157 హెక్టార్లు జగిత్యాల.. మిగతాది కరీంనగర్ జిల్లాలో సేకరించేందుకు గతంలో నోటిఫికేషన్ జారీ చేశారు. జిల్లాలో భూములు సేకరించి అవార్డు పాస్ చేసి మూడేళ్లు దాటినా జాతీయ రహదారి భవనాలశాఖ కొర్రీలతో కాలం వెల్లదిస్తోంది. జిల్లాలో సేకరించిన భూమికి రూ.124 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉండగా.. కేవలం జగిత్యాల, చల్‌గల్, రాజారం, నూకపల్లి, నాచుపల్లి, గౌరాపూర్ గ్రామాల్లోని కొద్ది మంది భూనిర్వాసితులకు రూ.4 కోట్లు పరిహారం చెల్లించి చేతులు దులుపుకున్నారు.

**పట్టించుకోని ప్రజాప్రతినిధులు** పలు గ్రామాలకు చెందిన భూసేకరణ ఫైళ్లను జాతీయ రహదారి భవనాల ప్రాజెక్టు కార్యాలయం నుంచి ఏదో కారణం చూపుతూ జగిత్యాల ఆర్డీవో కార్యాలయానికి తిప్పి పంపిస్తున్నారు. దీంతో భూములు కోల్పోతున్న రైతులు పరిహారంరాక అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీంతో అధికారులపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కార్యాలయంలో ఉన్న పలువురు సిబ్బంది సైతం ఒప్పంద పద్ధతిలో పని చేస్తుండడంతో పట్టనట్లు భావిస్తున్నారు. అత్యంత రద్దీగా ఈ రహదారి నిర్మాణం ప్రాధాన్యత సంతరించుకున్నప్పటికి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వెంటనే పనుల్లో చొరవ చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

## ఇందిరమ్మ ఇళ్లు.. అక్రమ వసూళ్లు

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కోరుట్ల పట్టణంలో మొత్తం 502 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 324 నిర్మాణాలకు సంబంధిత అధికారులు మార్కింగ్ ఇచ్చారు. నిర్మాణాలు వేగంగా చేపట్టేందుకు 33 వార్డులకు అధికారులకు బాధ్యతలు అప్పగించారు. మరోవైపు పలువురు లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం విడతల వారీగా నగదు జమ చేస్తుంది.

**ఓ లబ్ధిదారుడి వద్ద రూ.15 వేలు..**

మూడు రోజుల క్రితం పట్టణంలోని 21వ వార్డులో ఓ లబ్ధిదారు ఖాతాలో నగదు జమ కావడంతో.. వారి వద్ద నుంచి వార్డు అధికారి రూ.15 వేలు వసూలు చేశాడు. ఈ విషయం బయటకు తెలియడంతో సదరు వార్డు అధికారి వెంటనే ఆ నగదును లబ్ధిదారుకు తిరిగిచ్చాడు. మున్సిపల్ అధికారులు వెంటనే దానిపై విచారణ చేపట్టారు. సదరు



వార్డు అధికారి నగదు తీసుకున్న విషయం నిజమేనని.. అయితే ఆ మొత్తం చేబదులుగా తీసుకున్నానని చెప్పాడని తెలిసింది. దీనిపై కమిషనర్ రవీందర్‌ను వివరణ కోరగా.. వార్డు అధికారికి షోకాజు నోటీసులు జారీ చేసి విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని.. వారి ఆదేశాల మేరకు చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

**మరికొన్ని సంఘటనలు**

కోరుట్ల మండలంలోని ఓ గ్రామంలో ఇళ్ల లబ్ధిదారుల వద్ద నుంచి రూ.10 వేలను రాజకీయ నాయకులు వసూలు చేసినట్లు తెలిసింది. కొన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు ఇంటి నిర్మాణం కోసం మేస్త్రీలతో బేరం కుదుర్చుకొని వారి వద్ద నుంచి కమిషన్ వసూలు చేస్తున్నారని సమాచారం.

**ఇసుక, మట్టి పేరిట..**

నియోజకవర్గంలో ఇళ్ల నిర్మాణాలకు ఉపయోగించే ఇసుక, మట్టి సరఫరా పేరిట అక్రమ వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇసుకను ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వాగుల్లో విచ్చలవిడిగా జేసీబీలను, కూలీలను ఏర్పాటు చేయించి మరి తవ్వి తరలిస్తున్నారు. లబ్ధిదారులు గుర్తించిన ఇసుక రీచ్‌లకు వెళ్లి తెచ్చుకునే వీలు లేకపోవడంతో వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరోవైపు అక్రమార్కులు గుట్టలను తవ్వి మట్టిని నిర్మాణాలకు తరలిస్తున్నారు. ఒక్కో మట్టి ట్రిప్పుకు రూ.1200-1500 వరకు లబ్ధిదారుల వద్ద నుంచి దండుకుంటున్నారు. రెవెన్యూ, మైనింగ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

## పరి'శ్రమ'కు ప్రోత్సాహం

ఖమ్మం : ఉత్పాదక రంగంలో పరిశ్రమలను ప్రోత్సహించటంతోపాటు ఉద్యోగ కల్పనను పెంచేందుకు కేంద్రం తీసుకొచ్చిన నూతన పథకమే 'ప్రధానమంత్రి వికసిత్ భారత్ ఉద్యోగ యోజన'. ఈ కార్యక్రమంపై ఉభయ జిల్లాల్లోని పరిశ్రమ నిర్వాహకుల్లో తగిన అవగాహన లేదు. ఈ ఏడాది ఆగస్టు నుంచి జులై 31, 2027 మధ్య కాలంలో పరిశ్రమల్లో కొలువులు పొందినవారికి, కొలువులు ఇచ్చిన పరిశ్రమలకు పథకం వర్తిస్తుంది.

**ఇదీ ఉద్దేశం..**

ఉపాధి అవకాశాల పెంపు, సంస్థల సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడం, అన్ని రంగాల్లో సామాజిక భద్రతపై భరోసా కల్పించడం.. దేశవ్యాప్తంగా 1.96 కోట్ల మందికి ప్రయోజనం సమకూర్చాలని భవిష్య నిధి నిర్ణయించింది.

**యాజమాన్యాల అర్హతలు, ప్రయోజనం**

50 మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు (కొత్తవైనా, పాతవైనా) 2025 ఆగస్టు, 2027 జులై 31 మధ్య కనీసం ఇద్దరు ఉద్యోగులను నియమించుకోవాలి. 50 మందికి మించి సిబ్బంది ఉంటే కనీసం అయిదుగురికి కొలువులివ్వాలి.

భవిష్య నిధి సేవలను సంస్థపరంగా విధిగా కొనసాగిస్తుండాలి.

సంస్థలకు ప్రోత్సాహకంగా నెలకు రూ.మూడు వేల చొప్పున రెండేళ్లు, తయారీ సంస్థలైతే నాలుగేళ్లపాటు ఇస్తారు.



యజమానులు తమ ఎంప్లాయర్ పోర్టల్‌లో పీఎంవీబీఆర్కే లింక్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలి.

**ఉద్యోగులకు లబ్ధి ఇలా..**

నిర్దుష్ట కాలంలో నియమితులైన ఉద్యోగులకు వార్షిక వేతనంలో నెల జీతం(గరిష్ఠంగా రూ.15వేలు) అందిస్తారు. కాకుంటే ఆరు నెలల పాటు విధిగా పనిచేయాలి.

నెలకు రూ.లక్ష జీతం మించినవారికి పథకం వర్తించదు.

ప్రోత్సాహక మొత్తంలో కొంత పీఎఫ్‌లో జమ చేస్తారు.

'పీఎంవీబీఆర్కే గురించి మరింత సమాచారం కోరుకునే వారు ఖమ్మం నగరం, పాత కార్పొరేషన్ కార్యాలయ భవనంలో ఉన్న భవిష్యనిధి కార్యాలయంలో సంప్రదించవచ్చు.'
సునీల్, భవిష్యత్ నిధి జిల్లా అధికారి

# పార్ట్‌టైం ఉద్యోగం.. ఫుల్‌టైం మోసం

చిత్తూరు :ఉద్యోగం చేస్తున్నా సరే.. ఖాళీ సమయంలో గంట సమయం కేటాయిస్తే చాలు. రోజూ రూ.వేలల్లో ఆదాయం మీ సొంతం...! ఇలాంటి ప్రకటనలు ఆన్‌లైన్‌లో.. వాట్సాప్‌లో తరచూ చూస్తుంటాం. నిజమేనని ఆశపడి క్లిక్ చేశామా..? రోజూ రూ.వేలల్లో సంపాదన పక్కనపెడితే.. క్షణాల్లో రూ.లక్షలు మాయమవుతాయి. సైబర్ నేరగాళ్లు పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరుతో రూ.వందల కోట్లు కాజేస్తున్నారు. కరోనా తర్వాత వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం మొదలైంది. దీనికితోడు ఇంటిదగ్గరే ఉంటూ డేటా ఎంట్రీ, ఇతర పనిచేసుకోవచ్చు ంటూ అనేక సంస్థలు ఉద్యోగ ప్రకటనలు ఇచ్చాయి. ఈ క్రమంలోనే సైబర్ నేరగాళ్లు పార్ట్‌టైమ్ ఉద్యోగాల దందా మొదలుపెట్టారు. ఉదాహరణకు హోటళ్లు, రెస్టారెంట్లకు రివ్యూలు ఇవ్వాలని, యూట్యూబ్‌లో వీడియోలకు లైకులు, కామెంట్లు పెడితే డబ్బులిస్తామని టాస్కుల పేరుతో మోసగించడం ఈ కోవలోకే వస్తుంది. తొలుత యూట్యూబ్ ఛానెళ్ల సబ్‌స్క్రైబ్, వీడియోలకు లైకుల పేరుతో టాస్కులు పూర్తి చేస్తే డబ్బులిస్తామని ఆశపెడతారు.

**ఎలా తప్పించుకోవాలి..?**



ఈ వర్క్ ఫ్రమ్ హోం, పార్ట్ టైమ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాల్లో బాధితులు ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, గృహిణులు ఉంటున్నారు. - గృహిణులు ఇంటి ఖర్చులకు పనికొస్తాయని, భర్త సంపాదనకు చేదోడుగా ఉండొచ్చనే ఉద్దేశంతో సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నారు. - సామాజిక మాధ్యమాల్లో వర్క్ ఫ్రమ్ హోమ్ పేరుతో వచ్చే ప్రకటనల్ని నమ్మకూడదు- వ్యాపార సంస్థలు ఇలాంటి ప్రకటనలు ఇవ్వవు. సంప్రదించాలంటూ ఫోన్ నంబర్లు పెట్టవు.- ఏ సంస్థ కూడా బ్యాక్‌డోర్ ఉద్యోగాలను ప్రోత్సహించదు. అందుకే ముఖాముఖి లేకుండా ఉద్యోగాలంటే నమ్మొద్దు.- కచ్చితంగా సంస్థల అధికార వెబ్‌సైట్‌లో తనిఖీ చేసుకోవాలి. అవసరమైతే నేరుగా సంస్థ కార్యాలయానికి వెళ్లి ఆరా తీయాలి.

**ఒకవేళ మోసపోతే..**

ఉద్యోగం పేరుతో మోసగిస్తే ఆలస్యం చేయకుండా 1930 టోల్‌ఫ్రీకి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఏ బాధితులు వందలు, వేల సంఖ్యలో బాధితులు ఉంటారు. వీటిని బహిర్గతం చేస్తేనే నేర నియంత్రణ సాధ్యమవుతుంది. చిత్తూరు

# చిత్తూరుకిచ్చింది.. నీళ్లా.. కన్నీళ్లా

తిరుపతి : వర్షాధారిత ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చెప్పుకోదగిన భారీ సాగునీటి ప్రాజెక్టులు అంటూ ఏమీ లేవు. మధ్య తరహా రిజర్వాయర్లు అంతంతమాత్రమే. 2014-19 మధ్య తెదేపా పాలనలో హంద్రీ - నీవా సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా అడవిపల్లె రిజర్వాయర్ పూర్తి చేశారు.

గత పాలనలో కుప్పం, పుంగనూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో రిజర్వాయర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించారు. తిరుపతి జిల్లాలో అరణియార్ ప్రాజెక్టు ఆధునికీకరణకు హామీ ఇచ్చి అటకెక్కించారు. దాంతో అడపాదడపా వరదలు వచ్చిన సమయంలో నీరంతా వృథాగా తమిళనాడుకు వెళ్తోంది. ఒక్క 2020లో 22 టీఎంసీలు జిల్లా దాటి పోయాయి. ఈ ప్రభుత్వం స్పందించి గతంలో ప్రతిపాదించిన జలాశయాలను పూర్తిచేస్తే అటు హంద్రీ-నీవా నీరు, ఇటు వరద జలాలను నిల్వ చేసుకోవచ్చు.

**చామంతిపురం వద్ద 5 టీఎంసీలతో..**

పూతలపట్టు మండలం చామంతిపురం వద్ద ఏకంగా అయిదు టీఎంసీలతో రూ.3 వేల కోట్లతో రిజర్వాయర్ నిర్మిస్తామని జగన్ సర్కారు తెలిపినా ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీని ద్వారా గంగాధరనెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో 80 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తామని హామీ ఇచ్చారు.ప్రస్తుతం సాధ్యాసాధ్యాలను పరిశీలించి నూతన జలాశయాలకు ఆమోదం తెలిపితే రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది.



**పాలనా అనుమతులే..**

ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు గుడుపల్లె మండలం యామాగానిపల్లెలో 0.710 టీఎంసీలు, శాంతిపురం మండలం మాదనపల్లిలో 0.354 టీఎంసీల సామర్థ్యంతో రూ.535.435 కోట్లతో రిజర్వాయర్ల నిర్మాణానికి జగన్ ప్రభుత్వం పాలనా అనుమతులు మంజూరు చేసింది. ఐదు వేల ఎకరాలకు నీరందిస్తామని ప్రకటించారు.

**మల్లెమడుగు.. పడని అడుగు**

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తూర్పు ప్రాంతాలకు జీఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు నుంచి నీరందించవచ్చు. రేణిగుంట మండలంలోని మల్లెమడుగు సామర్థ్యం 0.181 టీఎంసీలు కాగా.. 3,950 ఎకరాలకు నీరందుతోంది. ఇందులో 2.69 టీఎంసీలు నిల్వ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. రూ.280 కోట్లు అవుతుందని అంచనా వేశారు. దీనికి ప్రభుత్వం నుంచి పాలనా అనుమతులు రావాలి. అరణియార్ ఆధునికీకరణకు రూ.35.64 కోట్ల జైకా నిధులు మంజూరైనా కుడి కాలువ, నల్లచెరువు కాలువ పనులు ఇంకా కాలేదు. వీటికి త్వరగా నిధులు విడుదల చేస్తే మూడేళ్లలో పనులు ఓ కొలిక్కి వస్తాయి.

# పీలేరును పీల్చేసినా ఏపీ చర్యలు!



పీలేరు : గత వైకాపా ప్రభుత్వంలో కొందరు నేతలు ఇష్టారాజ్యంగా చెలరేగారు. జగనన్న కాలనీల పేరుతో భారీ ఆక్రమణలకు పాల్పడ్డారు. అనర్హులు, తమ అనుచరులకు ఇళ్ల స్థలాలను అడ్డగోలుగా రాసిచ్చారు. గృహ నిర్మాణ శాఖ నుంచి మంజూరుతో పని లేకుండా బహిరంగ సమావేశాలు నిర్వహించి పప్పు బెల్లాల్లా పట్టాలు పంపిణీ చేశారు. అర్హులైన పేదల ఆశలకు సమాధి కట్టారు. ఇవన్నీ నిజమేనని అధికారులూ నిర్ధారించారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారు.

**పేదల ముసుగులో పాగా**

పీలేరు పారిశ్రామికాభివృద్ధికి అప్పటి ముఖ్యమంత్రి నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి రూ. 4 కోట్ల వ్యయంతో 250 ఎకరాల ప్రైవేట్ భూములు, 500 ఎకరాల ప్రభుత్వ, డీకేటీ భూములను సేకరించి ఏపీఐఐసీకి అప్పగించారు. 2014 తర్వాత తెదేపా హయాంలో ఆయా స్థలాల్లో రూ.10 కోట్ల వ్యయంతో మౌలిక వసతులు కల్పించారు. 2019 అనంతరం వైకాపా అధికారంలోకి రాగానే కొందరు నేతలు వీటిపై కన్నేశారు. పేదల ముసుగులో పాగాకు తెర లేపారు. ఈ క్రమంలోనే ఇళ్ల స్థలాల పేరుతో ఏపీఐఐసీ లేఅవుట్- 1లో 1,118, ఏపీఐఐసీ లేఅవుట్-2లో 2,500, ఏపీఐఐసీ లేఅవుట్- 3లో 2,300, ఏపీఐఐసీ లేఅవుట్-4లో 2,500 పట్టాలు కేటాయించారు. గూడరేవుపల్లె పంచాయతీ పరిధి పీలేరు- తిరుపతి మార్గం ఆనుకుని ఉన్న నూనె విత్తుల కర్మాగారం లేఅవుట్‌లో 1,146, కంకర ఫ్యాక్టరీ లేఅవుట్‌లో 689 పట్టాలు పంపిణీ చేశారు. లబ్ధిదారుల్లో పలువురు అనర్హులే ఉండటం గమనార్హం.

**నివేదికలతో సరి**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీలేరు మండల పరిధిలోని మొత్తం పది లేఅవుట్లను అధికారులు పరిశీలించారు. లబ్ధిదారుల జాబితాలను జల్లెడ పట్టారు. మొత్తం 3,600 మంది అక్రమంగా పట్టాలు పొందినట్లు తేల్చారు. తిరుపతి మార్గంలోని నూనె విత్తుల కర్మాగారం లేఅవుట్, కంకర ఫ్యాక్టరీ లేఅవుట్, ఏపీఐఐసీ లేవుట్- 3, ఏపీఐఐసీ లేఅవుట్- 4లో అధికంగా అక్రమార్కులు చోటుచేసుకున్నట్లు గుర్తించారు. ఇంతవరకు బాగానే ఉంది. ఆ తర్వాత ఎలాంటి చర్యలు లేకపోయాయి. ఈ విషయమై రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ.. పీలేరు జగన్న కాలనీల్లో వెలుగుచూసిన అక్రమాల నివేదికను ఉన్నతాధికారులకు పంపామని.. అక్కడి నుంచి అందే ఆదేశాల మేరకు చర్యలుంటాయని తెలిపారు.

# చూసే నయనం.. చీకటిలోకి పయనం!



అనంతపురం : చిన్నపిల్లలు మొదలు, పెద్దల వరకూ సెల్‌ఫోన్ వాడకం పెరిగింది. గృహాల్లో టీవీలకు దగ్గరగా ఉంటూ సినిమాలు, సీరియల్స్ చూస్తున్నారు. నయనాలకు విశ్రాంతి లేక సమస్యలు వస్తున్నాయి. ఇప్పటికీ కళ్లను సంరక్షించుకోవటంలో చాలామంది నిర్లక్ష్యం చూపుతున్నారు. ఇది ఆందోళనకర అంశం. కంటి చూపు విషయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ప్రపంచ దృష్టి దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

కళ్ల సమస్యలున్న పిల్లలను గుర్తించి వారికి సకాలంలో చికిత్సలు అందించటం, అవసరమైన అద్దాలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోంది. ఇందుకోసం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల్లో చిన్నపిల్లలకు కంటి పరీక్షలను నిర్వహిస్తున్నారు. పెద్దల్లో కంటి సమస్యలు తలెత్తితే వారికి ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు ఎన్టీఆర్ వైద్యసేవలు అందించే ప్రైవేట్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలను ప్రభుత్వం ఉచితంగా చేయిస్తోంది.

**అలవాట్లు.. ఆటుపోట్లు**

గంటల తరబడి సెల్‌ఫోన్, టీవీ చూడటం, సమయానుగుణంగా నిద్రలేకపోవటం, కళ్లకు విశ్రాంతి ఇవ్వకుండా వాహనాలు నడపటం, గంటల తరబడి ల్యాప్‌టాప్, కంప్యూటర్లు చూస్తూ గడిపేయడం, సరైన ఆహారపు అలవాట్లు పాటించకపోవటం, పోషకాలున్న ఆహారం, ఆకుకూరలు తినకపోవటం వంటి కారణాలతో వివిధ రకాల కంటి సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు.

పుస్తకాలు, బోర్డులో ఉన్న అక్షరాలు కనిపించకపోవటం, కళ్ల నొప్పి, మంటలు, మసకగా అక్షరాలు కనపడటం వంటి సమస్యలున్న కేసులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో పెరుగుతూనే ఉన్నాయి. ప్రస్తుత అంచనా ప్రకారం ప్రతి పదిమందిలో ఒకరికి దృష్టి సమస్య ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఇలానే కొనసాగి.. ప్రతి ఐదుగురిలో ఒక్కరికి దృష్టిలోపం తలెత్తే ప్రమాదకర స్థితికి వెళ్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**జాగ్రత్తలు పాటించాల్సిందే..**

- డాక్టర్ సైదన్న, అంధత్వ నివారణ సంస్థ అధికారి, అనంతపురం జిల్లా

పిల్లలకు సెల్‌ఫోన్లు ఇవ్వకూడదు. ఎక్కువ సేపు పిల్లలు ఇతర పిల్లలతో ఆడుకునేలా చూడాలి. వారికి ఆట వస్తువులు ఇవ్వాలి. ఎక్కువసేపు సెల్ చూడటం ద్వారా మెద, వెన్నెముకలో సమస్యలు వస్తాయి. మానసిక ఒత్తిడి పెరుగుతుంది. మంచి వెలుతురులోనే చదువుకోనివ్వాలి.. ఆరునెలలకోసారి కంటి పరీక్షలు చేయించుకోవాలి. వైద్యుల సూచన మేరకు మాత్రమే కంటి మందులు వాడాలి. జిల్లావ్యాప్తంగా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కళ్లను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

గత ఏడాది అనంతపురం జిల్లాలో పాఠశాల స్థాయిలో కంటి సమస్యలు తేలిన విద్యార్థుల సంఖ్య 2743

ఈఏడాది 5 నెలల వ్యవధిలోనే కంటి సమస్యలు ఉన్న చిన్నారులు (ఏడాది మొత్తంగా చూస్తే ఈ సంఖ్య రెట్టింపు అయ్యే ఆస్కారం ఉందని అంచనా) 1372

# పెన్నహోబిలం ఆలయ అభివృద్ధిపై నీలినీడలు



ఉరవకొండ : ఉరవకొండ మండలంలో ఉన్న పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధిపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈ ఆలయాన్ని ఏటా 1.5 లక్షలకుపైగా భక్తులు దర్శించుకుంటారు. ఆలయానికి 2,134 ఎకరాల భూమి ఉంది. అందులో 1,556 ఎకరాలు కౌలుకు ఇచ్చారు. వాటితోపాటు హుండీల ద్వారా ఏటా రూ.కోటికి పైగా ఆదాయం వస్తుంది. అయితే దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధి శూన్యం. భక్తులకు కనీస సదుపాయాలు కరవే. ఆలయ పరిసరాల్లో దాతలు నిర్మించిన గదులే దిక్కు. వాటిలో చాలా మండపాలు శిథిలం అయ్యాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా గదులు నిర్మించలేదు. వారాంతాలు, ప్రత్యేక రోజులు, బ్రహ్మోత్సవాల సమయాల్లో గదుల కొరత వేధిస్తుంది. కనీసం మరుగుదొడ్లు లేవు. తాగునీటి సదుపాయం అంతంత మాత్రమే. మాడవీధుల్లో చెప్పుకోదగిన అభివృద్ధి లేదు.

**పట్టించుకునేదెవరు?**

ఆలయ అభివృద్ధిపై దేవాదాయ అధికార యంత్రాంగం కనీసం దృష్టి సారించడం లేదు. ఇక్కడ పని చేసే అధికారులు తమ సీటును కాపాడుకోవడానికి ఇస్తున్న ప్రాధాన్యం ఆలయ అభివృద్ధిపై పెట్టడం లేదు. భక్తులు రూ.కోటి విరాళం ఇస్తే మూడేళ్లుగా శ్రీవారి నూతన రథాన్ని తయారు చేయించడంలో ఘోర విఫలం చెందారు. వారి మనోభావాలను గాలికి తోసేసి, కాలయాపన చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించుకునే ప్రయత్నాలు చేసింది లేదు.

**ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం..**

ఉన్నతాధికారుల సూచనలతో మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాల మెరుగు, ఆలయం అంతా శ్యాండ్ బ్లాస్టింగ్ చేయించడానికి ఇంజినీరింగ్ అధికారులతో ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నాం. పాలక మండలి ఏర్పాటు కాగానే వారి సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రణాళిక రూపొందిస్తాం.రమలరెడ్డి, ఆలయ ఈవో

# గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలు సిద్ధం

తిరుపతి : గ్రేటర్ తిరుపతి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. కమిషనర్ ప్రభుత్వానికి సమర్పించనున్నారు. ఇది సాకారమైతే గ్రేటర్ పరిధి 300 చదరపు కిలోమీటర్లకు చేరుతుంది.

**వేగంగా విస్తరణ..**నగరపాలక సంస్థ పరిధి అధికారికంగా కేవలం 30.17 చ.కి.మీ.లు అయినా తిరుపతి గ్రామీణం, చంద్రగిరి, రేణిగుంట మండలాలు తిరుపతిలో అంతర్భాగంగానే ఉంటాయి. నగర పరిసరాలను పరిశీలిస్తే 300 చ.కి.మీ.ల మేర పట్టణ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. అవన్నీ గ్రామాలే అయినా పట్టణ వాతావరణమే ఉంటుంది. కార్పొరేట్ ఆసుపత్రులు, విద్యా సంస్థలు, వాణిజ్య భవనాలు, విల్లాలు, షోరూమ్‌లు, బహుళ అంతస్తుల భవనాలతో నగరానికి 10 నుంచి 30 కి.మీ.ల మేర విస్తరించాయి.

**ప్రభుత్వానికి సమర్పించనున్న కమిషనర్**

తిరుపతి నగరపాలిక పరిధి విస్తరించాలన్న ఆలోచన 2010 నుంచే ఉంది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ ప్రణాళిక, ఆర్థికాభివృద్ధిని విస్తృతం చేయడంలో గ్రేటర్ కీలకం కానుంది. తిరుపతి పరిసరాల్లో వాణిజ్య కార్యకలాపాలకు తగిన వసతులు లేకపోవడానికి కారణం మాత్రం అవి తక్కువ ఆదాయం వచ్చే పంచాయతీల పరిధిలో ఉండడమే. తిరుపతి గ్రేటర్ ప్రతిపాదనతో ఈ సమస్యకు పరిష్కారం లభించనుంది.**ఆమోదమే ఆలస్యం..**



అధికారులు సిద్ధం చేసిన గ్రేటర్ ప్రతిపాదనలకు ప్రభుత్వ అంగీకారం చాలి. తరువాత ఆయా పంచాయతీలు తీర్మానం చేసి ఆమోదిస్తే విలీన ప్రక్రియ పూర్తవుతుంది.

గ్రేటర్ ప్రతిపాదిత పంచాయతీల సంఖ్య: 63

ప్రభావిత మండలాలు: తిరుపతి గ్రామీణ, చంద్రగిరి, రేణిగుంట, ఏర్పేడు నగరపాలిక పరిధి: 30.17 కి.మీ.

ప్రతిపాదిత పరిధి: 299 కి.మీ.

ఆదాయం: రూ. 151 కోట్లు

విలీనంతో వచ్చే ఆదాయం: రూ.33 కోట్లు

తిరుపతి నగర జనాభా: 4.52 లక్షలు

63 గ్రామాల జనాభా: 2.98 లక్షలు

# ఇనుము.. నాణ్యతకు చిలుము

కర్నూలు : సొంతిల్లు నిర్మించుకోవాలన్నది ప్రతి ఒక్కరి కల. పట్టణాల్లో చాలామంది.. తమ ఇళ్ల నిర్మాణాలను బిల్డర్లు, గుత్తేదారులు, బేల్దార్లకు అప్పగిస్తున్నారు. వారు ఐరన్ (స్టీల్) మర్చంట్ వ్యాపారులతో కుమ్మక్కై 'మూడో' రకం స్టీలు కొనుగోలు చేసి నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. ఒక సెంటు స్థలంలో ఇల్లు నిర్మించేందుకు 6 క్వింటాళ్లకుపైగా స్టీలు అవసరమవుతుంది. కొందరు బిల్డర్లు, గుత్తేదారులు మూడో రకం స్టీలును ఎక్కువగా వినియోగించి రూ.లక్షలు మిగిల్చుకుంటున్నారు.

**మూడో రకంతో మురి**

కర్నూలు నగరంలో 150కిపైగా స్టీల్ (ఐరన్) మర్చంట్ దుకాణాలున్నాయి. కొన్ని దుకాణాల్లో నాసిరకం ఐరన్ విక్రయాలతోపాటు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఇనుము దుకాణాలపై పర్యవేక్షణ కరవైంది. తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు లేవు. క్వింటా స్టీలుకు 4-5 కిలోల వ్యత్యాసం ఉండేలా ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాల్లో మార్పులు చేస్తున్నారు. మూడో రకం స్టీలు తక్కువ బరువు ఉంటుంది. నాణ్యత ప్రమాణాలు కలిగిన స్టీలుతో పోలిస్తే కిలోకు రూ.2-3 తక్కువ ధరకు లభిస్తుంది.

**ప్రభుత్వ ఆదాయానికి గండి**

కొందరు వ్యాపారులు జీఎస్టీ లేకుండానే వ్యాపారాలు చేస్తున్నారు. మరికొందరు జీఎస్టీ నంబరు కలిగి ఉన్నప్పటికీ రోజులో వంద క్వింటాళ్ల విక్రయాలు చేస్తే అందులో 20-30 క్వింటాళ్లకు మాత్రమే జీఎస్టీ



పరిధిలో చూపుతూ మిగతా విక్రయాలను జీఎస్టీ నుంచి తప్పిస్తున్నారు. వాణిజ్య పన్నుల శాఖ అధికారులు మామూళ్లకు రుచిమరిగి అక్రమార్కులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది.

**గుర్తించడం ఎలా..**

పట్టణ ప్రాంతాల్లో ఏటా కొత్తగా 5-10 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 1-2 శాతం మేర ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లో ఒక్కో ఇంటికి రూ.10 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు వెచ్చిస్తున్నారు. నిర్మాణంలో కీలకమైన స్టీలు వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు గృహనిర్మాణ శాఖ ఇంజినీర్ చిరంజీవులు.

నాణ్యమైన స్టీలు బార్ ఉపరితలం నునుపుగా, పగుళ్లు, అతుకులు, తుప్పు లేకుండా బూడిద రంగులో ఉండాలి.

స్టీలు బార్‌పై కంపెనీ లోగో స్పష్టంగా ఉండాలి. ఐఎస్ఐ, బీఐఎస్ గుర్తులు గమనించాలి. అన్ని చువ్వల పొడవు, బరువు ఒకేలా ఉండాలి. ఒక స్టీలు బార్ సాధారణంగా 11 నుంచి 12 మీటర్ల పొడవు ఉంటుంది. ఇందుకు భిన్నంగా ఉంటే సరైనది కాదు.

స్టీలు బార్లపై రింగుల్లా ఉండేవాటిని రిబ్స్ అంటారు. రిబ్స్ దగ్గరగా ఎత్తుగా ఉండాలి. ఇనుప చువ్వలను 135 డిగ్రీల కోణంలో వంచినప్పుడు వంగిన ప్రదేశంలో పగుళ్లు రాకూడదు. 180 డిగ్రీలు వంచితే విరిగిపోకూడదు.

# పూలకుంటను పూడ్చేశారు

నంద్యాల : భూతాలు చిన్ననీటి వనరులను 'చెర'బట్టాయి. మహానంది మండలంలో ఏకంగా చెరువునే మాయం చేశారు. బుక్కాపురం గ్రామ పరిధిలో 80 ఎకరాల్లో విస్తరించిన పూలకుంటను ఆనవాళ్లు మిగలకుండా ఆక్రమించారు. 'ఖద్దరు' అండతో అక్రమంగా పట్టాలు పొంది దర్జాగా అరటి తోటలు సాగు చేస్తున్నారు. దస్త్రాలు మాయం చేశారు. ఫలితంగా కేంద్ర జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ప్రతి ఐదేళ్లకోసారి జరిగే చిన్ననీటి వనరుల సర్వేలో ఈ విషయం వెలుగులోకి వచ్చింది.

**ఎక్‌సాల్ పేరుతో** పాగామహానంది మండలంలోని నల్లమల అడవుల్లో కురిసిన వర్షపునీటితో పూలకుంట చెరువు నిండేది. ఈ నీటితో బుక్కాపురం, పుట్టుపల్లె, తిమ్మాపురం, అబ్బీపురం గ్రామాల రైతులు తమ పొలాలు సాగు చేసుకునే వారు. తెలుగుగంగ ప్రాజెక్టు రావడంతో మండలంలోని పలు గ్రామాలకు సాగునీటి ఇబ్బందులు తీరాయి. ఈ క్రమంలోనే పూలకుంట చెరువు నల్లమల అటవీ ప్రాంతానికి మధ్య తెలుగుగంగ ప్రధాన కాల్వ నిర్మాణం జరిగింది. దీంతో ఈ నీళ్లు వచ్చే మార్గం లేక చెరువు ఎండిపోయింది. ఇదే అదనుగా అక్రమార్కులు రంగంలోకి దిగారు. రెవెన్యూ అధికారుల అండతో తొలుత చెరువు భూమిలో ఎక్‌సాల్ పట్టాలు తీసుకోవడం ప్రారంభించారు. పేదల పేరుతో కొందరు, రాజకీయ పలుకుబడితో మరికొందరు చెరువును పంచుకున్నారు.

**దస్త్రాలు ఏమయ్యాయి?**

పూలకుంట చెరువుకు సంబంధించిన దస్త్రాలు ప్రస్తుతం ఏ శాఖలోనూ కనిపించడం లేదు. కబ్జాకు పాల్పడిన వారిలో పెద్దలు, అధికారుల పాత్ర ఉండటంతో రెండు దశాబ్దాలుగా దీని దస్త్రాలను ఒక పద్ధతి ప్రకారం మాయం చేశారు. ఓ విశ్రాంత వీఆర్వో కీలకంగా వ్యవహరించి కొందరు రెవెన్యూ అధికారుల సాయంతో దస్త్రాలు కనిపించకుండా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. చిన్ననీటి పారుదల శాఖ వద్ద చెరువుకు సంబంధించిన వివరాలు లేకపోవడం గమనార్హం. గతంలో అటవీ శాఖ వద్ద పూలకుంట వివరాలు ఉండగా.. ప్రస్తుతం వారి వద్ద అందుబాటులో లేనట్లు సమాచారం. ఏ శాఖ అధికారులను అడిగినా చెరువు ఉన్నట్లే తెలియదన్న విధంగా సమాధానం ఇస్తుండటం గమనార్హం.

**దొంగపట్టాలతో పంచిపెట్టారు**

పూలకుంట చెరువును కనుమరుగు చేయడంలో కొంతమంది రెవెన్యూ సిబ్బంది కీలకంగా వ్యవహరించారు. 20 ఏళ్ల కిందటే ఓ వీఆర్వో భారీగా డబ్బులు దండుకుని పలువురికి పట్టాలు ఇప్పించారు. మరికొందరు దొంగ పట్టాలతోనే ఆక్రమించారు. అక్రమార్కుల్లో తిమ్మాపురం, బుక్కాపురం, పుట్టుపల్లె, అబ్బీపురం, మహానందికి చెందిన నాయకులు కూడా ఉన్నారు. ఓ పోలీసు అధికారి సమీప బంధువులకు కూడా ఇందులో పట్టాలు ఉండటం గమనార్హం.

ప్రత్యేకించి 2000- 2007 సంవత్సరాల మధ్య ఇక్కడ పెద్ద ఎత్తున పట్టాలు పుట్టించారు. వీటిలో తహసీల్దార్లు ఇచ్చినవి కొన్ని ఉండగా.. గతంలో ఇక్కడ పనిచేసి ప్రస్తుతం ఉద్యోగ విరమణ చేసిన నలుగురు తహసీల్దార్ల పేర్లతో సృష్టించిన దొంగ పట్టాలు ఎక్కువగా ఉన్నాయి. గత కొన్నేళ్లుగా ఈ భూములకు రిజిస్ట్రేషన్లు కూడా జరుగుతున్నాయి. పక్కనే ఉన్న పట్టా భూముల సర్వే నంబర్లు వేసి ఈ భూములకు రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. రిజిస్ట్రేషన్లతో చేతులు మారుతుండటంతో ఈ భూములకు విలువ కూడా పెరిగింది.

# అన్నీ ఉన్నా.. సిబ్బందే శని!



కడప : డెంగీ, మలేరియా ఇతర వైరల్ జ్వరాలు పట్టణ వాసుల్ని వణికిస్తున్నాయి. దగ్గు, జలుబు, ఇతర సీజనల్ వ్యాధులతో జనం అల్లాడుతున్నారు. ఆర్ఎంపీ మొదలుకుని కార్పొరేట్ వరకు అన్ని వైద్యశాలలు రోగులతో కిటకిటలాడుతున్నాయి. అదే సమయంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అజమాయిషీలో పనిచేస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రాల పనితీరు మాత్రం అధ్వానంగా మారింది. ఆసుపత్రుల్లో అన్ని వసతులున్నా.. ప్రభుత్వం 172 రకాల మందులను అందుబాటులో ఉంచినా.. సేవలందించాల్సిన సిబ్బంది పలుచోట్ల ముఖం చాటేస్తున్నారు. కడప నగరం, ప్రొద్దుటూరు పట్టణంలోని కొన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాలనుబృందం పరిశీలించింది. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, కొందరు అసలు విధులకే రాకపోవడం రోగుల పాలిట శాపంగా మారినట్లు గుర్తించింది.

**వస్తారు.. నిలకడగా ఉండరు**

మారుతీనగర్ వైద్యశాలను సకాలంలో తెరిచారు. వైద్యులు ఇతర సిబ్బంది సైతం సమయానికే వచ్చారు. కానీ కొంతసేపటికే అక్కడి నుంచి వెళ్లిపోయారు. రోగులకు కావాల్సిన పలు రకాల మందులు బయట కొనాలని చీటీలు రాసివ్వడం గమనార్హం.

**అక్కడ కింది స్థాయి సిబ్బందే దిక్కు**

పాత కడప వైద్యశాలలో ఓపీకి వచ్చే రోగుల సంఖ్య ఎక్కువ. వైద్యులు మాత్రం విధులకు రావడం లేదు. నర్సులు, ఇతర సిబ్బందే నిబంధనలకు విరుద్ధంగా సేవలందిస్తున్నారు. మందులు, సూదులు బయటే తెచ్చుకోవాలని రోగులకు సూచిస్తున్నారు.

**ప్రొద్దుటూరు.. వేళకు రారు**

ప్రొద్దుటూరులోని ఆరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించలేదు. వైద్యులు ఉదయం 10 గంటలకు హాజరై మధ్యాహ్నం ఒంటి గంటకు వెళ్లిపోయారు. లైట్‌పాలెం పట్టణ ఆరోగ్య కేంద్రంలో పది గంటల సమయం దాటినా ఇద్దరే హాజరయ్యారు. తర్వాత వైద్యులు వచ్చినా మధ్యాహ్నం ఒంటి గంటకు ఓపీ నిలిపేశారు.

**స్పందించిన డీఎంహెచ్‌వో**

పరిశీలనలో వెలుగుచూసిన అంశాలను డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకెళ్లింది. గైర్హాజరుపై తీవ్రస్థాయిలో స్పందించారు. విధుల నుంచి ఎందుకు తొలగించరాదో తెలపాలని పాత కడప వైద్యశాల వైద్యుడికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. యూపీహెచ్‌సీ వైద్యులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి విధులకు గైర్హాజరైతే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు.

**వచ్చారు... అయితే ఆలస్యం**

పాత రిమ్స్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వైద్యశాలను ఉదయం తొమ్మిది గంటలకు తెరిచారు. ఈ సమయానికి ఫార్మసిస్టు ఒక్కరే వచ్చారు. ఇద్దరు స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్, వైద్యురాలు అంతా వచ్చేటప్పటికి 9.45 అయింది. డేటా ఎంట్రీ ఆపరేటర్, అటెండరు హాజరు కాలేదు.

**నర్సులే వైద్యులయ్యారు**

నిరంజన్ నగర్‌లోని వైద్యశాలలో వైద్యులు, డేటా ఎంట్రీ ఆపరేటర్, అటెండరు విధులకు రాలేదు. నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ రోగులను పరీక్షించారు. ఫార్మసిస్టు మందులు ఇచ్చారు. అధిక రక్తపోటుకు వాడే అటెన్ మాత్రలు ఇవ్వడం లేదని రోగులు చెప్పారు.

## కాజేస్తున్న వాటిని కనిపెట్టేస్తున్నారు

కడప : ప్రస్తుతం చరవాణి చోరులు చెలరేగి పోతున్నారు. బస్టాండ్లు, మార్కెట్లు, సినిమా థియేటర్లు, పర్యాటక ప్రాంతాలు ఇతర రద్దీ ప్రాంతాల్లో తమ హస్త లాఘవం ప్రదర్శిస్తున్నారు. సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న పలువురు ఠాణాల మెట్లు ఎక్కుతున్నారు. ఈ క్రమంలో పోలీసులు కొన్నింటిని గుర్తించి బాధితులకు అందిస్తున్నారు. ఇందుకు గాను మిస్సింగ్ మొబైల్ ట్రాకింగ్ విధానం(ఎంఎంటీఎస్), సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటి రిజిస్ట్రార్(సీఈఐఆర్)ను వినియోగిస్తున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా ఆరు విడతల్లో రూ.9.11 కోట్ల విలువజేసే 4,670 చరవాణులను బాధితులకు అందజేశారు.



**పోగొట్టుకుంటే ఇలా చేయండి**

చరవాణిని పోగొట్టుకుంటే, ఇతరులు ఎవరైనా చోరీ చేస్తే తక్షణం బ్యాంకు ఖాతాను రద్దు చేయించుకోవాలి. ఆలస్యం చేయకుండా సిమ్‌కార్డు నంబరు డిసేబుల్ చేయించుకోవాలి. గూగుల్‌పే, ఫోన్‌పే వంటి డిజిటల్ పేమెంట్ యాప్‌లు, అప్లికేషన్లు రెండు ఫ్యాక్టర్ ఆథెంటికేషన్ లేదా బయోమెట్రిక్ సెక్యూరిటీ వినియోగించుకోవాలి. చరవాణి పోయిన తక్షణమే సామాజిక ఖాతాలతో పాటు, డిజిటల్ పేమెంట్ ఖాతాల పాస్‌వర్డులు మార్చాలి. ఎంఎంటీఎస్ లేదా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయాలి. సీఈఐఆర్ పోర్టల్ గూగుల్‌లో సెర్చ్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. 9392941541 వాట్సప్ నంబరు ద్వారా కూడా ఫిర్యాదు అందించొచ్చు.

## గడువు ముంచుకొస్తున్నా.. ఉలకరు.. పలకరు!

రేగిడి : విజయనగరం- పాలకొండ రహదారిలో రాజాం దాటిన తర్వాత చేపట్టాల్సిన అభివృద్ధి పనులు పూర్తికాక ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో రాజాం దాటిన తర్వాత 45 నుంచి 47.. తిరిగి 51 నుంచి 64 కిలోమీటర్ల వరకు పనులు చేసేందుకు రూ.8.82 కోట్లు మంజూరు చేశారు. గుత్తేదారు 49 శాతం పూర్తిచేశారు. ర.భ. శాఖ అధికారులు రూ.4 కోట్ల వరకు బిల్లులు కూడా పెట్టారు. ప్రభుత్వం నుంచి పైసా రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.



**పెరుగుతున్న ప్రమాదాలు**

నిత్యం వేలాది వాహనాలు తిరిగే రోడ్డులో పనులు పూర్తికాకపోవడంతో తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ప్రధానంగా రేగిడి మండలంలోని ఉంగరాడమెట్ట, మజ్జి రాముడుపేట గ్రామాల వద్ద బస్సు కూడళ్లు కావడంతో రద్దీ ఎక్కువగా ఉంటుందని తారు బదులు సీసీ వేయాలని నిర్ణయించారు. ఆ పనులు కాలేదు. వర్షం పడితే వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇంకోవైపు ఈనెల 31తో గడువు ముగుస్తోంది. ఆలోగా చేయకపోతే పనులు రద్దవుతాయి.

ఉన్నతాధికారులకు నివేదించాం..: గుత్తేదారుకు నోటీసులు జారీచేశాం. అయినా ఇంతవరకు ముందుకు రాలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మజ్జి రాముడుపేట వద్ద రహదారి గోతులు కొంతవరకు సరిచేశాం. పనులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటాం.

– నాగభూషణరావు, ర.భ.శాఖ జేఈ, రాజాం

## నిధులు లేక.. ప్రగతి సాగక

గుంతకల్లు: గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి ప్రాంతాల్లో పలు ప్రగతి పనులు నిధుల కొరతతో అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వీటిని పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని వివిధ శాఖల అధికారులు ప్రభుత్వానికి నివేదిస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. ఇది వరకు ప్రారంభించిన నిర్మాణాలను సకాలంలో పూర్తిచేయక పోవడంతో కట్టడాలు దెబ్బతింటున్నాయి. సకాలంలో పూర్తయి ఉంటే ప్రజాప్రయోజనం ఉండేదని పలువురు పేర్కొంటున్నారు.

మూడు మున్సిపాలిటీల్లో రూ.8.54 కోట్లు విలువ చేసే భవనాల పనులు మధ్యలో ఆగిపోయాయి. ఫలితంగా వాటి నిర్మాణ వ్యయం పెరుగుతూ పోతోంది. సకాలంలో పనులను పూర్తిచేసి ఉంటే ప్రభుత్వ నిధులు ఆదా అయ్యేవి.

**క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే..**

గుంతకల్లులో ఇండోర్ స్టేడియం లేని కారణంగా క్రీడాకారులు ఆటలు ఆడుకోవడానికి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు.

పాతగుంతకల్లులో గ్రంథాలయానికి భవనాన్ని నిర్మించడానికి గత మున్సిపల్ అధ్యక్షుడు హనుమేశ్‌రావ్ స్థలాన్ని విరాళంగా అందించారు. భవనాల నిర్మాణం పునాదులకే పరిమితమమైంది.

తాడిపత్రిలో ఇండోర్ స్టేడియం నిర్మాణాన్ని గత తెదేపా ప్రభుత్వం ప్రారంభించగా వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత పనులను ఆపేశారు. వైకాపా ప్రభుత్వం చేపట్టిన కస్తూర్బా గాంధీ జూనియర్ కళాశాల భవనాలు, పట్టణ ఆరోగ్యకేంద్రం భవనాల నిర్మాణాన్ని వైకాపా ప్రభుత్వం ప్రారంభించింది. అప్పట్లో కావాల్సినంత నిధుల కేటాయింపు లు లేక పనులు సాగలేదు.



గుత్తి ఆర్ఎస్‌లో స్త్రీశక్తి భవన్ నిర్మాణ పనులను గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. తరువాత వచ్చిన వైకాపా పూర్తిచేయడానికి నిధులు ఇవ్వలేదు. గుత్తిలో చిన్న పిల్లల పార్కు పనులను కూడా గతంలో ప్రారంభించి వదిలేశారు.

ప్రభుత్వానికి నివేదించాం

– నయీం అహమ్మద్, మున్సిపల్ కమిషనర్

గుంతకల్లు మున్సిపాలిటీలో అర్ధాంతరంగా ఆగిపోయిన నిర్మాణాలను పూర్తిచేస్తాం. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిధులు విడుదల చేయనుంది. ఆయా పనుల వివరాలను ప్రభుత్వానికి నివేదించాం. అనుమతులు, నిధులు రాగానే ఆగిపోయిన ప్రగతిని పట్టాలెక్కిస్తాం.

## ఇసుకంతా మాయం.. ఇసుమంతైనా లేదు భయం



జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం కొందరికి కాసులు కురిపిస్తోంది. సామాన్యులు తమ సొంత ఇంటి అవసరాలకు ట్రాక్టర్లలో తరలించుకోవచ్చన్న వెసులుబాటును అక్రమార్కులు తమకు అనుకూలంగా మలుచుకుంటున్నారు. యంత్రాలతో యథేచ్ఛగా తవ్వకాలు చేపడుతున్నారు. నదీ గర్భాలను గుల్ల చేస్తున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జమ్మలమడుగు నుంచి పొన్నతోట వెళ్లే దారిలో ఈ వ్యవహారం మరింత జోరుగా సాగుతోంది.

**డోజర్లు ఏర్పాటు చేసి వసూళ్లు**

పెన్నా నదిలో కొందరు డోజర్లను ఏర్పాటు చేశారు. ట్రాక్టర్లకు ఇసుక నింపుతూ సదరు యజమానుల నుంచి రూ. 800 వసూలు చేస్తున్నారు. ట్రాలీకి చెక్కలు అమర్చి పరిమితికి మించి ఇసుకను నింపుకొంటున్నారు. రెవెన్యూ, సచివాలయ ఉద్యోగుల నుంచి అనుమతి పత్రాలు తీసుకోకుండానే ఈ తంతు సాగిస్తున్నారు. ఆపై కర్నూలు, నంద్యాల జిల్లాలోని నొస్సం, మాయలూరు, శిరివెళ్ల, కోవెలకుంట్ల, బనగానపల్లె, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాలకు తరలించి రూ. 6 వేల నుంచి రూ.7,500కు విక్రయిస్తున్నారు. ముద్దనూరు రోడ్డులోని పెన్నా వంతెన సమీపంలో ఇసుక తవ్వకాలతో 2021లో వంతెన కుంగిపోయి 14 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆ తర్వాత అక్కడ నిషేధం విధించినా తవ్వకాలు సాగుతున్నాయి.

**శ్మశానాన్నీ వదలని అక్రమార్కులు**

జమ్మలమడుగు నుంచి వేపరాల వెళ్లే దారిలో ఇసుక దిబ్బలను ఏటిగడ్డగా స్థానికులు పిలుస్తుంటారు. అక్కడే హిందూ శ్మశానవాటిక ఉంది. గత నెల 11న ట్రాక్టర్లలో ఇసుక నింపుతుండగా స్థానికులు, రజకులు అడ్డుకున్నారు. శ్మశానవాటికలోని సమాధులను తవ్వేస్తున్నారని, నదిలో గుంతల కారణంగా ఉతికిన వస్త్రాలు ఆరవేయడానికి స్థలం లేకుండా చేస్తున్నారని నిలదీశారు. అయినా అక్రమార్కులు ఆపడం లేదు. పెన్నా వంతెన వద్ద ఇసుక తవ్వకాలకు అనుమతి లేదని జమ్మలమడుగు తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి అన్నారు. పొన్నతోట రహదారిలోనూ పరిశీలించి ఇసుక అక్రమంగా తరలిపోకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## కాలనీ ఇచ్చారు.. కర్తవ్యం మరిచారు!



భోగాపురం: సాయంత్రం సూర్యాస్తమయం అవుతోంది.. గ్రామశివారులోని పాతచెరువు పక్కన కూర్చున్న అప్పారావు కళ్లల్లో నీళు తిరుగుతున్నాయి. 'తాత తండ్రుల నుంచి సాగుచేస్తున్న పంట భూములు దూరమయ్యాయి.. చెమటోడ్చి పనులు చేసిన చేతులు ఖాళీగా వణుకుతున్నాయి.. మేమిచ్చిన భూముల్లో విమానాలు రయ్‌న ఎగరబోతున్నాయి.. ఇళ్లు ఇచ్చిన కాలనీలో మాత్రం కనీస సదుపాయాలు కల్పించలేదని, అత్యవసరానికి ఉపయోగపడడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.'

విమానాశ్రయం నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన భోగాపురం మండలంలోని ముడసర్లపేట, సరగడపేట గ్రామాలకు చెందిన 269 కుటుంబాలకు నష్టపరి హారంతో పాటు నిర్వాసిత కాలనీని ప్రభుత్వం మంజూరు చేసింది. దీంతో పాటు విద్యుత్తు, తాగునీరు, రహదారులు తదితర మౌలిక సదుపాయాల కల్పనకు హామీ ఇచ్చింది. పాత గ్రామాల్లో ఉన్న ఆలయాలు, పాఠశాలలు ఇక్కడ నిర్మిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేరలేదు. దూరంగా ఏర్పాటైన పాఠశాలలకు వెళ్లేందుకు పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. నిర్వాసితులకు ఇచ్చిన కాలనీ 22ఏ జాబితాలో ఉండడంతో అత్యవసర పరిస్థితుల్లో అమ్ముకునేందుకు, బ్యాంకులో తాకట్టుపెట్టేందుకు వీలులేకుండా పోయింది. స్థలాలు కేటాయించారు తప్ప పూర్తిస్థాయిలో హక్కులు కల్పించలేదు. విద్య, వైద్య అవసరాలకూ స్థలాలు అమ్ముకోలేని పరిస్థితి. కాలనీ సర్వే నంబరును నిషేధ జాబితా నుంచి తొలగించి గ్రామ కంఠంగా మార్చి, పట్టాలివ్వాలని నిర్వాసితులు కోరుతున్నారు. అలాగే గ్రామాల నుంచి గతంలో వలస వెళ్లిన 76 కుటుంబాలకూ పరిహారం, పునరావాసం కల్పించాలన్నారు. ఇటీవల ఇదే కాలనీకి చెందిన ఓ వ్యక్తి తన కుమార్తె వివాహానికి ఇంటిపై అప్పు తీసుకునేందుకు బ్యాంకుకు వెళ్తే.. సరైన పత్రాలు లేవంటూ తిరస్కరించారు. చేసేదిలేక బయట అధిక వడ్డీకి రుణం తీసుకుని పెళ్లి చేశారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన ఎందరో నిర్వాసితుల ఆవేదనిది.

**జీవనోపాధి కోల్పోయాం**భూములు కోల్పోయిన తర్వాత రైతులు జీవనోపాధికి తంటాలు పడుతున్నారు. విమానాశ్రయం పూర్తికాగానే ఉద్యోగాలు వస్తాయని చెప్పిన నాటి నేతల మాటలు కాగితాలకే పరిమితమయ్యాయి. పొలాలు పోయి, రోజువారీ కూలీలుగా మారాం.

– తాతారావు, కాలనీవాసి

**ఉన్నతాధికారులకు చెప్పాం..**ఆర్అండ్ఆర్ కాలనీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పునరావాస కాలనీలో ఇళ్లు మంజూరు చేసిన నిర్వాసితుల వివరాలను ఉన్నతాధికారులకు అందజేశాం. 22ఏ జాబితా నుంచి వీటిని తొలగించేలా చర్యలు తీసుకుంటాం. కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నాం. – తహసీల్దారు రమణమ్మ, ఇన్‌ఛార్జి ఎంపీడీవో గాయత్రి

## కాలనీనే తవ్వేసి.. ఎర్రమట్టి దోచేసి

అనంతపురం : నగరంలో సొంతిళ్లు లేని నిరుపేదలకు పక్కా ఇల్లు నిర్మించాలనే ఉద్దేశంతో పసలూరు నుంచి సిద్ధరాంపురం వెళ్లే దారిలో రైతుల నుంచి 50 ఎకరాల భూమిని కొనుగోలు చేసి లేఅవుట్ వేశారు. ప్లాట్లు వేసి రహదారులు, విద్యుత్తు సౌకర్యం కల్పించారు. ఐదేళ్లలో పునాదులు మాత్రమే నిర్మించిన వైకాపా సర్కారు.. ఇంటి నిర్మాణాలను పూర్తి చేయలేదు. ఇప్పుడా కాలనీలో ఎర్రమట్టి దోపిడీ సాగుతోంది.

**రహదారి ఛిద్రం**

టిప్పర్లు పసలూరు, కొత్తపల్లి, ఉప్పరపల్లి గ్రామాల మీదుగా అనంతపురం వైపు రాకపోకలు సాగించడంతో గ్రామానికి చెందిన దారంతా కంకరతేలి అధ్వానంగా మారింది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, గనులశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. రూ.కోట్లతో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ దారుణంగా తయారైంది.

**నగరానికి దూరం కావడంతో..**



కాలనీ అనంతపురానికి 9 కి.మీ. దూరంగా ఉండటంతో లబ్ధిదారులు వెళ్ల లేదు. ఇదే అదునుగా భావించి పసులూరుకు చెందిన కొందరు ఎర్రమట్టి వ్యాపారులతో కుమ్మక్కై జేసీబీలతో రాత్రి, పగలు తవ్వకాలు చేపట్టారు. పునాదులు, మట్టి రహదారులను ఐదారు అడుగుల లోతు తత్వారు. మట్టిని అనంతపురం నగర పరిధిలో ఏర్పాటు చేస్తున్న లేఅవుట్ల నిర్వాహకులకు విక్రయించి రూ.లక్షలు గడిస్తున్నారు.

గత వైకాపా ప్రభుత్వం బుక్కరాయసముద్రం మండలం పసలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో అక్రమార్కులు ఎర్రమట్టి కోసం బరితెగించారు. అక్కడి రహదారులు, పునాదులనూ వదల్లేదు. కొత్త ఇంటి కోసం నిర్మించిన కట్టడాల కింద ఉన్న మట్టిని తవ్వి సొమ్ము చేసుకున్నారు.

**పరిశీలించి చర్యలు తీసుకుంటాం**

– శ్రీధరమూర్తి, తహసీల్దార్, బుక్కరాయసముద్రం

కాలనీలో తవ్వకాలకు సంబంధించి సిబ్బంది చేత పరిశీలింపజేస్తాం. అక్రమార్కులను గుర్తించి చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటాం.

## అలసి.. సొలసి.. కన్నుమూసి

తిరుపతి : ఎక్కడ పుట్టారో.. ఎలా బతికారో.. ఎలాంటి కష్టం వచ్చిందో తెలియదు. జీవిత చరమాంకంలో అలిపిరి చేరుకుంటున్నారు. ఇల్లు, కుటుంబాన్ని వదిలిపెట్టి రహదారుల పక్కన దయనీయ జీవనం గడుపుతున్నారు. చివరి రోజుల్లో అండగా ఉండేవారు లేక పుణ్యం కోసం ఎవరో ఇచ్చే ఆహారం తిని అలిపిరి మార్గంలోని ఫుట్పాత్‌లపై గడుపుతున్నారు. నిత్యం రాష్ట్ర హద్దులు దాటి వచ్చి శ్రీనివాసుడి చెంతకు చేరే వారి సంరక్షణకు పాలకులూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

**ఏం చేస్తున్నారు..?**

తల్లిదండ్రులను బిడ్డలే అలిపిరి వదిలి వెళ్లిన ఘటనలు కోకొల్లలు. అనారోగ్యం బారినపడితే రుయాలో చికిత్స చేయిస్తామని తీసుకొచ్చి



వదిలించుకున్న బిడ్డలూ ఉన్నారు. చికిత్స అనంతరం ఇంటికి వెళ్లే దారి తెలియక.. వెళ్లే ఇష్టం లేక రహదారుల పక్కన ఉంటున్నారు. చివరికి అనారోగ్యంతో కదల్లేని పరిస్థితుల్లో విగతజీవులుగా మారుతున్నారు. ఒక్కోసారి మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినా స్పందించని వారూ ఉన్నారు.

అలిపిరి, తిరుపతి, తిరుచానూరు ప్రాంతాల్లో నెలకు సుమారు 30 మంది అనాథలు మృతి చెందుతున్నారు.

**కారణాలు**వృద్ధులైన తల్లిదండ్రులను భారంగా భావించడం.

అనారోగ్యంపాలైతే ఆలనాపాలనా చూసుకోలేక ఆసుపత్రిలో వదిలివెళ్లడం.

ఆస్తులు పంచాక.. పిల్లలు వృద్ధుల బాగోగులు చూడకపోవడం.

కుటుంబ సభ్యులతో గొడవలు.

భార్య చనిపోయాక ఒంటరైన భర్త ఇంట్లో ఇమడలేక.

జీవిత చరమాంకం ఆ వేంకటేశ్వరుడి సన్నిధిలో ముగించాలని.

**ఏం చేయాలి..?**

కొన్ని నగరాలు, పట్టణాల్లో నైట్ షెల్టర్లు ఉన్నాయి. వీటి నిర్వహణ బాధ్యతలు పురపాలికలు, నగరపాలికలే చూస్తుంటాయి. అనాథలు ఇలాంటిచోట్ల ఆశ్రయం పొందుతారు. ఇలాంటి షెల్టర్లు తిరుపతిలోనూ ఏర్పాటు చేస్తే వారికి నీడ కల్పించినట్లు అవుతుంది.

## ఔరా.. సౌర

తిరుపతి : ఆ విద్యాసంస్థలకు సాధారణంగా వచ్చే విద్యుత్తు బిల్లు సైతం తగ్గిపోయింది. ఎప్పటికీ తరగని సౌర విద్యుత్తును సద్వినియోగం చేసుకోవడమే దీనికి కారణం. తిరుపతి ఐఐటీ, ఐసర్ విద్యాసంస్థల్లో తరగతి గదులు, పరిశోధనా కేంద్రాలు, వసతిగృహాలతో పాటు అంతర్గత దారుల్లో వీధి దీపాలు ఇలా పూర్తిస్థాయిలో సౌరవిద్యుత్తు అందుబాటులోకి తీసుకురావడం విశేషం. విద్యాసంస్థలు ప్రారంభం నుంచే దీని వినియోగంపై దృష్టిసారించారు.

తొలిసారిగా ఇక్కడే..ఏర్పేడు సమీపంలో 548 ఎకరాల్లో తిరుపతి ఐఐటీ, శ్రీనివాసపురం సమీపంలోని సుమారు 280 ఎకరాల్లో ఉన్న ఐసర్ విస్తరించాయి. సౌర విద్యుత్తును ఉపయోగించుకోవాలన్న ఆలోచనతో భవనాలు, వాహనాల పార్కింగ్ షెడ్లపై పలకలు బిగించారు.

ఐఐటీలో తొలిసారిగా దక్షిణ ప్రాంగణంలో దీన్ని ప్రారంభించారు. ఇటీవల శాశ్వత భవనాలపై సౌర పలకలు బిగించడంతో, ప్రస్తుతం ప్రతి నెలా ఒక మెగావాట్ ఉత్పత్తి అవుతోంది.

ఐసర్‌లోనూ వివిధ భవనాలపై సౌర పలకలు ఏర్పాటుచేశారు. ఒక మెగావాట్ ఉత్పత్తి అవుతోంది.

**మరింత విస్తరణకు..**

ఇరు విద్యాసంస్థల్లో వినియోగించగా, మిగిలిన కరెంట్‌ను గ్రిడ్‌కు అందిస్తున్నారు. రూ.7.20 చొప్పున విద్యుత్తు శాఖ కొనుగోలు చేస్తోంది. ఈ మేర బిల్లులో తగ్గిస్తుండటం గమనార్హం. రానున్న రోజుల్లో దశలవారీగా 1.5 నుంచి 3 మెగావాట్లు సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసే దిశగా చర్యలు చేపట్టామని, ప్రణాళికలు సిద్ధమని ఆయా విద్యాసంస్థల ఇంజినీరింగ్ విభాగం అధికారులు తెలిపారు. మరోవైపు సౌరవిద్యుత్తు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నారు.

# ఉల్లి వరద.. కుళ్లి బురద

కర్నూలు : కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు ఏకంగా 40 వేల ఉల్లి బస్తాలు విక్రయానికి వచ్చాయి. 13, 14 తేదీల్లో మార్కెట్‌లో ఉల్లి క్రయ, విక్రయాలు నిలిచిపోవడంతో 15వ తేదీన పెద్ద ఎత్తున సరకు తీసుకొచ్చారు. సమయానికి మొత్తం 347 లాట్లలో 40,430 బస్తాల దిగుబడులు వచ్చాయి.

ఉల్లి క్వింటా కనిష్ఠ ధర రూ.100, మధ్యస్థం రూ.587, గరిష్ఠ ధర రూ.1200 పలికింది. వ్యాపారులు క్వింటా రూ.100 నుంచి రూ.587తో కొనుగోలు చేశారు. మార్క్‌ఫెడ్ గరిష్ఠ ధర రూ.1200తో కొనుగోలు చేసింది. గత వారం, పది రోజులుగా వ్యాపారులు ఇప్పటి వరకు గరిష్ఠ ధర రూ.1200కు మించి ధర రాసింది లేదు.



మార్కెట్‌కు 18,099 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు రాగా.. వ్యాపారులు 8,077 క్వింటాళ్లు మాత్రమే కొన్నారు. మిగిలిన 10,022 క్వింటాళ్ల ఉల్లిని మార్క్‌ఫెడ్ రూ.1200 మద్దతు ధరతో కొనుగోలు చేసింది. ఈ ఒక్కరోజే మార్క్‌ఫెడ్ వెయ్యి టన్నుల ఉల్లిని కొనుగోలు చేయడం గమనార్హం.

**నేడు 2500 టన్నులకు వేలం**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ఉల్లి నిల్వలను శని, ఆదివారం వేలం వేసినా 1500 టన్నుల సరకు మిగిలిపోయింది. మరో వెయ్యి టన్నులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో మొత్తం 2500 టన్నుల ఉల్లి నిల్వలున్నాయి. వీటికి బహిరంగ వేలం వేస్తున్నారు. రిటైలర్స్, హోల్‌సేలర్స్, హోటళ్ల యజమానులు, తదితరులు పాల్గొనాలని అధికారులు కోరారు.

# తూముకు తూట్లు.. భూమికి ఎసరు

నంద్యాల : రైతులకు అండగా ఉండాల్సిన పాలకులు వారిపై కక్ష కట్టారు. వైకాపా వారు కాదన్న ఉద్దేశంతో గత ప్రభుత్వం అధికారంలో ఉన్న ఐదేళ్లపాటు పొలాలకు నీరందించలేదు. ఫలితంగా 350 ఎకరాలు బీడుగా భూములుగా మారాయి. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం లేకపోయింది.

నంద్యాల శివారులోని కానాల గ్రామంలో 848.42 ఎకరాల విస్తీర్ణంలో 'నాగమ్మ చెరువు' ఉంది. పలు గ్రామాల్లోని పొలాలకు నీరందేలా నాలుగు తూములు ఏర్పాటుచేశారు. దీని కింద సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కేసీ కాలువ నిర్మాణ సమయంలో ఒక తూము ఏర్పాటుచేసి ఈ చెరువును నింపేలా కాలువ తవ్వారు. ఫలితంగా కానాల, చింతకుంట, జూలెపల్లి, పసులపాడు, గోస్పాడు, కూలూరు తదితర గ్రామాల రైతులు రెండు పంటలు పండించుకునే వెసులుబాటు కలిగింది.

**న్యాయస్థానాన్ని ఆశ్రయించారు**

అనధికార తూము నుంచి చింతకుంట, హెచ్.కొట్టాల, జూలెపల్లి గ్రామాల రైతులు నీరు తీసుకోవడంతో తమకు సరిపోవడం లేదంటూ కానాల రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అనధికారికమని చెబుతున్న నాలుగో తూము నుంచి నీరు తీసుకుంటుండటంతో ఎంతనీరు వినియోగమవుతుందో అంత నీరు అదనంగా కేసీ కాలువ నుంచి చెరువులోకి వచ్చేలా కాలువ ఇన్‌లెట్ తూము వ్యాసం పెంచాలని



న్యాయస్థానం సూచించింది. దీనిని అధికారులు అమలు చేయలేదు. కానాల రైతులు కోర్టు ధిక్కారం కింద మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని న్యాయస్థానం సూచించగా 2019లో వైకాపా ప్రభుత్వ హయాంలో నాటి అధికారులు రాజకీయ ఒత్తిళ్లతో నాలుగో తూమును మూసేసి 350 ఎకరాలకు నీరు అందకుండా చేశారు.

**కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేదు**

కానాల చెరువు తూమును శాశ్వతంగా మూసేయడంతో తమ పొలాలు బీడుగా మారుతున్నాయని చింతకుంట, హెచ్ కొట్టాల, జూలెపల్లి రైతులు గత ప్రభుత్వ హయాంలో అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ గోడును ప్రస్తుత అధికారులకు విన్నవించారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

**కన్నేసి.. మూసేసి**

చెరువుకు ఉన్న నాలుగు తూముల్లో ఒకటి అధికారిక రికార్డుల్లో లేకపోవడం చింతకుంటు, హెచ్.కొట్టాల, జూలెపల్లి రైతులకు శాపంలా మారింది. ఆ తూమును మూసేస్తే దానికి అనుసంధానమై ఉన్న కాలువ భూములు కొట్టేయొచ్చని కొందరు ప్రణాళికలు రచించారు. ఆ తూముకు అనుసంధానమై ఉన్న కాలువ ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటంతో కాలువ భూములకు మంచి ధర పలుకుతోంది. ఈ నేపథ్యంలో అనుకున్నదే తడవుగా ఆ తూము మూసేశారు. కాలువ ఎండిపోయేలా చేశారు. రహదారికి ఆనుకుని ఉన్న సర్వే నంబరు 668/2బిలోని 1.27 ఎకరాలను విజయలక్ష్మి పేరుతో ఆన్‌లైన్ నమోదు చేశారు. కాలువ భూమిని ఆమె పేరుతో ఎలా చూపుతారంటూ కొందరు రైతులు కలెక్టర్‌తోపాటు మంత్రి ఫరూక్‌కు ఫిర్యాదు చేశారు.

**రైతులకు అన్యాయం చేస్తున్నారు** శ్రీనివాసగౌడ్, రైతు, హెచ్.కొట్టాల

"వైకాపా నాయకుల ఒత్తిడితో గత ప్రభుత్వ హయాంలో జలవనరుల శాఖ అధికారులు రైతులకు తీరని ద్రోహం చేశారు. కేసీ నుంచి చెరువులోకి ఎక్కువ నీరు వచ్చేలా తూము వ్యాసాన్ని పెంచాలని న్యాయస్థానం స్పష్టమైన సూచనలు చేసినా మూడు గ్రామాల రైతులు నష్టపోయేలా తూమును శాశ్వతంగా మూసేయడం దారుణం. ప్రస్తుత ప్రభుత్వ అధికారులైనా న్యాయం చేసేలా తగిన చర్యలు తీసుకోవాలి.

# పట్టా భూమని వంక.. అమ్మాలని ఆశ



ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పట్టణం వేగంగా విస్తరిస్తోంది.. స్థలాలకు రెక్కలొచ్చాయి.. పట్టణ శివారులో రాత్రికిరాత్రే వెంచర్లు వెలుస్తున్నాయి. ఇక్కడ సెంటు స్థలం రూ.3 లక్షలు మొదలు రూ.10 లక్షల వరకు పలుకుతోంది. ఎగువ ప్రాంతంలో కొండలు ఉన్నాయి.. వాటి నుంచి వచ్చే వర్షపు నీరు దిగువకు వెళ్లడానికి వీలుగా ఏళ్ల కిందట సహజ సిద్ధంగా వంకలు ఏర్పడ్డాయి.. వాటిని పట్టాదారులు పూడ్చేసి ప్లాట్లుగా మార్చుతున్నారు. నిబంధనల ప్రకారం వంకలను పూడ్చినా.. విక్రయించినా వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలి. పుర, రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడంతో యథేచ్ఛగా పూడ్చేస్తున్నారు. ఇళ్ల స్థలాలుగా మార్చి విక్రయిస్తున్నారు. వంకలను పూడ్చడంతో సాయినగర్, సున్నంబట్టీ వీధి, రామలక్ష్మమ్మ కాలనీ, లక్ష్మణ్‌టాకీస్ ఏరియా, భీమన్ననగర్, 27వ వార్డు, ధోబిఘాట్ ఏరియా, చంద్రయ్యకొట్టాల, సంజీవ్‌నగర్, ఇతర కాలనీల్లో నిత్యం సమస్య తలెత్తుతున్నాయి. వర్షం వస్తే దాదాపు 30 వేల మందికి పైగా నివసిస్తున్న కాలనీలు నీట మునుగుతున్నాయి. ఎమ్మిగనూరు పట్టణ శివారులో సర్వే నంబరు 459 నుంచి 469 వరకు సుశీలమ్మ కొండ వంక విస్తరించి ఉంది. మొత్తం ఒక కి.మీ.మేర 80 అడుగుల వెడల్పుతో ఉండేది. పట్టా భూములుగా చెప్పి వంకనూ పూడ్చేశారు. 3 అడుగుల మేర పిల్ల కాల్వ మాదిరిగా చేశారు. సెంటు రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు విక్రయించారు. ఇక్కడ 28 వరకు ప్లాట్లు వేసి రూ.కోట్లు వెనకేసుకొన్నారు. చిన్నపాటి వర్షం వచ్చినా కాలనీ మొత్తం భారీగా నీరు నిల్వ ఉంటోంది.

గుడేకల్ ప్రాంతం నుంచి వచ్చే నీరు నల్లవాగులో పారుతోంది. 80-100 అడుగుల మేర వెడల్పు ఉన్న ఈ వంకను పూడ్చి ఇళ్ల స్థలాలుగా మార్చారు. ప్రస్తుతం ఆరు అడుగులకు పరిమితమైంది. ఇక్కడ 15 వరకు ప్లాట్లుగా చేసి సెంటు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ధర ఖరారు చేసి విక్రయించారు. ప్రస్తుతం నివాసాలు వెలుస్తున్నాయి. వర్షం వస్తే కాలనీ మొత్తం చెరువును తలపిస్తోంది.

**ఇక్కడ ఆక్రమించారు** శిల్పా ఎస్టేట్ వెనుక సర్వే నంబరు-495లో 2.2 ఎకరాల్లో 120 అడుగుల వెడల్పుతో ఉండే వంక ఇప్పుడు రూపు కోల్పోయింది. ఇళ్ల స్థలాలు వేసి సెంటు రూ.లక్షల వరకు విక్రయించారు. దాదాపు రూ.ఐదారు కోట్లు సొమ్ము చేసుకొన్నారు.

వెంకటాపురం నుంచి విద్యుత్తు సబ్ స్టేషన్ వరకు 50 అడుగుల వెడల్పుతో ఉండే వంకను ప్లాట్లు వేసి ఆక్రమించుకున్నారు.

కమిటీ రోడ్డులో 40 అడుగుల వెడల్పుతో ఉండే వంక అక్రమ కట్టడాలతో మూసుకుపోయింది. వ్యవసాయ మార్కెట్‌లోని వర్షం నీరు ఈ వంకలో పారాలి. అన్యాక్రాంతం కావడంతో నీళ్లు మార్కెట్‌లోనే నిలిచి రైతుల పంట ఉత్పత్తులు తడిసిపోతున్నాయి.

# నైపుణ్యా పోటీ.. భవితకు దివిటీ



కర్నూలు : ప్రస్తుత పోటీ ప్రపంచంలో నైపుణ్యాలే ఉజ్వల భవిష్యత్తుకు సోపానాలుగా నిలుస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో చదువుతో సంబంధం లేకుండా వివిధ వృత్తులు, సాంకేతిక అంశాల్లో నైపుణ్యం కలిగిన వారిని గుర్తించి ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంతర్జాతీయ స్థాయి పోటీలో దేశానికి ప్రాతినిధ్యం వహించే సదవకాశం కల్పిస్తోంది. ఈ నైపుణ్య పోటీలో జిల్లా యువత ఉత్సాహంగా పాల్గొని సత్తా చాటాలని కర్నూలు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్‌రాజ్‌కుమార్ కోరారు. ప్రతిభావంతులకు ఇది సరైన వేదిక అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు.

**ప్రతి స్థాయిలో ప్రోత్సాహకం**

వరల్డ్ స్కిల్స్- 2025 పోటీలను తొలుత జిల్లా, జోనల్‌స్థాయిలో నిర్వహిస్తారు. విజేతలు ఒక్కో మెట్టు ఎక్కుతూ రాష్ట్రం, రీజినల్, ప్రీ నేషనల్, జాతీయ, అంతర్జాతీయ స్థాయి వరకు వెళ్తారు. ప్రతి పోటీలోనూ విజేతలకు ప్రోత్సాహకాలు అందజేస్తారు. స్కిల్ ఇండియా, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, వరల్డ్ స్కిల్స్ ఇండియా.. ఈ మూడు విభాగాల భాగస్వామ్యంలో ఈ పోటీలను నిర్వహించనున్నారు.

**3,273 మంది నమోదు**

రాష్ట్ర వ్యాప్తంగా ఈ పోటీ పరీక్షలకు 50 వేల మందిని సన్నద్ధం చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఒక్కో జిల్లా నుంచి 2 వేల మంది చొప్పున ఇండియా స్కిల్స్ కాంపిటీషన్-2025లో పోటీ పడేలా నైపుణ్యాభివృద్ధి సంస్థ కసరత్తు చేస్తోంది. ఈనెల 12వ తేదీ వరకు ఉమ్మడి జిల్లాలో 3,273 మంది యువత రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

**వీరూ పోటీ పడొచ్చు**

మరో 50 ట్రేడ్‌లకు 2004 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. వీరికి విద్యార్హత ప్రామాణికం కాదు. పది, ఇంటర్, డిగ్రీ ఆపై చదివిన వారెవరైనా అర్హులే.

బ్రిక్లియింగ్, కార్పెంటరీ, క్యాబినెట్ మేకింగ్, కాంక్రీట్ కన్‌స్ట్రక్షన్ వర్క్, ల్యాండ్ స్కేపింగ్ గార్డెనింగ్, పెయింటింగ్ అండ్ డెకొరేటింగ్, ప్లంబింగ్ అండ్ హీటింగ్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్, వాల్ అండ్ ఫ్లోర్ టైలింగ్, జువెలరీ, గ్రాఫిక్ డిజైనింగ్ టెక్నాలజీ, డిజిటల్ ఇంటరాక్టివ్ మీడియా, వెబ్ టెక్నాలజీస్, సాఫ్ట్‌వేర్ టెస్టింగ్, కెమికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ, సీఎన్‌సీ మిల్లింగ్, ఇండస్ట్రియల్ మెకానిక్స్, ఇండస్ట్రియల్ కంట్రోల్, మెకానికల్ ఇంజినీరింగ్ సీఏడీ, రెన్యూవబుల్ ఎనర్జీ, వెల్డింగ్, బేకరీ, బ్యూటీ థెరపీ, కుకింగ్, హెల్త్ అండ్ సోషల్ కేర్, హోటల్ రిసెప్షన్, ఆటో బాడీ రిపేర్, కార్ పెయింటింగ్, హెవీ వెహికల్ టెక్నాలజీ, ఫ్యాషన్ టెక్నాలజీ, ఫ్లోరిస్ట్రీ, ఎలక్ట్రానిక్స్, రెస్టారెంట్ సర్వీస్, రిటైల్ సేల్స్ వంటి కోర్సుల్లో వీరు పోటీ పడొచ్చు.

పోటీ : ఇండియా స్కిల్స్ కాంపిటీషన్- 2025

నిర్వహణ: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ

ఎన్ని అంశాల్లో : మొత్తం 63 ట్రేడ్లు

దరఖాస్తులు ఇలా.. స్కిల్ ఇండియా డిజిటల్ హబ్ వెబ్‌సైట్ %www.skillindiadigital.gov.in% లోకి వెళ్లాలి. వ్యక్తిగత వివరాలు, విద్యార్హత, ఏయే విభాగాల్లో పోటీ పడుతున్నారో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

అర్హత : 13 ట్రేడ్‌లకు 2001 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులు. వీరికి డిజిటల్ కన్‌స్ట్రక్షన్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఇండస్ట్రియల్ డిజైన్ టెక్నాలజీ, ఇండస్ట్రీ 4.0, మెకట్రానిక్స్, రోబోట్ సిస్టమ్ ఇంటిగ్రేషన్, వాటర్ టెక్నాలజీ, డెంటల్ ప్రోస్థటిక్స్, ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, ఆడిటివ్ మాన్యుఫ్యాక్చరింగ్ వంటి విభాగాల్లో పోటీ ఉంటుంది.

చివరి తేదీ : ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

# నిధి సమకూరక.. పుర ప్రగతి తప్పింది

నంద్యాల : పుర అధికారుల అవగాహన లేమి అభివృద్ధి పనులపై పడింది.. నిధులున్నా పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో పుర ఆదాయమంతా సీఎఫ్ఎంఎస్‌కు జమ చేసేవారు. అక్కడి నుంచి నిధులు విడుదల చేస్తేనే స్థానికంగా అభివృద్ధి పనులు చేయాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎఫ్ఎంఎస్ విధానాన్ని పక్కనపెట్టి 'నిధి' పోర్టల్‌ను తీసుకొచ్చింది. అభివృద్ధి పనులకు సంబంధించి స్థానికంగానే బిల్లులు చెల్లించే విధానాన్ని కల్పించారు. ఆయా ప్రాంతాల్లో వచ్చిన ఆదాయంతోనే బిల్లులు చెల్లించాలన్న నిబంధన పెట్టింది. ఉమ్మడి జిల్లాలోని ఏ పురపాలక సంఘం కూడా ప్రభుత్వం కల్పించినా అవకాశాన్ని వినియోగించుకోలేదు.

**పాత బిల్లులకు 'రాంరాం'**

'నిధి' పోర్టల్‌లో పాత బిల్లులను అప్‌లోడ్ చేయడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి వచ్చిన ఆదాయంతోనే బిల్లులు చెల్లించాలన్న నిబంధనను ప్రభుత్వం విధించింది. దీంతో పాత బిల్లులపై మున్సిపాలిటీలు దృష్టి సారించడం లేదు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోనే పాత బిల్లులు రూ.80 కోట్ల వరకు ఉన్నాయి. నంద్యాలలో రూ.25 కోట్లు, ఆదోని రూ.20 కోట్లు, ఎమ్మిగనూరు రూ.8 కోట్లు, డోన్ రూ.5 కోట్లు, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు మున్సిపాలిటీలకు కలిపి రూ.6 కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

**ఆశీస్సులుంటేనే..**

నంద్యాల మున్సిపాలిటీలో పాత బిల్లులకు మోక్షం కలగాలంటే అస్మదీయ గుత్తేదారులైతే సరి.. లేకుంటే 'పెండింగ్'లో పెట్టాలన్న ఆదేశాలున్నాయి. ఆళ్లగడ్డ, ఆత్మకూరు, నందికొట్కూరు పురపాలక సంఘాల పరిధిలో బిల్లులు రావాలంటే ఎంతో కొంత ఇచ్చుకోవాల్సిందే. ఆదోని, ఎమ్మిగనూరు, డోన్‌లో సిఫార్సులుంటే చాలు.. కర్నూలులో ఓ నాయకుడి ఆశీస్సులు ఉన్నవారికే బిల్లులు వస్తున్నాయన్న ఆరోపణలున్నాయి.

**నమోదు చేయకనే తంటాలు**

ఈ ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలలపాటు పన్నులు, రుసుములు, జరిమానా, అనుమతుల ద్వారా వచ్చిన నిధులను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయలేదు. నంద్యాల పురపాలక సంఘానికి ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.5 కోట్లు వచ్చింది. కర్నూలు నగరపాలక సంస్థకు రూ.20 కోట్లు, ఆదోని రూ.3 కోట్లు, ఎమ్మిగనూరు రూ.కోటి, డోన్ పురపాలక సంఘానికి రూ.కోటి ఆదాయం వచ్చినా ఉపయోగించుకోలేని పరిస్థితి.

రహదారులు, కాలువలు, తాగునీటి పైపులైన్లు, పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణ తదితరాలు చేశారు. పనులు పూర్తైనప్పటికీ గుత్తేదారులకు బిల్లులు రాలేదు. కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ఏడాది కాలంలో రూ.25 కోట్ల పనులు జరిగాయి. నంద్యాల మున్సిపాలిటీలో రూ.10 కోట్లు, ఆదోని రూ.8 కోట్లు, ఎమ్మిగనూరు రూ.3 కోట్లు, ఆత్మకూరు, నందికొట్కూరు, ఆళ్లగడ్డ పురపాలక సంఘాల పరిధిలో ఒక్కోచోట రూ.కోటి విలువైన పనులు చేశారు.

# గుంతకల్లు, గుత్తి రైల్వే జంక్షన్లకు మహర్దశ

గుంతకల్లు : రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు, స్టేషన్ల గుండా సకాలంలో రైళ్లు బయలుదేరి వెళ్లేవిధంగా చూడడానికి గుంతకల్లు, గుత్తి రైల్వే జంక్షన్లలో అత్యాధునిక వసతులు సమకూర్చనున్నారు. దీనికి గాను రూ. 47.69 కోట్లు కేటాయించి గుత్తేదారులకు ఆయా పనులు అప్పగించే ప్రక్రియను పూర్తి చేశారు. గుంతకల్లు జంక్షన్‌లో అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. పనులు పూర్తయితే గుత్తి, గుంతకల్లు జంక్షన్లలో మెరుగైన సౌకర్యాలు ప్రయాణికులకే కాకుండా రైల్వే సిబ్బందికి సమకూరనున్నాయి. స్టేషన్లలో పనులు చేపట్టడానికి అవసరమైన నిధుల కోసం గత 20 ఏళ్ల నుంచి నుంచి ఎదురు చూస్తుంటే రైల్వే బోర్డు ప్రస్తుతం నిధులు కేటాయించడం శుభపరిణామం.

**క్షేత్రస్థాయిలో చకచకా పనులు**



గుత్తి రైల్వే జంక్షన్‌లో ప్లాట్‌ఫాంల నిర్మాణం, షెల్టర్ల ఏర్పాటు, వంతెనల నిర్మాణం, అదనపు రైల్వేలైన్లు, గదుల నిర్మాణ పనులను చేపడుతున్నారు. గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో యార్డు విస్తరణ, స్టేషన్ భవనాల నిర్మాణంతో పాటు స్టేషన్‌లోని అన్ని రైల్వేలైన్ల అనుసాధానం పనులు చేపడుతున్నారు. కొత్తదైన ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఇప్పుడు స్టేషన్‌లో ఉన్న మూడు సిగ్నలింగ్ క్యాబిన్లను తొలగించి వాటిని ఒకే గదిలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకుకోసం ఇప్పటికే స్టేషన్‌లో రూ. 3 కోట్లు ఖర్చు చేసి సిగ్నలింగ్ క్యాబిన్ భవాలను నిర్మించారు. యార్డుల విస్తరణ పూర్తయితే తప్పా సిగ్నలింగ్ వ్యవస్థలో మార్పులు చేయడానికి అవకాశం లేదని విస్తరణ పనులను చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. కొత్త వ్యవస్థ ఏర్పాటైతే కంప్యూటర్ల సాయంతో సిగ్నళ్లు పనిచేస్తాయని అధికారులు పేర్కొన్నారు. రైలు ప్రమాదాలు జరగడానికి, రైళ్లు డేంజర్ సిగ్నళ్లను దాటే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. లైన్ల అనుసంధాన పనులను చేయడానికి స్టేషన్‌లోని పాత బుకింగ్ కార్యాలయానికి చెందిన భవనాలు పూర్తిగా తొలగించనున్నారు.

# నైపుణ్యాభివృద్ధిమస్తు.. ఉద్యోగ ప్రాప్తిరస్తు..!

మద్దిలపాలెం : ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులకే కొలువులు దొరకని రోజులివి. ఇక సాధారణ డిగ్రీ చేసిన విద్యార్థుల పరిస్థితి ఏమిటి..? వారికి ఉద్యోగాలు ఎలా వస్తాయి.. ఈ ప్రశ్నలకు జవహర్ విజ్ఞాన కేంద్రాలు (జేకేసీలు) సమాధానాలు చెబుతున్నాయి. డిగ్రీ విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇచ్చి ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దుతున్నారు. 2006లో రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాలల్లో వీటిని ప్రారంభించింది. అందులో మద్దిలపాలెం డాక్టర్ వీఎస్‌కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కేంద్రం కూడా ఉంది.

**ఒక్కో బ్యాచ్‌కు మూడు నెలలు:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎటువంటి ఫీజు చెల్లించకుండా జేకేసీలో శిక్షణ పొందవచ్చు. మూడు నెలలపాటు బ్యాచ్‌కి 60 మంది చొప్పున ఏడాదికి 240 మంది వీఎస్‌కృష్ణా కళాశాల జేకేసీలో శిక్షణ పొందుతున్నారు.

నిపుణులైన మెంటార్లు విద్యార్థుల్లో కమ్యూనికేషన్, విశ్లేషణాత్మక నైపుణ్యాల పెంపుదలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సాఫ్ట్ స్కిల్స్, రీజనింగ్, అర్థమెటిక్‌లో మెలకువలు నేర్పిస్తున్నారు. ఎంపిక చేసిన అంశంపై బృంద చర్చలు ఏర్పాటు చేసి ఆంగ్లభాష నైపుణ్యాలు పెంచుకునేలా, వేదికలపై భయం లేకుండా మాట్లాడేలా తర్ఫీదు ఇస్తున్నారు. రోజు రెండు గంటలపాటు తరగతులు ఉంటాయి. ఒక గంట థియరీ, మరో గంట ప్రాక్టికల్స్.

కంప్యూటర్ కోర్సులు, వ్యక్తిత్వ వికాస తరగతులు: ప్రస్తుతం యువత ఏ ఉద్యోగంలో చేరాలన్నా కనీసం కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. అందుకే ఇక్కడ విద్యార్థులకు ఎం.ఎస్.ఆఫీస్, ఇంటర్నెట్, సీ లాంగ్వేజ్



లాంటి కోర్సులు నేర్పిస్తున్నారు. ఉద్యోగ సాధనలో వ్యక్తిత్వ వికాసం కీలకపాత్ర పోషిస్తున్న నేపథ్యంలో నిపుణులతో వ్యక్తిత్వ వికాస తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వివిధ సంస్థలు ఉద్యోగాలు మేళాలు ఏర్పాటు చేస్తున్నాయి.

**పేద విద్యార్థులకు వరం..**

– సౌజన్య, వీఎస్‌కృష్ణా కళాశాల పూర్వ విద్యార్థిని

వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో బీకాం చదువుతూ జేకేసీలో శిక్షణ తీసుకున్నా. ఉద్యోగ మేళాలో ప్రతిభ చూపడంతో బెంగళూరులోని ఫ్లిప్‌కార్టు సంస్థలో ఉద్యోగం వచ్చింది. జేకేసీలో శిక్షణతో నైపుణ్యాలు పెరిగాయి.

**గ్రామీణ ప్రాంత యువతకు ఉపయుక్తం**

– డాక్టర్ జి.శ్రీనివాసరావు, జేకేసీ కోఆర్డినేటర్

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు జేకేసీ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతోంది. మూడు నెలల్లో వారిలో నైపుణ్యాలు పెరిగేలా తర్ఫీదు ఇస్తున్నాం. నమూనా ఇంటర్వ్యూలు నిర్వహించి ఆత్మవిశ్వాసం పెరిగేలా చూస్తున్నాం.

## ఈ-పంట నమోదు 19 శాతమే

పుట్టపర్తి :శ్రీసత్యసాయి జిల్లాలో ఈ-పంట నమోదు ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. పంటల సాగుతో సంబంధం లేకుండా ప్రతి ఎకరా భూమిని సర్వే నంబర్ల ఆధారంగా వివరాలు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో భూముల వివరాలు లాగిన్‌లలో పూర్తిస్థాయిలో కనిపించక పోవడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు. వివిధ కారణాలతో ఇప్పటి వరకు జిల్లాలో 19 శాతం మాత్రమే నమోదు చేశారు. ఈ నెలాఖరులోపు పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసి తుది జాబితా తయారు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. నిర్దేశించిన గడువుకు ఇంకా 15 రోజులే సమయం ఉంది. ఆ లోపు 10 లక్షల ఎకరాల పంట వివరాలను నమోదు చేయాల్సి ఉంది. మండల వ్యవసాయాధికారులు, సహాయకులు అందరూ కొన్ని రోజులుగా యూరియా సరఫరా విధుల్లోనే ఉండిపోయారు. ప్రస్తుతం ఆ సమస్య ఓ కొలిక్కి రావడంతో అధికారులు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

**ఇబ్బందులు ఇలా..** చుక్కల భూములు, డీపట్టా, అసైన్డ్ అటవీ భూముల



వివరాలు వీఆర్వో, వీఏఏల లాగిన్‌లలో పూర్తిస్థాయిలో కనిపించక పోవడంతో ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

సాంకేతిక కారణాలతో వెబ్‌ల్యాండ్‌లో భూముల వివరాలు కనిపిస్తున్నా, ఈ-పంట వివరాలు నమోదు కావట్లేదు. గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే వల్ల కూడా సమస్యలు తలెత్తుతున్నాయి. యూరియా కొరతపై సిబ్బంది దృష్టి పెట్టడంతో ఈ ప్రక్రియ మందగించింది.

**నెలాఖరుకు పూర్తి చేస్తాం - రామునాయక్, జేడీఏ**

నెలాఖరు నాటికి జిల్లాలో ఈ-పంట నమోదు ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే మండల వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేశాం. గ్రామాల్లో వీఏఏలకు రైతులు సహకరించాలి. రైతులు స్వచ్ఛందంగా నమోదు చేయించుకోవాలి.

జిల్లాలో మొత్తం విస్తీర్ణం : 12,96,586 (ఎకరాలు)
సాగైన పంటల విస్తీర్ణం : 2,27,240
ఈ-పంట నమోదు : 2,23,966

## బతుకు నాడి పట్టారు

నాయుడుపేట : మారుమూల పల్లెటూరు జీలపాటూరు. వ్యవసాయమే జీవనాధారం. అందరూ ఆదర్శ రైతులే. తల్లిదండ్రులు తమ పిల్లల్ని సెలవు రోజుల్లో తమ వెంట పొలాల్లోకి తీసుకెళ్లేవారు. పిల్లల్ని పొలం గట్లపై కూర్చోమని పెద్దలు తాము పడుతున్న కష్టాన్ని వాళ్లకు చూపించారు. పిల్లలు కసి, పట్టుదలతో చదివేలా వెన్నుతట్టారు. పోటీతత్వాన్ని నూరిపోశారు. అంతే ఆ గ్రామంలో ప్రస్తుతం 30 మంది వైద్యులుగా మారారు. పెళ్లకూరు మండలం జీలపాటూరు పంచాయతీలో 360 ఆవాసాలున్నాయి. 1400 మంది పైగా జనాభా ఉన్నారు. పూర్తిగా వ్యవసాయ ఆధారిత గ్రామం. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చిన్నతనం నుంచి కష్టపడి చదివి మెడిసిన్ పూర్తిచేశారు.



ఒకరిని చూసి మరొకరు పోటీతత్వంతో చదువులో రాణించారు. ఏటా ఇక్కడ ఇద్దరు ముగ్గురు వైద్యం అభ్యసిస్తున్నారు. ఒక్కో ఇంట్లో ముగ్గురు నలుగురు చొప్పున వైద్యులుగా కొనసాగుతున్నారు. కొందరు సొంతూరులో సేవలందిస్తున్నారు.

**చదువు మా గ్రామాన్ని మార్చేసింది**

చదువే మా గ్రామాన్ని మార్చేసింది. ఇక్కడ 75 మంది ఇంజినీర్లు, 50 మంది ఆదర్శ రైతులున్నారు. 10-20 మంది వరకూ ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఎకరా 40-50 బస్తాల వరకూ పండిస్తారు. పిడికెడెంత పల్లెటూరులో ఎంతోమంది ప్రతిభావంతులు తయారయ్యారు.- శివకుమార్, సర్పంచి

## రెస్కోకు మస్కా.. విచారణకు మసక

అనకాపల్లి : అనకాపల్లి గ్రామీణ సహకార విద్యుత్తు సంస్థలో (రెస్కో) అక్రమాలు, అడ్డగోలు వ్యవహారాలపై ఎంతకీ నిగ్గుతేల్చడం లేదు. సంస్థను తూర్పుప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థలో (ఈపీడీసీఎల్) విలీనం చేసినప్పుడే పలు అవకతవకలు గుర్తించారు. అప్పట్లో సహకార శాఖ అధికారిని పర్సన్ ఇన్‌ఛార్జిగా పెట్టుకుని వైకాపా నేతలు దందాలు నడిపారు. విద్యుత్తు ఉపకరణాల కొనుగోలు, సిబ్బంది నియామకాల్లో రూ. కోట్లు దిగమింగారు. కొంతమంది సిబ్బంది విధులకు రాకుండానే నెలనెలా జీతాలు తీసుకున్నారు. గత ప్రభుత్వంలో ఇలా లెక్కకు మిక్కిలిగా అక్రమాలు జరిగినా వైకాపా నేతల ఒత్తిళ్లతో అధికారులు నిజాలను దాచిపెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర దాటుతున్నా ఇప్పటికీ ఈ అక్రమాలపై పూర్తిస్థాయిలో విచారణకు ఆదేశించడం లేదు. ముందుకు సాగని విచారణ... రెస్కోలో కంటింజెన్సీ పేమెంట్ వర్కర్ (సీపీడబ్ల్యూ) పేరుతో 450 మంది సిబ్బంది ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. గత ప్రభుత్వంలో అవసరం లేకున్నా ఒక్కొక్కరి నుంచి రూ. 4 లక్షల చొప్పున తీసుకుని ఒప్పంద పద్ధతిలో నియమించుకున్నారు. రెస్కోను ఈపీడీసీఎల్‌లో విలీనం చేసిన తర్వాత కూడా 30 మందిని పైగా ఇష్టం వచ్చినట్లు నియమించుకున్నారు. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా నియామకాలు జరగడంపై డిస్కం అభ్యంతరం తెలిపింది. దీంతో అప్పట్లో కొంతమందిని తప్పించేశారు. మరికొంత మంది విధులు నిర్వర్తిస్తున్నారని వెనకేసుకొచ్చారు. పూర్తిస్థాయిలో పరిశీలన చేయకుండా ఈపీడీసీఎల్ ఏఈ, ఏడీలు ఇచ్చిన నివేదికతో సరిపెట్టేశారు. వైకాపాకు చెందిన ముఖ్య నేత, రెస్కో మాజీ ఛైర్మన్ దగ్గరి బంధువు ఒకరు గత ఐదేళ్లు విధులకు వెళ్లకుండా జీతం పొందారన్న ఫిర్యాదులున్నాయి. ఇతడే కాదు, ఎటువంటి పనులు చేయకుండా జీతాలు తీసుకున్న సిబ్బంది కూడా చాలామంది ఉన్నారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వీటిపై కొరడా ఝుళిపించకుండా కాలయాపన చేయడంపై పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

సమగ్ర విచారణ చేస్తున్నాం... నిబంధనలకు విరుద్ధంగా సిబ్బందిని నియమించారన్న అంశం కోర్టులో ఉండటంతో విచారణ ఆలస్యమైంది. ఇటీవల కోర్టు అనుమతులు వచ్చాయి. తుమ్మపాల చక్కెర కర్మాగారం ఎండీ శాస్త్రి విచారణ చేయనున్నారు. చాలామందిపై ఆరోపణలు ఉన్నాయి.

## కాగితాల్లోనే టమాటా ప్రాసెసింగ్



అనంతపురం: నిలకడలేని ధరలతో ఏటా నష్టాలు మూటగట్టుకుంటున్న టమాటా రైతుల్ని ఆదుకోవడం కోసం జిల్లాలో ఆహారశుద్ధి పరిశ్రమ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు దశాబ్దకాలంగా కాగితాలకే పరిమితవుతున్నాయి. కళ్యాణదుర్గంలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలు 2012 నుంచే జరుగుతున్నా కార్యరూపం దాల్చలేదు.

**ప్రతిపాదనలకే పరిమితం**

కళ్యాణదుర్గం పరిధిలో రోజుకు 50 టన్నులు ప్రాసెస్ చేసేలా పరిశ్రమ, 100 టన్నుల సామర్థ్యంతో రెండు శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన చాలా ఏళ్లుగా ఉంది. 2013లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం యూనిట్ ఏర్పాటుకు తిమ్మసముద్రంలో భూముల్ని పరిశీలించింది.

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు.. ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల జరిగిన డీఆర్సీ సమావేశంలోనూ ఇన్‌ఛార్జి మంత్రి టీజీ భరత్ దృష్టికి తీసుకెళ్లారు.

**కర్నూలులో సాకారం దిశగా..**

గత వైకాపా ప్రభుత్వం కర్నూలు జిల్లా పత్తికొండలో రూ.12 కోట్లతో టమాటా ప్రాసెసింగ్ యూనిట్ మంజూరు చేసింది. భూమిపూజ చేసి చేతులు దులుపుకొంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లింది. ఇటీవల పనులు మొదలుపెట్టారు. ఇదే క్రమంలో అనంతపురం జిల్లాలోనూ ప్రాసెసింగ్ యూనిట్ల అవసరంపై ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. కళ్యాణదుర్గంతో పాటు అనంతపురం, రాప్తాడు ప్రాంతాల్లోనూ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

**ఏటా 3 లక్షల టన్నులు**

ఉమ్మడి జిల్లాలో 60 వేల ఎకరాల్లో టమాటా సాగు చేస్తున్నారు. ఏటా 3 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది.

అనంతపురంలో మార్కెట్ ఉన్నప్పటికీ దిగుబడి సమయానికి ధరలు పడిపోతున్నాయి. ఒక్కోసారి 15 కిలోల బాక్సు రూ.30 మించి ధర పలకడం లేదు. టమాటా గుజ్జు, సాస్, జ్యూస్ తయారీ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే గిట్టుబాటు ధరలు లభిస్తాయి.

## మ్యాజిక్‌తో మురుగు మరుగు!



ఉరవకొండ: గ్రామాల్లో స్వచ్ఛతతోపాటు భూగర్భ జలాల పెంపునకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో ప్రయోగాత్మకంగా మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణానికి రంగం సిద్ధం చేసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మురుగు సమస్య అధికంగా ఉన్న ఎనిమిది గ్రామాల్లో నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు. ఈ డ్రెయిన్లతో మురుగు ఎక్కడికక్కడే సులువుగా భూమిలోకి ఇంకుతుంది. దీంతో పారిశుద్ధ్య సమస్య తలెత్తదు. దోమల బెడద తగ్గనుంది.

అనంత జిల్లాలో 660 మీటర్లు, శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 820 మీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లను నిర్మించనున్నారు. ఇందుకు రూ. 8. 85 లక్షల ఉపాధి హామీ పథకం నిధులు మంజూరయ్యాయి. ఈ ప్రక్రియను వచ్చేనెల 2 నాటికి పూర్తిచేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభిస్తామని డ్వామా అనంతపురం పీడీ సలీంబాషా తెలిపారు.

**ఖర్చు తక్కువ.. ప్రయోజనాలు ఎక్కువ**

రెండు అడుగుల లోతు, అర మీటరు వెడల్పుతో కాలువను తవ్వుతారు. కింద భాగంలో 150 ఎంఎం కంకరను 30 సెం.మీ., మధ్యలో 40 ఎంఎం కంకరను 20 సెం.మీ, పై పొరలో 20 ఎంఎం కంకరను 10 సెం.మీ వేస్తారు. కాలువకు ఇరువైపులా బండలను పాతుతారు. దీంతో ఎక్కడి మురుగు అక్కడే ఇంకిపోతుంది.

వర్షాలు అధికమై నీరు బయటికి వచ్చే పరిస్థితుల్లో 50 మీటర్లకు ఒకటి చొప్పున ఇంకుడు గుంతను తవ్వుతారు.

సాధారణంగా 100 మీటర్ల సిమెంటు డ్రెయిన్‌ను నిర్మించాలంటే రూ. 4 లక్షలు ఖర్చు అవుతుంది. ఇదే పరిమాణంలో మ్యాజిక్ డ్రైయిన్ నిర్మాణానికి రూ. 75 వేలల్లోనే పూర్తవుతుంది.

ప్రధానంగా శుభ్రతతోపాటు వర్షపు నీటిని ఒడిసి పట్టవచ్చు.

## కాసుల దాహానికి.. కరుగుతున్న కొండలు



పుట్టపర్తి : కొండలు, గుట్టలను అక్రమార్కులు యథేచ్ఛగా కరిగించేసి సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా రహదారుల నిర్మాణంలో నిబంధనల అతిక్రమణ జరుగుతోంది. ఎన్‌హెచ్ 342, 42తోపాటు గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణం జరుగుతోంది. వాటి నిర్మాణాన్ని ఎవరూ కాదనరు. ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా కొల్లగొట్టడంపైనే సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. గుత్తేదారులు నిబంధనలు పాటించి పనులు పూర్తి చేయాలి. కొందరు సమీపంలో ఉండే కొండలు, గుట్టలను తవ్వేసి.. మట్టి, రాళ్లను తరలిస్తున్నారు.

ఎన్‌హెచ్ 42 పనులు బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వరకు పూర్తికాగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొండలను కరిగించి మట్టిని వాడుకున్నారు. బెంగళూరు నుంచి విజయవాడకు వెళ్లేందుకు ఉద్దేశించిన గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రకాశం జిల్లా నుంచి మొదలై పులివెందుల మీదుగా తలుపులలో జిల్లాలోకి ప్రవేశిస్తుంది. ముదిగుబ్బ, నల్లమాడ, పుట్టపర్తి, గోరంట్ల మీదుగా కొడికొండ చెక్‌పోస్టు వరకు వెళ్లి ఎన్‌హెచ్ 44లో కలుస్తుంది. నల్లమాడ మండలం రెడ్డిపల్లి వద్ద జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనులకు సమీపంలోని పీతరకుంట, రెడ్డిపల్లి చెరువుల్లో మట్టిని తోడేసి వాడుకున్నారు. మీసాలవాండ్లపల్లి వద్ద గుట్టను తవ్వారు. ముదిగుబ్బ నుంచి బుక్కపట్నం, పుట్టపర్తి, గోరంట్ల, చిలమత్తూరు మండలంలో కోడూరు వరకు ఎన్‌హెచ్ 342 వెళుతుంది. అక్కడ ఎన్‌హెచ్ 44లో కలుస్తుంది. ముదిగుబ్బ-పుట్టపర్తి వరకు మొదటి విడత 80 శాతం, పుట్టపర్తి నుంచి కోడూరు వరకు 70 శాతం పనులు జరిగాయి. ప్రస్తుతం ముదిగుబ్బలో బైపాస్ నిర్మాణం జరుగుతోంది.

**రాయల్టీ చెల్లించాల్సిందే..**

- ఓబుళరెడ్డి, మైనింగ్ శాఖ ఏడీ

అలైన్‌మెంట్ పరిధిలోకి వచ్చే మట్టి, రాళ్లను పనులు జరిగే ప్రదేశంలో వాడుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. సమీపంలోని కొండలు, గుట్టలు, చెరువులు తవ్వితే ప్రభుత్వానికి రాయల్టీ చెల్లించాల్సిందే. ఎక్కడైనా చెల్లించకపోతే థర్డ్‌పార్టీ తనిఖీలు చేసి బిల్లుల్లో కోత విధిస్తుంది.

**ఇంజినీర్లు ఏమంటున్నారంటే..**

రహదారుల నిర్మాణానికి అవసరమైన మట్టి.. పనులు చేసేచోటే లభిస్తోంది. ఎక్కడైనా అవసరమైతే రైతులతో మాట్లాడుకుని ఒప్పందం మేరకు తవ్వుతున్నారు.

## నాడి పట్టే వారేరీ?

కదిరి : పేదల వాడలు, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించాలన్న ఉద్దేశంతో ప్రారంభించిన ప్రాథమిక, అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నివాసాల మధ్య మురుగునీరు నిల్వ ఉంటోంది. వీటివల్ల దోమల ఉద్ధృతి పెరిగి జ్వరాల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రోజూ సరాసరిన 60 మంది రోగులు వస్తుంటారు. వీరితోపాటు గర్భిణులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడేవారు చికిత్స కోసం వస్తుంటారు. ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు లేనికారణంగా సిబ్బంది ప్రథమ చికిత్స చేసి మందులు ఇచ్చి పంపుతున్నారు. రోగం తగ్గని స్థితిలో ప్రైవేటు వైద్యశాలలకు వెళ్తున్నట్లు బాధితులు వాపోతున్నారు.

**ఇన్‌ఛార్జిలే దిక్కు..** కదిరి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు రోగులకు అందుబాటులో ఉంటాయి. రాజీవ్‌గాంధీనగర్, మూర్తిపల్లి అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు ఇన్‌ఛార్జి వైద్యులు రోజు మార్చి రోజు సేవలందిస్తున్నారు. రాజీవ్‌గాంధీనగర్ ఆరోగ్య కేంద్రానికి నిజాంవలికాలనీ వైద్యుడు, మూర్తిపల్లికి కుటాగుళ్ల వైద్యురాలు ఇన్‌ఛార్జిలుగా ఉన్నారు. రాజీవ్‌గాంధీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ వైద్యుడు ఉన్నప్పుడు రోజూ 120 మందికిపైగా వైద్యం కోసం వచ్చేవారు. ప్రస్తుతం వారి సంఖ్య 50కి పడిపోయింది. **ఖాళీల భర్తీకి ప్రకటన ఇచ్చాం - ఫైరోజా బేగం, డీఎంహెచ్‌వో**

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వైద్యుల భర్తీకి ప్రకటన వెలువడింది. నియామకాలు చేపట్టగానే ఖాళీలు భర్తీ చేసి ప్రజలకు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటాం.

## రూ. కోట్లకు మంత్రం.. అడుగుకో కుతంత్రం

విశాఖపట్నం: అన్నీ అనుకున్నట్లు జరిగితే రూ. కోట్లలో సొమ్ములొస్తాయ్! అలా కాకుండా పరిహారం భూములు దక్కినా లాభం భారీగానే ఉంటుంది!! ఇదీ కొందరి కుట్ర.

**అదెలా సాధ్యం:** భీమిలి మండలం అన్నవరంలో సర్వే నంబరు 101లో ప్రభుత్వానికి 40 ఎకరాలున్నాయి. ఇక్కడ ఎకరం ధర దాదాపు రూ. 10 కోట్ల వరకూ ఉంటుంది. వీటిని పర్యాటకశాఖకు రెవెన్యూ విభాగం 2023లోనే బదలాయించింది. హోటల్ నిర్మాణానికి ఇటీవల ఓ ప్రముఖ సంస్థకు పర్యాటకశాఖ అప్పగించింది. అయితే...విలువైన ఈ భూములను కొట్టేసేందుకు భూమాఫియా రంగంలోకి దిగింది. రైతుల పేరుతో అనేక అడ్డదారులు తొక్కుతోంది. ప్రభుత్వ భూమికి జీపీఏ (జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ) అన్ రిజిస్టర్ డాక్యుమెంటు సృష్టించేశారు. ఈ అంశంపై కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారు. వాదనలు విన్న న్యాయస్థానం నిబంధనల ప్రకారం ముందుకువెళ్లండని ఆదేశించడంతో అధికారులు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు.

**వెనుకబడిన వర్గాల జీవనోపాధికి**

ఈ భూములు 28 మంది రైతుల సాగులో ఉన్నట్లు అధికారులకు పలువురు వినతిపత్రాలిస్తున్నారు. వారికి న్యాయం చేయాలంటున్నారు. వాస్తవానికి ఈ భూములను వెనుకబడిన వర్గాల జీవనోపాధి నిమిత్తం సాగు చేయడానికి అప్పగించాలని గతంలో నిర్ణయించారు. అయితే...ఆ నిర్ణయం అమలులోకి రాలేదు. ఈ పథకం కింద అప్పగించినా వాటిని



సాగు చేసుకోవడానికే తప్ప ఆ భూములపై ఎటువంటి హక్కులుండవు. అధికారులు విచారించగా... ఆ పథకం కింద ఎవరికీ భూముల్విలేదని తేలింది. ఆ భూములను ఇచ్చినా ఎస్సీ, ఎస్టీలకు మాత్రమే ఇవ్వాలి. ఇప్పుడు వినతి ఇస్తున్న రైతుల్లో ఆ వర్గాల వారు లేరు. దీంతో ఆ పథకం కిందైనా వర్తించదని అధికారులు గుర్తించారు.

ఈ భూములకు సంబంధించి మరింత లోతుగా విచారణ జరపగా గతంలో ఓ తహసీల్దార్ తప్పుడు నివేదిక ఇవ్వడంతో ఆ లొసుగు ఆధారంగా ప్రస్తుత వ్యవహారాలు సాగుతున్నట్లు తెలిసింది. ఆ నివేదిక చెల్లదని అధికారులు పేర్కొంటున్నారు.

ఈ భూములకు సమీపంలో గతంలో వీఎంఆర్‌డీఏ భూసమీకరణ చేపట్టింది. ఆ సమయంలో ఆక్రమణదారులకు పరిహారం కింద అభివృద్ధి చేసిన ప్లాట్లు ఇచ్చారు. ఇక్కడే తామూ సాగు చేస్తున్నామని కొందరు చెప్పుకొస్తున్నారు. అధికారులు ఈ భూములకు పరిహారంగా భూములు అప్పగిస్తే వాటిని తమ గుప్పిట్లో పెట్టుకునేందుకు తెరవెనుక సూత్రధారులు కాచుక్కూర్చున్నారు.

ఆధారాలు చూపిస్తే న్యాయం చేస్తాం: అన్నవరంలో డీపట్టా భూములను గతంలో భూసమీకరణలో తీసుకున్నాం. అవి కాకుండా 98 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దానిని పర్యాటకశాఖకు బదలాయించగా ఆ స్థలాన్ని పలు సంస్థలకు అప్పగించింది. ఇక్కడ పనులు చేస్తున్న సంస్థలకు కొందరు రైతులు అడ్డుతగులుతున్నారు. రైతులు ఆధారాలు చూపిస్తే తగిన న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

సంగీత్ మాథుర్, ఆర్డీవో, భీమిలి

## అరట్లకోట.. ఉపాధ్యాయుల కోట

పాయకరావుపేట : ఉపాధ్యాయ కొలువు పొందాలంటే అహర్నిశలు శ్రమించాలి. సిలబస్‌పై పట్టు ఉండాలి. టెట్, డీఎస్సీల్లో తిరుగులేని మార్కులు సొంతం చేసుకోవాలి. లక్షల్లో పోటీ ఉన్న ఉద్యోగం సాధించడం అరుదైన గౌరవం. ఒకరు కాదు ఇద్దరూ కాదు... తాజాగా విడుదలైన డీఎస్సీ ప్రతిభా జాబితాలో అరట్లకోటకు చెందిన 10 మంది ఉద్యోగాలు సాధించి ఊరి పేరును ఉపాధ్యాయుల కోటగా మార్చారు. ఒక్కరితో మొదలై... 1989లో ఒక్కరితో మొదలైన ఉపాధ్యాయ ఉద్యోగ ప్రస్థానం ఈ రోజుకు కొత్తవారితో కలిపి 35కు చేరుకుంది. గ్రామానికి చెందిన అన్నంనీడి అప్పారావు తొలిసారిగా ఉపాధ్యాయ వృత్తిలోకి అడుగుపెట్టారు. ఇప్పటివరకు గ్రామంలోని ఉపాధ్యాయుల సంఖ్య 25. వీరిలో కొంతమంది ఒకేచోట ఇళ్ల నిర్మాణం చేసుకుని టీచర్స్ కాలనీగా నామకరణం చేశారు. సీనియర్లు ఇచ్చిన స్ఫూర్తి...బోధనపై ఆసక్తితో వీరంతా ఈ రంగంలోకి వస్తున్నారు. తాజా డీఎస్సీలో గర్లంక ప్రసాదరావు, జి.వెంకటరమణ, జి.శ్రావణి, బి.వెంకటదుర్గ, జి.రాజేష్, పి.రాజా, బి.చిన్ని, ఎన్.శ్రీను, బి.రామాంజనేయులు, జి.అనిత ఉద్యోగాలు సాధించారు. మారుమూల గ్రామీణ ప్రాంతానికి చెందిన వీరంతా ఉత్తమ ర్యాంకులతో సత్తా చాటడం విశేషం. **ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో...** చిన్నప్పట్నించి ఉపాధ్యాయుడు కావాలన్నదే నా కోరిక. ఈ వృత్తిపై మక్కువ



పెంచుకున్నాను. నోటిఫికేషన్ వచ్చిన నాటి నుంచి పట్టుదలతో చదివా. మా కన్నా ముందు ఉద్యోగాలు సాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకున్నాం. జి.రాజేష్, అరట్లకోట

**సైన్సు అంటే ఎంతో ఇష్టం...** సైన్సు సబ్జెక్టులంటే ఎంతో ఇష్టపడేదాన్ని. ముఖ్యంగా భౌతిక శాస్త్రాన్ని చాలా ఇష్టంగా చదివేదాన్ని. బీఈడీలో ఇదే సబ్జెక్టు ఎంచుకున్నా. ఉపాధ్యాయురాలిగా మారాలన్న తపన నిజమైంది. పాఠ్యాంశాల బోధనలో ప్రత్యేకత చాటుకుంటాం. బి.వెంకటదుర్గ విద్యార్థులను తీర్చిదిద్దడంలోనే.. మెరుగైన సమాజం నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైంది. అందుకే ఈ రంగాన్ని ఎంచుకున్నా. మంచి ఉపాధ్యాయినిగా పేరు తెచ్చుకుంటా. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతా. జి.శ్రావణి

## పరదా చాటున నడుము అందాలతో హైలెట్ అవుతున్న నభా నటేష్!

చాలామంది హీరోయిన్లు వెస్ట్రన్ డ్రెస్సుల్లో కంటే చీరలలో మరింత అందంగా కనిపిస్తారు. అలా చీర కట్టుకుంటే ఆ అందమే వేరు.. అయితే తాజాగా ఈ ముద్దుగుమ్మ కూడా చీర కట్టుకొని నడుము అందాలను హైలైట్ చేస్తూ కుర్రకారును మెస్మరైజ్ చేస్తోంది. మరి ఇంతకీ ఆ బ్యూటీ ఎవరు అంటే.. ఇస్మార్ట్ బ్యూటీ నభా నటేష్.. కన్నడ సినిమాల ద్వారా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన నభా నటేష్.. తెలుగులోకి 'నన్ను దోచుకుందువటే' అనే సినిమాతో అడుగుపెట్టింది. అయితే ఈ సినిమాలో హీరోయిన్ గా చేసినా అంత గుర్తింపు రాలేదు. కానీ పూరీ జగన్నాథ్ డైరెక్షన్లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' మూవీతో నభా నటేష్ కి టాలీవుడ్ లో గుర్తింపు లభించింది. అలా నభా నటేష్ తెలుగులో ఇస్మార్ట్ బ్యూటీగా సెటిల్ అయిపోయింది. ఇస్మార్ట్ శంకర్ సినిమా తర్వాత వరుసగా తెలుగు సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. అయితే ఈ మధ్యకాలంలో ఈ హీరోయిన్ కి అవకాశాలు ఎక్కువ గా రావడం లేదు. దాంతో ఇండస్ట్రీలో బిజీ అయి చేతినిండా అవకాశాలు రావడం కోసం తన అందాలతో అటు ఫాలోవర్లని ఇటు దర్శక నిర్మాతలని ఆకట్టుకోవాలని చూస్తోంది. అందులో భాగంగానే..



సాంప్రదాయంగా చీర కట్టుకొని ఉన్న నభా నటేష్ ఈ చీరలో కూడా తన అందాలను ఒలకబోస్తూ చూసేవారికి చెమటలు పట్టిస్తోంది. నభా నటేష్ అందాలను అలా చీరలో చూసిన వాళ్లు పలు రకాల కామెంట్స్ పెడుతున్నారు. వింటేజ్ లుక్ లో పేస్టల్ గ్రీన్ కలర్ శారీ , క్రీం కలర్ బ్లౌజ్ వేసుకొని తన మేకోవర్ ను ఫుల్ ఫిల్ చేసింది. ఈ వింటేజ్ లుక్ లో నభా నటేష్ అదిరిపోతోంది. అంతేకాదు వింటేజ్ శారీ కి తగ్గట్టుగానే తన కట్టుబొట్టు ఉండడంతో చాలామంది ఫాలోవర్స్ సీనియర్ హీరోయిన్ల మాదిరి అద్భుతంగా ఉన్నావు అంటూ కామెంట్లు పెడుతున్నారు. ఈ హీరోయిన్ సినిమాల విషయానికి వస్తే..తెలుగులో సుధీర్ బాబు హీరోగా నటించిన నన్ను దోచుకుందువటే అనే సినిమాతో ఎంట్రీ ఇచ్చి.. రవిబాబు డైరెక్షన్లో వచ్చిన అదుగో, పూరి జగన్నాథ్ డైరెక్షన్లో వచ్చిన ఇస్మార్ట్ శంకర్, రవితేజతో డిస్కో రాజా, సాయి దుర్గ తేజ్ తో సోలో బతుకే సో బెటర్ వంటి సినిమాల్లో నటించింది. నభా నటేష్ నుండి రాబోయే సినిమాల విషయానికి వస్తే.. హీరో నిఖిల్ తో కలిసి స్వయంభు అనే పాన్ ఇండియా మూవీతో పాటు నటుడు విరాట్ కర్ణతో నాగబంధం అనే సినిమాలో నటిస్తోంది. ఈ రెండు సినిమాలు కూడా ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్నాయి.

## నేషనల్ క్రష్ జోరు తగ్గించిందా?

నేషనల్ క్రష్ కొత్త సినిమా కమిట్ మెంట్ల జోరు తగ్గించిందా? అతివేగం ప్రమాదకరమని వేగాన్ని తగ్గిం చిందా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తుంది. గత ఏడాది పుష్ప 2 రిలీజ్ అనంతరం అమ్మడు వరుసగా రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. బాలీవుడ్ లో ఛావాతో బ్లాక్ బస్టర్ అందుకోగా, సికిందర్ ఫ్లాప్ లో ఆ హిట్ ని బ్యాలెన్స్ చేసేసింది. ఇటీవల రిలీజ్ అయిన కుబేర తో మరో గ్రాండ్ విక్టరీని అందుకుంది. మొత్తంగా రెండేళ్ల రష్మిక గ్రాఫ్ పరిశీలిస్తే ఎంతో మెరుగ్గా ఉంది.

**సౌండింగ్ గట్టిగానే:** వరుస విజయాలు అమ్మడిని అగ్ర పథాన కూర్చోబెట్టాయి. ప్రస్తుతం తెలుగులో ది గర్ల్ ఫ్రెండ్ అనే లేడీ ఓరియేంటెడ్ చిత్రంలో నటిస్తోంది. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలు సినిమాకు మంచి బజ్ ని తీసుకొచ్చాయి. రష్మిక కు సరైన టైమ్ లో పడిన ఉమెన్ సెంట్రిక్ చిత్రంగా మార్కెట్ లో సౌండింగ్



గట్టిగానే వినిపిస్తోంది. దీంతో పాటు బాలీవుడ్లో థామాలో నటిస్తోంది. ఇందులోనూ అమ్మడు శక్తివంతమైన పాత్రలో అలరించనుంది. అయితే ఈ రెండు చిత్రాలు రష్మిక కమిట్ అయి చాలా కాలమవుతోంది.

**ఛాన్సులొచ్చినా నో అంటోందా:** ఇవి రెండు రెండేళ్ల క్రితమే కమిట్ అయిన చిత్రాలు. మరి చేతిలో కొత్త కమిట్ మెంట్లు ఏవైనా ఉన్నాయా? అంటే ఒక్కటి కూడా లేదు. అవకాశాలు రాక కమిట్ అవ్వలేదా? అంటే రష్మికకు అవకాశాలు రాకపోవడం ఏంటి? అమ్మడు ఊ అనాలి గానీ దర్శక, నిర్మాతలు క్యూలో నిలబడతారు. మరే కారణంగా కమిట్ అవ్వ లేదంటే? అతివేగం ప్రమాదకరం అనే కారణం తెరపైకి వస్తోంది. అవకాశాలు వచ్చాయని కమిట్ అయి చేస్తే? అవి సరైన పాత్రలు కాకపోతే మొదటికే మోసం వస్తుందని రష్మిక కొత్త సినిమాలేవి కమిట్ అవ్వడం లేదన్న విషయం తెలిసింది.

**వచ్చే ఏడాది వరకూ ఆగాల్సిందే:** కెరీర్ పీక్స్ లో ఉందని ఏదో ఒకటి చేసేయడం కంటే? నిక్కమైన నీలంమొక్కటి చాలు అన్న తరహాలో కథాబలం సినిమా ఒక్కటి చేసినా చాలని భావిస్తోందిట. ఇటీవల వచ్చిన కొన్ని తెలుగు, హిందీ అవకా శాలను ఆ కారణంఅనే రిజెక్ట్ చేసిందిట. ప్రస్తుతానికి ఏ సినిమాలకు కమిట్ అవ్వకూడదని కొత్త సినిమాలు ఏవైనా వచ్చే ఏడాదే సైన్ చేసేలా? ఓ ప్రణాళిక సిద్ధం చేసుకుందని సమాచారం. ఆ ప్రకారమే ముందు కెళ్తుందిట. మొత్తానికి రష్మిక పాన్ ఇండియా ఇమేజ్ ఎక్కడా దెబ్బ తినకుండానే ఓ ప్లానింగ్ ప్రకారమే ముందుకెళ్తుందని తేటతెల్లమవుతోంది.




## క్రిస్మస్ ఖాళీ.. ఉన్న ఒక్కటి కూడా..?



టాలీవుడ్ యువ హీరోల్లో తన ప్రతి సినిమాతో ఆడియన్స్ కు ఒక మంచి స్పెషల్ ట్రీట్ ఇవ్వాలని అనుకునే వారిలో అడివి శేష్ ఒకడు. అతను చేస్తున్న సినిమాలు ప్రేక్షకాదరణ పొందడమే కాకుండా కొత్త సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందిస్తున్నాయి.

తెలుగులో స్పై థ్రిల్లర్ సినిమాలు చేయాలంటే అడివి శేష్ లా చేయాలన్న విధంగా క్రేజ్ తెచ్చుకున్నాడు. అడివి శేష్ ప్రస్తుతం డెకాయిట్, గూఢచారి 2 సినిమాలు చేస్తున్నాడు. గూఢచారి 2 నెక్స్ట్ ఇయర్ సమ్మర్ కి రిలీజ్ ఫిక్స్ చేశారు. డెకాయిట్ సినిమా ఈ ఇయర్ క్రిస్ మస్ కి రిలీజ్ లాక్ చేశారు.

**డెకాయిట్ సినిమా ఫస్ట్ లుక్ టీజర్..** శానీల్ డియో డైరెక్ట్ చేస్తున్న డెకాయిట్ సినిమా ఫస్ట్ లుక్ టీజర్ తోనే ఇంప్రెస్ చేసింది. డెకాయిట్ అని పెట్టి కింద ఇది ఒక లవ్ స్టోరీ అని ట్యాగ్ ఇచ్చారు. ముందు శృతి హాసన్ ని హీరోయిన్ గా తీసుకున్న ఈ సినిమాలో ఆమె ప్లేస్ లో మృణాల్ ఠాకూర్ వచ్చి చేరింది. ఐతే ఈ సినిమా క్రిస్ మస్ రిలీజ్ టార్గెట్ తో షూట్ చేస్తుండగా షూటింగ్ లో అడివి శేష్ కి గాయం తగలడంతో అనుకున్న టైం కి రిలీజ్ కష్టమే అనేస్తున్నారు. సినిమాల రిలీజ్ విషయంలో మేకర్స్ ముందే ఖర్చీఫ్ లు వేసుకుని ఉంటారు. అలా ముందు అనౌన్స్ చేయకపోతే రిలీజ్ క్లాష్ లు తప్పవు. ఐతే డెకాయిట్ సినిమా ఇప్పటికే లేట్ కాగా ఈ ఇయర్ క్రిస్మస్ రిలీజ్ కన్ ఫర్మ్ చేశారు. ఐతే ఇప్పుడు ఆ సినిమా క్రిస్మస్ కి కూడా రావడం కష్టమని అంటున్నారు. ఐతే ఈ సినిమా క్రిస్ మస్ కి వస్తుందని భావించారు మిగతా సినిమాలు కొన్ని రూట్ క్లియర్ చేశాయి. డిసెంబర్ లో సినిమాల రిలీజ్ లు ఉంటే అది ఫస్ట్ వీక్ లేదా క్రిస్మస్ వీక్ రిలీజ్ ప్లాన్ చేస్తారు. ఎందుకంటే క్రిస్మస్ టు న్యూ ఇయర్ ఆ వీక్ మొత్తం సినిమా సక్సెస్ అయితే మంచి వసూళ్లు వస్తాయి.

**అఖండ 2 తాండవం డిసెంబర్ ఫస్ట్ వీక్ రిలీజ్..** కానీ క్రిస్మస్ కి డెకాయిట్ ఒక్కటి రిలీజ్ ఉండగా ఇప్పుడు అది కూడా రాకపోవడంతో క్రిస్ మస్ ఖాళీ అయ్యే పరిస్థితి కనబడుతుంది. ఐతే క్రిస్మస్ కి డెకాయిట్ రాకపోతే మరికొన్ని సినిమాలు ఆ టైం కు రిలీజ్ షెడ్యూల్ చేసుకునే ఛాన్స్ ఉంటుంది. ఎలాగు బాలయ్య అఖండ 2 తాండవం డిసెంబర్ ఫస్ట్ వీక్ రిలీజ్ అనుకున్నారు. అదేదో క్రిస్మస్ కి తీసుకొస్తే మంచి ఇంపాక్ట్ చూపించే ఛాన్స్ ఉంటుంది. సో సంక్రాంతికి సినిమాల ఫైట్ తెలిసిందే. క్రిస్మస్ కి డెకాయిట్ ఒక్కటే రిలీజ్ అనుకోగా ఆ సినిమా మిస్ అయితే క్రిస్మస్ రేసులో ఏయే సినిమాలు రిలీజ్ అవుతాయన్నది చూడాలి.

## చాయ్ వాలా: ఎమోషన్ తో కనెక్ట్ అయ్యే సినిమా




టాలీవుడ్‌లో సెన్సిబుల్ సినిమాల కోసం ఎదురుచూసే ప్రేక్షకుల కోసం వస్తోన్న కొత్త చిత్రం చాయ్ వాలా. యంగ్ హీరో శివ కందుకూరి హీరోగా హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాధా విజయలక్ష్మి, వెంకట్ ఆర్. పాపుడిప్పు నిర్మించిన ఈ సినిమాకు ప్రమోద్ హర్ష దర్శకత్వం వహించారు. తాజాగా విడుదలైన టీజర్‌తో సినిమా మీద ఆసక్తి మరింత పెరిగింది. "నా చాయ్ విలువ రూ.15.. అంతకంటే ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా నా విలువ పడిపోతుంది" అంటూ రాజీవ్ కనకాల చెప్పిన డైలాగ్‌తో టీజర్ ఆరంభం కావడం అందరినీ ఆకట్టుకుంది. శివ కందుకూరి చెప్పిన లైన్, "ప్రతీ పేజీలో కల్కి స్టోరీ రాస్తే పాస్ అయిపోయేవాళ్లం కదరా" అని చెప్పడం యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉంది. ఫాదర్ అండ్ సన్ ఎమోషన్స్, లవ్ ట్రాక్, యూత్ కనెక్ట్ కలగలిపి చూపించిన ఈ టీజర్ ప్రేక్షకుల హృదయాలను తాకేలా ఉంది. టీజర్ లాంచ్ ఈవెంట్‌లో రాజ్ కందుకూరి మాట్లాడుతూ "థియేటర్‌లో వదిలేయకుండా ఇంటికి తీసుకెళ్లే చిత్రాలే హిట్ అవుతాయి. చాయ్ వాలా చూసిన తరువాత ఎమోషన్‌తో బయటకు వస్తారు. శివ, రాజీవ్ కనకాల, తేజు అశ్వినీ లాంటి నటీనటులు అద్భుతంగా చేశారు" అన్నారు. ఆయనతో పాటు టీమ్‌కి సంబంధించిన ఇతరులు కూడా సినిమా పట్ల నమ్మకం వ్యక్తం చేశారు. హీరో శివ కందుకూరి మాట్లాడుతూ "చాయ్ వాలా టీమ్‌తో నాకు మంచి బంధం ఏర్పడింది. ఈ సినిమా చూసిన తర్వాత తండ్రితో తప్పక మాట్లాడాలని అనిపిస్తుంది. రాజీవ్ కనకాల గారితో పనిచేయడం నాకు లైఫ్‌లో గుర్తుండిపోతుంది. తేజు అశ్వినీ చాలా టాలెంటెడ్ ఆర్టిస్ట్. మా సినిమా అందరికీ నచ్చుతుందని నమ్ముతున్నాను" అన్నారు. దర్శకుడు ప్రమోద్ హర్ష మాట్లాడుతూ "ప్రతీ మనిషి జీవితంలో జరిగే సంఘటనలే మా సినిమాలో ఉంటాయి. శివ ఈ కథకు సరైన ఫేస్ అని అనిపించింది. అందుకే ఆయనకే కథ చెప్పాను" అన్నారు. నిర్మాత వెంకట్ పాపుడిప్పు మాట్లాడుతూ "ఇల్లు కట్టి చూడు, పెళ్లి చేసుకొని చూడు అని అంటారు. కానీ సినిమా చేస్తేనే అసలు విషయం తెలుస్తుంది.

కొన్ని సీన్లు చూడగానే నా కంట నీళ్లు వచ్చాయి" అని ఎమోషనల్ అయ్యారు. రాజీవ్ కనకాల, తేజు అశ్వినీ, రాజ్ కుమార్ కసిరెడ్డి వంటి నటీనటులు కూడా చాయ్ వాలా కథ, దర్శకత్వం, టెక్నికల్ టీమ్‌ను ప్రశంసించారు. ప్రత్యేకంగా రాజీవ్ కనకాల "శివ ఆకలితో ఉన్న ఆర్టిస్ట్, ఎంతో ఎత్తుకు వెళ్లాలి" అని చెప్పడం హైలైట్ అయ్యింది. డీఓపీ క్రాంతి అందించిన విజువల్స్, రైటర్ ఇమ్రాన్ రాసిన డైలాగులు సినిమాకు బలమైన పాయింట్స్ అని టీమ్ పేర్కొంది. త్వరలోనే థియేటర్లలో ఈ చిత్రం ప్రేక్షకులను పలకరించనుంది.

## రొమాంటిక్ కథలే ఇష్టమంటున్న అమ్మడు..!

తనకు రొమాంటిక్ కథలు ఇష్టమైతే ఆఫర్లు మాత్రం అలాంటివి రావట్లేదని అంటుంది కన్నడ భామ శ్రీనిధి శెట్టి. కె.జి.ఎఫ్ 1 అండ్ 2 సినిమాలతో సూపర్ సక్సెస్ అందుకుని పాన్ ఇండియా హిట్ కొట్టినా కూడా అమ్మడికి అవకాశాలు పెద్దగా రాలేదు. అదేంటి అంటే తనకు నచ్చిన సినిమాలు వస్తే తప్ప తాను ఓకే చేయనని అంటుంది. కె.జి.ఎఫ్ తర్వాత చియాన్ విక్రం తో కోబ్రా చేసింది. అది ఎలా వచ్చిందో అలా వెళ్లింది. ఐతే ఆ తర్వాత హిట్ 3 సినిమా చేసింది. తెలుగులో ఆమెకు ఇదే తొలి స్ట్రైట్ సినిమా. ఆ సినిమా థ్రిల్లర్ కన్నా వైలెన్స్ తో విధ్వంసం సృష్టించింది.

**సినిమా ప్రమోషన్స్ లో శ్రీనిధి బిజీ..** ఇక లేటెస్ట్ గా అమ్మడు సిద్ధు జొన్నలగడ్డతో తెలుసు కదా సినిమా చేసింది. అక్టోబర్ 17న సినిమా రిలీజ్ అవుతుంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో శ్రీనిధి బిజీ బిజీగా ఉంది. ముఖ్యంగా తనకు తెలుసు కదా లాంటి రొమాంటిక్ లవ్ స్టోరీస్




ఇష్టం. కానీ తనకు మాత్రం కె.జి.ఎఫ్, హిట్ 3 లాంటి కథలు వస్తున్నాయి. పర్సనల్ గా రొమాంటిక్ ఎంటర్టైనర్స్ ఇష్టమని ఐతే తెలుసు కదా చూస్తే ఇదేదో ట్రయాంగిల్ లవ్ స్టోరీ అనుకుంటారు కానీ సినిమాలో కొత్త పాయింట్ ఉంటుందని అది ఆడియన్స్ ని సర్ ప్రైజ్ చేస్తుందని అంటుంది శ్రీనిధి శెట్టి. తన క్యూట్ లుక్స్ తో ఆడియన్స్ ని ఫిదా అయ్యేలా చేస్తున్న శ్రీనిధి సినిమాల విషయంలో కచ్చితమైన నిర్ణయాలతో ఉంటుందట. కథ నచ్చితేనే తప్ప రెమ్యునరేషన్ కోసమో లేదా మొహమాట పడో అసలు సినిమా చేయనని ఇదివరకే చెప్పింది శ్రీనిధి శెట్టి. తెలుగులో నానితో హిట్ 3 తో సక్సెస్ అందుకున్న అమ్మడికి తెలుసు కదా సినిమా కూడా ఒక మంచి బ్రేక్ ఇస్తుందని భావిస్తుంది.

**శ్రీనిధి లుక్స్ మాత్రం..** తెలుసు కదా సినిమాలో సిద్ధు, శ్రీనిధి శెట్టి తో పాటు రాశి ఖన్నా కూడా నటించింది. సినిమాలో ఎవరి పాత్ర ఎలా టర్న్ తీసుకుంటుంది. ఈ ముగ్గురి ప్రేమ కథ ఎలా ముగుస్తుంది అన్నది సినిమా చూస్తేనే తెలుస్తుంది. ఐతే శ్రీనిధి లుక్స్ మాత్రం తెలుసు కదా సినిమాలో ఇంప్రెస్ చేస్తున్నాయి. సినిమాతో అమ్మడు మరో సక్సెస్ అందుకుంటే మాత్రం తెలుగులో మిగతా హీరోయిన్స్ కి ఫైట్ తప్పదని చెప్పొచ్చు. అసలే కన్నడ భామలకు తెలుగులో మంచి క్రేజ్ ఉంటుంది. ఆ లిస్ట్ లో తన పేరు కూడా యాడ్ అయ్యేలా శ్రీనిధి ప్రయత్నాలు చేస్తుంది. శ్రీనిధి సినిమాలే కాదు ఆమె ఫోటో షూట్స్ కూడా ఆడియన్స్ ని ఆకట్టుకుంటున్నాయి. తెలుగుతో పాటు అమ్మడు తమిళ పరిశ్రమ మీద కూడా ఫోకస్ చేసినట్టు తెలుస్తుంది.

## అనసూయ మేడం ఖాళీగా ఏం లేదట..!

జబర్దస్త్ కామెడీ షో తో తెలుగు ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ముద్దుగుమ్మ అనసూయ. చాలా తక్కువ సమయంలోనే హీరోయిన్స్ రేంజ్‌లో అనసూయకు గుర్తింపు దక్కింది. ఒక యాంకర్‌గా ఎప్పుడూ, ఎవరికీ రాని గుర్తింపును అనసూయ దక్కించుకుంది. జబర్దస్త్ షో లో యాంకరింగ్ చేసినందుకు గాను అనసూయ సినిమాల్లో నటించే అవకాశాలు దక్కించుకుంది. పలు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్టుగా, కొన్ని సినిమాల్లో స్పెషల్ సాంగ్స్‌లో అనసూయ చేసిన విషయం తెల్సిందే. హీరోయిన్‌గానూ ఆఫర్లు దక్కించుకున్న అనసూయ జబర్దస్త్ మానేసిన తర్వాత కాస్త ఆఫర్లు తగ్గాయి అంటూ చాలా మంది కామెంట్స్ చేస్తూ ఉంటారు. అనసూయ జబర్దస్త్ మానేయడం ద్వారా ఆమె పాపులారిటీ కూడా తగ్గుతూ వచ్చిందని సోషల్ మీడియాలో ప్రముఖంగా చర్చ జరుగుతూ ఉండేది. అనసూయ జబర్దస్త్‌ను వదిలేయడం తప్పే అని చాలా మంది అంటూ ఉంటారు. ఈ ఏడాది



పవన్ కళ్యాణ్ హరి హర వీరమల్లు సినిమాలో ప్రత్యేక పాటలో కనిపించిన అనసూయ మరే సినిమాతోనూ ఈ ఏడాదిలో వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గత ఏడాది పుష్ప 2 సినిమాలో కనిపించింది. పుష్ప 1 సినిమాలోని పాత్రతో పోల్చితే పుష్ప 2 లో అనసూయ పాత్ర పరిధి తగ్గిందని, అంతే కాకుండా స్క్రీన్ ప్రజెన్స్ చాలా వరకు తగ్గిందని ఆమె అభిమానులు అనుకున్నారు. అయినా కూడా పుష్ప తర్వాత అనసూయ రేంజ్ మరింతగా పెరుగుతుందని ఆశించిన అభిమానులకు నిరాశే మిగిలింది. సుకుమార్ అంతకు ముందు రంగస్థలం సినిమాలో ఈమెకు రంగమ్మత్త పాత్ర ఇవ్వడం ద్వారా ఒక్కసారిగా స్టార్‌ను చేశాడు. ఆ పాత్ర వల్లే అనసూయకు టాలీవుడ్‌లో పదుల సంఖ్యలో సినిమా ఆఫర్లు వచ్చాయి అనేది చాలా మంది చెప్పుకునే విషయం.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536